

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 90 పేజీలు: 10+4 వెల: 6.50


మూడో కాన్పుకు ప్రసూతి సెలవులు ఇవ్వాల్సిందే: -మద్రాసు హైకోర్టు 5

మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం.. 15 మంది మృతి

పెనుభారం మోపిందని కేబినెట్‌లో పాక్ ప్రధాని షరీఫ్ ఆందోళన

800 మిలియన్ డాలర్లకు పెరిగిన చమురు దిగుమతి బిల్లు

## ఇరాన్ యుద్ధంతో పాక్ కుదేలు



5

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## ఆపరేషన్ సిందూర్ నిలిపివేత మా సొంత నిర్ణయమే!

5





# పాతాళానికి నీరు!

ప్రాజెక్టుల్లో అడుగంటిన నీటిమట్టాలు

శ్రీశైలంలో ఉన్నవి 40 టిఎంసిలే

వెంటాడుతున్న ఎల్‌నినో భయాలు

వానాకాలం సాగుపై రైతుల్లో ఆందోళన

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రిజర్వాయర్లు అడుగంటిన వేళ ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షాలు తక్కువగా కురుస్తాయన్న వాతావరణశాఖ అంచనాలతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ వానాకాలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు ఇప్పటికే హెచ్చరించాయి. ప్రధానంగా వానాకాలంపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని సాధారణంగా వర్షపాతం తగ్గి, ఎండలు క్కువగా ఉంటాయని పేర్కొంది. జూన్ - సెప్టెంబర్, ఆగస్టు-సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం బలహీనంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ సంస్థలు అంచనా వేశాయి. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ఎఫెక్ట్‌తో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటే వానాకాలం సాగుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వ్యవసాయ, నీటిపారుదలరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏరనపడి నీటికొరత, పంటల దిగుబడి >>2

# సకాలంలో పుస్తకాలు

## వస్తువుల నాణ్యతలో రాజీపడొద్దు

జవాబుదారీకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ అవసరం

సంక్షేమ శాఖలపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్30:** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని.. సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడం పైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు.విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం >>2



గురువారం సంక్షేమశాఖ సమీక్షలో సిఎం రేవంత్

## మేడే శుభాకాంక్షలు

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్30:** మే డే(మే 1వ తేదీ) సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో >>2



## రెండు రోజులు తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

కొనసాగనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** మండే ఎండలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం దక్షిణ కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపరితల ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులతో శుక్ర, శనివారాల్లో రెండు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే గరిష్ఠ >>2

# నెలాఖరుకు డబుల్‌బెడ్ ఇళ్లు

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీలేదు

సరిహద్దు వివాదాలకు స్వస్తి పలకాలి

ఇళ్ల నిర్మాణాలకు గ్రీన్‌ఛానల్‌లో నిధులు

ప్రజాప్రతినిధులతో సమీక్షలో మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్30:** రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు ఏస్థాయిలో కూడా ఉన్నా కూడా మేనెల చివరి నాటికి లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న ఇండ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.అంసపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి, తదుపరి అవసరమైన వ్యయాన్ని 5 లక్షల లోపు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందచేస్తామని వెల్లడించారు. అసంపూర్తిగా ఉన్న 2 బిహెచ్ కె లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ ఇండ్ల నిర్మాణాలకు గ్రీన్ ఛానల్ లో నిధులు విడుదల చేస్తామన్నారు. గురువారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో హౌసింగ్ రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ, కరీంనగర్ ఇన్ ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటిపరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హెచ్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలని, విద్యుత్, మంచినీటి, డ్రైనేజి , రోడ్లు వంటి కనీస వసతులు కల్పించాలని చాలా ఇండ్లలో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తక్షణమే అనర్హులను తొలగించే చర్యలు చేపట్టాలని, అర్హులకు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. రూ.400 కోట్లతో 2 బిహెచ్ కె కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు తీసుకుని అక్కడ నివసించని వారి ఇండ్లను రద్దు చేసి, అర్హులైన ఇతరులకు వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నారు 2 బిహెచ్ కె బిల్లుల చెల్లింపుల్లో, అక్రమాలకు పాల్పడితే సస్పెండ్ తో సరిపెట్టనని సర్వీసు నుంచి తొలగించడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. పేదవారి సొంత ఇంటి కలను నిజం చేసేలా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదే అని, ఎల్1, ఎల్2, ఎల్3 దరఖాస్తు ఇప్పుడు చేశారు, >>2



ప్రభుత్వ సలహాదారుగా

## విహెచ్ నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్30:** కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (బీసీ సంక్షేమం, అభివృద్ధి) రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కేబినెట్ హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, విహెచ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా తనకు నెలకు రూ.1 లక్ష వేతనం వస్తుందని, తన రెండేళ్ల పదవీ కాలంలో వచ్చే మొత్తాన్ని ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న విద్యార్థుల కోసం ఇస్తానని వి. హనుమంతరావు ప్రకటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, తన పదవీ కాలం రెండేళ్ల పాటు ఉంటుందని, ప్రతి నెల రూ.1 లక్ష వేతనం వస్తుందని >>2

'అమ్మ' దర్శనానికి వెళ్లి వస్తూ ఐదుగురి సజీవదహనం 3

# బిజెపి బలోపేతం

పార్టీలో చేరిన 40లక్షల మంది కొత్త సభ్యులు

మోడీపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఓట్ల శాతం గణనీయంగా పెరగడం, గ్రామం నుండి జిల్లా వరకు బలపడటం మోడీ నాయకత్వంపై ప్రజల నమ్మకానికి స్పష్టమైన నిదర్శనం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ మే నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం, దేశ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత, మొదటిసారిగా హైదరాబాద్ నగరానికి రానుండటం ఎంతో విశేషంగా ఉందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు భారతీయ జనతా పార్టీపై అపార విశ్వాసం చూపించారన్నారు. ఎన్నికల తర్వాత తెలంగాణలో బిజె;పి మరింత బలంగా ఎదిగి, సుమారు 40 లక్షల మంది కొత్త సభ్యులు పార్టీలో చేరడం జరిగిందన్నారు. బూత్ స్థాయి నుండి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బిజెపి విజయం సాధించడం, ప్రత్యేకంగా ఉత్తర తెలంగాణలో పార్టీ బలం పెరిగిందని చూపిస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు, కొన్ని ప్రాజెక్టులను తెలంగాణ ప్రజలకు అంకితం చేయనున్నారని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఇది తెలంగాణ అభివృద్ధికి మరొక పెద్ద మైలురాయి. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇప్పటికే అనేక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశంలో మరిన్ని ప్రాజెక్టులకు ఆమోదం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని, రైల్వే రంగంలో తెలంగాణకు సుమారు రూ.85,000 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. పలు ప్రాజెక్టులు 90శాతం వరకు పూర్తి అయ్యాయని తెలిపారు.

# ఇంకా పెట్రో కష్టాలే!




ఇంధన సరఫరా మెరుగుపడినా బంకుల వద్ద 'నోస్టాక్' బోర్డులు ప్రత్యక్షం

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని రోజులుగా నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరత పరిస్థితులు కొంత మెరుగయ్యాయి. చమురు మార్కెటింగ్ సంస్థలు ఇందన సరఫరాను గణనీయంగా పెంచాయి. బంకులకు వచ్చే ఆయిల్ ట్యాంకర్ల సంఖ్య పెరిగి పరిస్థితి కాస్త కుదుటపడింది. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఇంకా వందల సంఖ్యలో పెట్రోల్ బంకుల ఎదుట నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇందన సరఫరా మెరుగుపడినా, డిమాండ్‌కు తగినంతగా నిల్వలు ఇంకా అన్ని ప్రాంతాలకు చేరుకోలేదని స్పష్టమవుతోంది. దీంతో పలు జిల్లాల్లోని ప్రధాన కేంద్రాల్లో పెట్రోల్ కోసం వాహనదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఉదయం బంకులు తెరుచుకోకముందే బారులు తీరుతున్నారు. కేవలం వాహనాలే కాకుండా, బాటిళ్లతో కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో కొన్నిచోట్ల ఉద్రిక్త >>2



## ప్రభుత్వ సలహాదారుగా శివధర్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** డిజిపిగా గురువారం నాడు పదవీ విరమణ చేసిన బి. శివధర్ రెడ్డి ప్రభుత్వ సలహాదారుగా నియమి తులయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. శాంతి భద్రతలు, >>2

ఎన్నో సవాళ్లు.. మరెన్నో

# సంతోషాలు

32 యేళ్ల సర్వీసులో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా..

నక్సలిజం కట్టడిలో తెలుగు రాష్ట్రాలు రోల్ మోడల్

వీడ్కోలు పెరేడ్‌లో డిజిపి శివధర్‌రెడ్డి

శివధర్ వ్యూహాలు అసాధారణం: కొత్త డిజిపి ఆనంద్

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర డిజిపిగా ఏడు నెలల పాటు పనిచేసిన శివధర్ రెడ్డి గురువారం నాడు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటల సమయంలో హిమాయత్‌సాగర్‌లోని రాష్ట్ర పోలీసు అకాడమిలో పోలీసు శాఖ తరపున ఆయనకు ఘనంగా వీడ్కోలు పరేడ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నూతన డిజిపి >>2



న్యూఢిల్లీలో గురువారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన ఇటలీ రక్షణ మంత్రి గైడో క్రోసెట్టో

# ఇటలీ భారత్‌లమధ్య రక్షణరంగ భాగస్వామ్యం మరింత పటిష్టం

## ఇటలీ రక్షణమంత్రి క్రోసెట్టోతో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** భారత్ ఇటలీ దేశాలమధ్యరక్షణరంగ భాగస్వామ్యం మరింత బలపడే విధంగ ఆరెండుదేశాల రక్షణమంత్రుల సమక్షంలో ఒప్పందాలు రిగాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఇటలీ రక్షణమంత్రి గ్యూడో క్రోసెట్టో భారత్ పర్యటనలో భాగంగా గురువారం ఆయనతో చర్చలుజరిపారు. ద్వైపాక్షిక మిలిటరీ పరస్పర సహకార ప్రణాళికపై ఇరువురు మంత్రులమధ్య చర్చలుజరిగాయి. మాణెక్‌షా కేంద్రంలోజరిగిన ఈచర్చల్లో రక్షణరంగ పారిశ్రామిక సహకారం రెండుదేశాలమధ్య మరింతపెరగాలని సూచించారు. ఇరుదేశాల రక్షణమంత్రులు కూడా భారత్ ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యం శాంతి, సుస్థిరత, స్వేచ్ఛ, పరస్పర గౌరవం ఆధారంగానే ముందుకు వెళతాయని స్పష్టంచేసారు. కొత్తగా జరిగిన మిలిటరీ కోఆపరేషన్‌ప్రణాళికప్రకారం ఇక రానున్న కాలంలో రెండుదేశాల సాయుధ దళాలు, రెండుదేశాల మిలిటరీ సంప్రదింపులు వచ్చే ఏడాదినుంచే ప్రారంభం అవుతాయని రక్షణశాఖ ప్రకటన విడుదలచేసింది. అనేక మౌలిక సమస్యలు, కీలక అంశాలపై మా ఇద్దరిమధ్య సమగ్ర చర్చలుజరిగాయని ప్రాంతీయ, ప్రపంచ స్థాయి అంశాలు కూడా చర్చకు వచ్చాయని రాజ్‌నాథ్‌సింగ్ ట్వీట్‌చేసారు. అలాగే పశ్చిమాసియాలో ఉన్న ప్రస్తుతపరిస్థితిపైనా చర్చించామన్నారు. రెండుదేశాలకు ఉపకరించేవిధంగా రక్షణరంగ పారిశ్రామిక సహకారం అంటే ఉత్పత్తి, తయారీ వినియోగం వంటి వాటిలోకూడా చర్చించామని, భారత్ ఆత్మనిర్భర్‌భారత్ ప్రణాళికతోఆటు ఇటలీ రక్షణరంగ సహకార కార్యాచరణపైనా చర్చలు జరిపామని తెలిపారు. అలాగే రెండుదేశాల సైనికదళాలు పరస్పరం కవాతులు, విన్యాసాలు చేసుకోవడం ద్వారా రక్షణరంగ భాగస్వామ్యం అవగాహణ మరింతపెరుగుతుందన్నారు. అంతకుముందు జాతీయ అమరవీరుల స్థూపం వద్ద ఇటలీ రక్షణమంత్రి క్రోసెట్టో నివాళులర్పించారు. అలాగే మానెక్‌షా కేంద్రంలో ఇటలీ రక్షణమంత్రి త్రివిధ దళాల గౌరవవందనం స్వీకరించారు.

# నెలాఖరుకు డబుల్‌బెడ్‌ఇళ్లు

>> అప్పుడు చేశారనేది ముఖ్యం కాదనీ పేదరికమే అర్హతని, అర్హులైన వారికి ఇండ్లను ఇవ్వడమే కలెక్టర్ల బాధ్యత అని అన్నారు. మొదటి విడతలో వివిధ కారణాలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోని వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. పేదవాడికి సహాయం అందించాలన్న సదుద్దేశ్యంతో సిఎం రేవంత్ రెడ్డి ఇంటి నిర్మాణానికి అవసరమైన 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందచేస్తున్నారని తెలిపారు. అయితే లబ్దిదారుల ముసుగులో అక్కడక్కడా దుర్వినియోగం అవుతున్నదన్న సమాచారం ఉన్నదని, ఈ నేపథ్యంలో అర్హులకు ఇసుక అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఆచరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై ఒక పాలసీని రూపొందించాలని సూచించారు నగరానికి దూరంగా 2బిహెచ్ కె కాలనీలను నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఇష్ట పడటం లేదని, అక్కడ నివసిస్తే తమ జీవనోపాధికి ఇబ్బందికి కలుగుతుందని లబ్దిదారులు వెళ్లడం లేదు. తీసుకున్న ఇండ్లను అద్దెకి ఇచ్చి నగరంలోనే ఉంటున్నారు. ఇలాంటి వారిని గుర్తించి, వారి స్థానంలో, ఆయా కాలనీలకు సమీపంలో నివసించే వారికి కేటాయించలన్న ఆలోచన చేస్తున్నాము. దీనిపై ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి పడబోమని మంత్రి స్పష్టం చేశారు. భూములను ఆక్రమణలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం రెవెన్యూ, ఫారెస్టు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ సర్వేలను శాస్త్రీయ పద్దతుల్లో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిర్వహించి భూముల స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని సూచించారు. దీనిద్వారా భవిష్యత్తుల్లో వివాదాలకు తెరపడుతుందన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్ మెంట్,భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. భూ రికార్డుల్లో పాదర్శకత, ఖచ్చితత్వం తీసుకుని రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లను మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఎక్కడా కలపడం కానీ, తీసివేయడం గానీ లేదని తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని, అలాగే ఎమ్మార్వో ఆర్డీవో కార్యాలయాలు కూడా నిర్మిస్తున్నామని వీటికి అవసరమైన ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్యదర్శి విపి గౌతం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభం**

హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కెవి ఉత్పాదన సామర్థంతో నెలకొల్పిన సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ప్లాంట్ ను గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. దీని ద్వారా నెలకు సుమారు 4500 యూనిట్ల మేర విద్యుత్ ను ఉత్పత్తి చేయవచ్చు. హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో వినియోగించే విద్యుత్‌లో ఈమేరకు ఆదా అవుతుందని ఎండి విపి గౌతం తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

>> ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మరోవైపు.. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉందని ఐఎండి అధికారి ధర్మరాజు తెలిపారు. ద్రోణి, ఉపరితల, చక్రవాక ఆవర్తనం, క్యూములోనింబస్ మేఘాల వల్ల రాగల నాలుగైదు రోజులు ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

# సకాలంలో పుస్తకాలు

>> ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టిజిబిసిడబ్ల్యుఆర్ఐఈఎస్ కార్యదర్శిబి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మేడే శుభాకాంక్షలు

>> ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వామ్యులని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యవిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు.కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.

## వారం - వర్జ్యం

01-05-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, కృత్తిక కార్తె
పౌర్ణమి రా.10.54
స్వాతి తె.4.35
వర్జ్యం : ఉ.8.26–ఉ.10.11
దు.ఉ.8.15 – ఉ.9.06, 2)మ.12.30–మ.1.21
శుభసమయం : ఉ.7.30–8.00
రాహుకాలం – ఉ.10.30–12.00

## వార్తాఫలం

**మేషం :** చిట్టి పొట్టి వివాదాలు ఈ రోజు చోటు చేసుకున్నప్పటికీ మీపై అవి పెద్దగా ప్రభావం చూపవు. బంధువుల కలయిక.

**వృషభం:** సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం:** వద్దు అనుకున్న వలు అవకాశాలు దగ్గరకు రానున్నాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కర్కాటకం:**నిర్మాతలకు, ఎగ్జిబ్యూటర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు అనుకూల ఫలితాలే గోచరిస్తున్నాయి.ఆరోగ్యంపట్ల శ్రద్ధ అవసరం.

**సింహం:** మీ చేతికందవలసిన ధనంలో మూడువంతులు చేతికందుతుంది. మీ అంచనాలు దరిదాపుగా నిజమవుతాయి.

**కన్య:** విదేశీయాన యత్నాలు, దూరప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. వస్తుభద్రత పట్ల జాగ్రత్త వహించండి.వస్త్రలాభం.

**తుల:**చాలా విషయాలలో ఒంటరి పోరాటం చేయవలసి వస్తుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

**వృశ్చికం:** అంతిమ విషయాలు మాత్రం మీ సొంతమవుతాయి. సహోద్యోగులతో జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది.

**ధనుస్సు:** అనేక సందర్భాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. కాని వాటిని పాటించరు.చర్చాగోష్ఠులలో పాల్గొంటారు.

**మకరం:** సంతాన విద్యా విషయ వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వృత్తి పరంగా సాధారణంగా వుంటుంది.వ్యాపారాలు లాభిస్తాయి.

**కుంభం:** ముందుచూపుతో అనేక కార్యక్రమాలను ఏకకాలంలో ప్రారంభిస్తారు. ఆరోగ్యం పరంగా జాగ్రత్తలు అవసరం.

**మీనం :**సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల అండదండలు సాధించుకోవడానికి ఎంతో కృషి చేస్తారు. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# పాతాళానికి నీరు!

>> తగ్గడం, భూగర్భజలాల స్థాయి పడిపోవడం వంటి కరువు ఛాయలు చుట్టుముట్టనున్నాయి. కాగా.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రిజర్వాయర్లు అడుగంటిపోయాయి. భూగర్భజలాలు కూడా పాతాళానికి పడిపోయాయి. భారీ ప్రాజెక్టులే కాకుండా బేసిన్‌లోని మధ్యతరహా, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయి. ప్రధానంగా కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో నీటి మట్టం అడుగంటిపోయింది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థం 215.81 టిఎంసిలు కాగా డిసెంబర్ నాటికి 210.81 టిఎంసిలు ఉన్నాయి. కాగా ప్రస్తుతం 40 టిఎంసిలు ఉన్నాయి. రిజర్వాయర్ ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్‌తోపాటు మరో రెండు జిల్లాల తాగునీటి అవసరాలను రిజర్వాయర్ నుంచే తీర్చాల్సి ఉంది.

ప్రస్తుతం డెడ్‌స్టోరేజీ వరకు అందుబాటులో ఉన్నదే 10 టీఎంసీలు. నాగార్జునసాగర్‌లో నీటినిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, కోదాడ, నల్లగొండ, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉన్నది. జూన్‌లో వానలు ప్రారంభమయ్యే వరకూ తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంది. ఇక గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టుల్లో కొద్దిమేర ఆశించిన స్థాయిలో జలాలు ఉన్నప్పటికీ అవసరాలు భారీగా ఉండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు అడుగంటిపోతున్నాయి. రామప్ప, లక్నవరం, పాకాల, మత్తడివాగు, నీల్వాయి, కిన్నెరసాని, పాలేరు, పాలెం, కోటిపల్లి, వైరా, లంకాసాగర్, మూసి, శనిగరం, రామడుగు, మల్లూరు, గుండ్లవాగు, బయ్యారం, స్వర్ణ తదితర అనేక ప్రధాన మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్‌స్టోరేజీకి చేరుకొన్నాయి. ఇక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో చెరువులు, చెక్‌డ్యామ్‌ల్లోనూ ప్రస్తుతం 25శాతం మేర కూడా నీటి నిల్వలు అందుబాటులో లేవని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టులు అడుగంటి పోవడంతో భూగర్భజల మట్టాలు తగ్గిపోతున్నాయి.

# కోహినూర్ వజ్రాన్ని తిరిగి ఇచ్చేయండి...

## బ్రిటన్ కింగ్ ఛార్లెస్‌ను కోరిన న్యూయార్క్ మేయర్

**వాషింగ్టన్, ఏప్రిల్ 30:** న్యూయార్క్ సిటీ మేయర్ జోహ్రాన్ మామ్‌దానీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ తనకు కింగ్ ఛార్లెస్3తో మాట్లాడే అవకాశం వస్తే, కోహినూర్ వజ్రాన్ని తిరిగి ఇవ్వాలని కోరేవాడినన్నారు. కోహినూర్ వజ్రాన్ని అప్పగించమని కింగ్ ఛార్లెస్‌ను ఎంకరేజ్ చేసేవాడినని ఓ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. బ్రిటీష్ చక్రవర్తి కింగ్ ఛార్లెస్ ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఒకవేళ కింగ్ ఛార్లెస్‌ను కలిస్తే ఏం అడుగుతారని మామ్‌దానీని అడిగిన సందర్భంలో ఆయన ఈ సమాధానం ఇచ్చారు. అమెరికా ఉభయసభలను ఉద్దేశించి మాట్లాడడం గౌరవప్రదంగా ఉన్నట్లు కింగ్ ఛార్లెస్ తెలిపారు. వైట్‌హౌజ్‌లో తనకు, క్వీన్ కమిల్లాకు ట్రంప్ దంపతులు విందు ఇచ్చినట్లు ఛార్లెస్ పేర్కొన్నారు. న్యూయార్క్ సిటీలో ఉన్న 9/11 స్మారకాన్ని కింగ్ ఛార్లెస్ దంపతులు విజిట్ చేశారు. ఉగ్రవాద బాధితులకు నివాళి అర్పించారు. మన్‌హట్టన్‌లో పేద పిల్లలు, కుటుంబాలకు మద్దతు ఇస్తున్న హార్లేమ్ గ్రోన్ అర్బన్ ఫామ్స్‌ను కూడా ఛార్లెస్ సందర్శించారు. అయితే 9/11 స్మారకం వద్ద కింగ్ ఛార్లెస్‌ను మామ్‌దానీ కలిశారు. 1849లో మహారాజా దులీప్ సింగ్ 105.6 క్యారెట్ల కోహినూర్ వజ్రాన్ని క్వీన్ విక్టోరియాకు అందజేశారు. 1937లో ఆ వజ్రాన్ని ఛార్లెస్ మాతృమూర్తి క్వీన్ ఎలిజబెత్ ధరించింది. బ్రిటన్ వద్ద ఉన్న ఆ విలువైన వజ్రాన్ని మళ్లీ స్వదేశానికి తీసుకువచ్చేందుకు వీలైనంత ప్రయత్నం చేస్తామని భారత్ పేర్కొన్న విషయం తెలిసిందే.

# జిల్లాల్లోని గురుకులాలను ఆకస్మిక తనిఖీ చేస్తా

## -మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ గురకులాల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని.. భవిష్యత్‌లో 100 శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అధికారులను ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశించారు. రానున్న రోజుల్లో జిల్లాల్లో ఉన్న గురుకులాలను ఆకస్మిక తనిఖీలు చేస్తానని, గురుకుల సొసైటీలో సమస్యగా ఉన్న డిప్యూటేషన్ల సమస్యను 6 నెలల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. బుధవారం ప్రకటించిన ఎస్ఎస్‌సి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎస్సీ గురుకుల విద్యార్థులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సత్కరించి, అభినందించారు. గురువారం హైదరాబాద్‌లోని ఎస్సీ గురుకుల సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్, గిరిజన శాఖ డైరెక్టర్, ఇంచార్జ్ కమిషనర్ సంతోష్, మంత్రి ఓఎస్‌డీ వై.జె విజయ్ కుమార్, ఎస్సీ గురుకుల సొసైటీ జాయింట్ సెక్రెటరీలు బానోతు గీత, షక్రు నాయక్, ఆశ్రమ పాఠశాల డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డితోపాటు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు 2026 పదవ తరగతి ఫలితాల్లో 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయన్నారు. గత 30 ఏళ్లల్లో ఎన్నడూ ఇంత ఉత్తీర్ణతా శాతం సాధించలేదన్నారు. ఎస్ఎస్‌సి పరీక్షలకు 17,071 మంది హాజరుకాగా వారిలో 16,921 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.



లేహ్‌లోని విమానాశ్రయంలో గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్‌సక్సేనా తదితరులు

# ఎన్నో సవాళ్లు.. మరెన్నో సంతోషాలు

>> ఆనంద్‌తో పాటు అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్, సీనియర్ పోలీసు అధికారులు శిఖా గోయల్, సౌమ్యా మిశ్రా, మహే ష్ భగవత్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. వీడ్కోలు పరే డ్‌లో మాట్లాడిన శివధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖలో తాను 32 ఏళ్ల పాటు సర్వీసు చేయగా ఇన్నేళ్లలో అనేక పాఠాలను నేర్చుకున్నాని తెలిపారు. తాను సర్వీసులో చేరిన సమయంలో పోలీసుల విధులు వేరుగా వుండగా ఇప్పుడు పూర్తిగా మారాయని ఆయన అన్నారు. తన సర్వీసులో తనకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయని, ఎన్నో ఆనందాలు, మరెన్నో జ్ఞాపకాలతో ప్రయాణం సాగిందని ఆయన వెల్లడించారు. మా రుతున్న కాలానుగుణంగా పోలీసు శాఖ మారిందని, దీనిని యువ పోలీసులు అందిపుచ్చుకో వాలని ఆయన కోరారు. ప్రస్తుతం మాదకద్రవ్యాల తో పాటు సైబర్ నేరాలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావం చేస్తున్నాయని, వీటిని ఎట్టి పరిస్థితుల్లో అయినా రూపుమాపాలని పోలీసులను ఆయ న కోరారు. ప్రజలతో మరింత సన్నిహితంగా మెలిగేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ విషయంలో పోలీసులు మరింతగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. శాంతి భద్రతల నిర్వహణ, అసాంఘీక కార్యకలాపాలను నిరోధించేందుకు పోలీసులు ఎ ల్లవేళలా కఠినంగా వుండాల్సిందేనని ఆయన తెలిపారు. తన సర్వీసులో తనకు సహకరించిన అన్ని కేడర్‌ల పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తె లిపారు. భవిష్యత్ నగరం కోసం ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు కావాలసిన అన్ని హంగులు సమకూర్చామని డిజిపి తెలిపారు. ఇదే ప రేడ్‌లో నూతన డిజిపి సి.వి ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు శాఖ మారుతున్న కాలంలో మరింత బలోపేతం కావాలని కోరారు. దేశంలో నక్సలిజం సమస్య అంతిమ దశకు చేరుకున్న తరుణంలో పోలీసుల కార్యాచరణలో కూడా మార్పులు రావాలని ఆనంద్ తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నక్సలిజంను కట్టడి చేయడంలో దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచా యని ఆయన తెలిపారు. కేవలం అణచివేతకే పరిమితం కాకుండా లొం గిపోయిన నక్సలైట్లకు మెరుగైన పునవాసం కల్పించడం, వారికి ఉపాధి మార్గాలు చూపడం వంటి సామాజిక కోణంలో ప్ర భుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన తెలిపారు. డిజిపిగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి నక్సలైట్ల సమస్యపై అవగాహన కలి గిన అధికారిగా తెలిపారు. నక్సలిజం విషయంలో ఆయన వ్యూహాలు అద్భుతంగా వున్నాయని ఆనంద్ తెలిపారు. ఇటీవల కాలంలో పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌ఘడ్ నుంచి వందలాది మంది నక్సలైట్లు ఆయుధాలతో సహా లొంగిపోవడం పెద్ద విషయమని, ఇది భద్రతా పరంగా రాష్ట్రానికి మంచి పరిణామమని ఆయన అన్నారు. కొత్త డిజిపిగా తన ప్రాధాన్యతలు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివాణ ముఖ్యమైనవిగా ఆయన తె లిపారు. తనపై నమ్మకం వుంచి తనకు డిజిపిగా ఎంపిక చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్య తలకు అనుగుణంగా పోలీసు శాఖ పనిచేయాలని ఆయన తెలిపారు. తెలంగాణ పోలీసులు దశాబ్దాలుగా పాటిస్తున్న అత్యుత్తమ సాంప్రదాయాల ను కొనసాగిస్తానని ఆనంద్ చెప్పారు. మారుతున్న కాలంతో పాటు పోలీసు శాఖను కూడా ఆధునీకరించాలని ఆయన అన్నారు.

**డిజిపి కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు**

ఇదిలావుండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో డిజిపి శివధర్ రెడ్డికి డిజిపి కార్యాలయంలో సీనియర్ పోలీసు అధికారులతో పా టు కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. ఈ సందర్భంగా పూలతో అందంగా అలంకరించిన జీపులో శివధర్ రెడ్డి వుండగా ఆ జీ పును అందరు ప్రధాన గేటు వరకు లాగి ఆయనపై వున్న గౌరవాన్ని చాటారు. కాగా డిజిపిగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి కొత్త తాత్కాలికంగా తన బాధ్యతలను శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్‌కు అప్పగించా రు. గురువారం మధ్యాహ్నం ఈ ప్రక్రియ సాగింది. శుక్రవారం ఉదయం నూతన డిజిపి ఆనంద్ డిజిపిగా బాధ్యతలు చేబట్టనున్నారు.

## ప్రభుత్వ సలహాదారుగా శివధర్ రెడ్డి

>> అంతర్గత భద్రత, సైబర్ సెక్యూరిటీ, నేర నియంత్రణ, మా దకద్ర వ్యాలపై నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి ఆయన ప్రభుత్వానికి సలహాదారుడుగా వుంటారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగుతారు. కాగా శివధర్‌రెడ్డికి చీఫ్ సెక్రటరీహోదాకల్పించారు. ఆయన 2రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

# 'తెలంగాణ రక్షణ సేన'కు ప్రాథమిక గుర్తింపు

## అభ్యంతరాల పరిశీలన తర్వాతే పార్టీ పేరు ఖరారు: ఇసి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్30:** కల్వకుంట్ల కవిత పార్టీ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు ఆమోదానికి అనుకూలంగా అడుగులు పడ్డాయి. తెలంగాణ రక్షణ సేన పేరును గుర్తిస్తూ ఈసీ ప్రాథమికంగా సమాచారం ఇచ్చింది. ఈ నెల 25న పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. అయితే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరును ఈసీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి కవితకు స్పీడ్ పోస్ట్ ద్వారా లేఖ అందింది. కాగా, మొదట తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజాశక్తి తదితర పేర్లలో ఒక పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. తెలంగాణ రక్షణ సేన పేరుకు ఈసీ ఆమోదంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదం తెలిపిందని ఎక్స్ వేదిగా తెలిపారు. సమస్త తెలంగాణ సమాజానికి తెలియచేయడానికి సంతోషిస్తున్నానని, జనవరిలో ఈసీ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేశామని అన్నారు. మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నామని, మూడో ప్రాధాన్యతగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించిందని వెల్లడించారు. టీఆర్ఎస్ పేరు తనకు రాసిపెట్టి ఉందేమో అని తెలిపారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కొనసాగిస్తానని, తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. కాగా, పార్టీ పేరుపై రెండు జాతీయ, రెండు స్థానిక పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని ఈసీ సూచించింది. కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే తెలపాలన్న ఎన్నికల సంఘం 30 రోజుల గడువు ఇచ్చింది. అభ్యంతరాల పరిశీలన తర్వాత పార్టీ పేరు ఖరారు చేస్తామని ఈసీ ప్రకటించింది.

# ఇరాన్‌లో 21 మంది ఉరితీత

## 4వేలమందికిపైగా నిరసనకారుల అరెస్ట్

**టెహ్రాన్, ఏప్రిల్ 30:** పశ్చిమాసియాలో ఇరాన్ సాగిస్తున్న యుద్ధం ప్రపంచాన్ని వణికిస్తుంటే మరోవైపు ఇరాన్ ప్రభుత్వం తన స్వదేశీ పౌరులపై కూడా దాడులు కొనసాగిస్తోంది. యుద్ధం మొదలైన ఈ రెండు నెలల కాలంలోనే కనీసం 21 మందిని ఆ దేశ ప్రభుత్వం ఉరితీసిందని, 4వేల మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేసిందని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం చీఫ్ వోల్కర్ టర్క్ ప్రకటించి సంచలనం సృష్టించారు. ఇరాన్ ప్రభుత్వం తమ దేశ పౌరులతో అత్యంత కఠినంగా వ్యవహరిస్తోంది. జనవరిలో జరిగిన నిరసనల కారణంగా 9 మందికి, ప్రతిపక్ష గ్రూపులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో 10 మందికి, గూఢచర్య నేరంపై మరో ఇద్దరికి మరణశిక్షలు అమలు చేశారు. జాతీయ భద్రత పేరుతో 4,000 మందిని జైళ్లలో బంధించారు. నార్వేకు చెందిన ఇరాన్ హ్యూమన్ రైట్స్ సంస్థ లెక్కల ప్రకారం ఏప్రిల్ 8వ తేదీన కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత కూడా అరెస్టులు ఆగలేదని, మరో 767 మందిని అదనంగా అదుపులోకి తీసుకున్నారని తెలిపింది.

# విహెచ్ నియామకం

>> తెలిపారు. ఈ మొత్తాన్ని పేద విద్యార్థులకు అందించేలా ట్రస్టులకు ఇస్తానని హామీ ఇచ్చారు. తనకు కీలక పదవిని అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఏది అడిగినా కాంగ్రెస్ పార్టీ కాదనలేదని పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ అడిగితే, రాజీవ్ గాంధీ తనపై అభిమానంతో రెండుసార్లు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా రెండుసార్లు ఈ ప్రాంతానికి వచ్చినట్లు తెలిపారు.రాజీవ్ గాంధీ చనిపోయిన తర్వాత కూడా తనను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించిందని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్టుగా కులగణనను గ్రామగ్రామానికి తీసుకువెళతానని అన్నారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే రేవంత్ రెడ్డి ఆశయాన్ని ముం దుకు తీసుకువెళతానని అన్నారు. ప్రధాని మోదీ ఓబీసీలకు ఏం చేశా రో చెప్పాలని ప్రశ్నించారు. తనకు పార్టీ మారే అవసరం, అలవాటు లేదని, ఏ పార్టీలో ఉన్నానో ఆ పార్టీలోనే ఉంటానని అన్నారు.

# ఇంకా పెట్రో కష్టాలే!

>> వాతావరణం నెలకొంది. తోపులాటలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు మధ్య అమ్మకాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ విషయానికి వస్తే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి సాధారణంగా ఉన్నప్పటికీ, మరికొన్ని చోట్ల ఇంకా బంకులు తెరుచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల బంకులు పూర్తిగా మూసివేయాల్సిన పరి స్థితి కూడా నెలకొందని సమాచారం. చమురు సంస్థలు సరఫరాను మరింత వేగవంతం చేస్తే తప్ప రాబోయే రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం లేదని తెలుస్తోంది. కాగా...రాష్ట్రంలో వరి కోతలు కొనసాగుతున్న నేపథ్యం లో రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు డిజిల్ సరఫరాను 15% మేర పెంచాలని, సెలవుదినాలు,ఆదివారాల్లో సైతం సరఫరాను కొనసాగించాలని ఆయిల్ కంపెనీలను పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టిఫెన్ రవింద్ర ఆదేశించారు. పెట్రోల్ బంకుల ఎదుట నోస్టాక్ బోర్డులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి నాలుగు గంటలకుకోసారి రాష్ట్రంలో ఇందన సరఫరా, ఆయా బంకుల్లో నిల్వలపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

# ప్రమాదాలు జీరో స్థాయికి తేవడమే లక్ష్యం

## నేటి నుండి విద్యుత్ భద్రతా వారోత్సవాలు

## ఉత్తర తెలంగాణ పంపిణి సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి



భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రమాదాల నివారణకు విద్యుత్ సంస్థలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ ప్రమాదాలు జీరో స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా మే 1వ నుండి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు సర్కిళ్లలో విద్యుత్ భద్రత వారోత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. కరీంనగర్ సర్కిల్ హుజురాబాద్ డివిజన్ లోని సింగాపూర్ సబ్ స్టేషన్‌లో గురువారం విద్యుత్ భద్రతపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. విద్యుత్ భద్రత పరికరాలు ధరించి పనులు చేస్తున్నారా అని ఈ సందర్భంగా అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి లైన్ల నిర్వహణా విధిగా చేపట్టాలని సూచించారు. సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లకు నియమించిన నోడల్ అధికారులు విస్తృతంగా వినియోగదారులకు, రైతులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో పర్యటనలు, సమావేశాలు నిర్వహించి విద్యుత్ భద్రతపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం, అజాగ్రత్త, ఆలసత్వం కారణంగా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, స్వీయ నియంత్రణ ముఖ్యమన్నారు. విద్యుత్ ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను వివరించారు. ముఖ్యంగా నిర్లక్ష్యంగా విద్యుత్ పరికరాల వినియోగం, పాడైన నాసిరకం, అతుకుల వైర్ల వినియోగం, ఎర్తింగ్ లేకపోవడం, తడిసిన చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవడం వలన ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. తెగి పడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తడి చేతులతో స్విచ్‌లు, పరికరాలు ఆపరేట్ చేయరాదని స్పష్టం చేశారు. గృహాల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో సరైన ఎర్తింగ్ వ్యవస్థ ఉండాలని, మీటర్లు, సర్వీస్ వైర్లు, స్విచ్‌బోర్డులు సకాలంలో తనిఖీ చేయించుకోవాలని వెల్లడించారు. చిన్నపిల్లలను విద్యుత్ పరికరాల నుంచి దూరంగా ఉంచా పేర్కొన్నారు. అలాగే రైతులు మోటార్లు, పంప్‌సెట్లు వాడేటప్పుడు భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మోటార్ స్టార్టర్ల వద్ద ఇన్సులేషన్ సరిగా ఉండాలని, తడి నేలపై నిలబడి స్విచ్ ఆన్ చేయరాదని హెచ్చరించారు. విద్యుత్ లైన్లకు సమీపంలో నీటి పైపులు, లోహ పరికరాలు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రమాదకర లైన్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, పాత వైర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడుతున్నారని చెప్పారు. వినియోగదారులకు నిరంతరాయంగా, సురక్షితంగా విద్యుత్ సరఫరా చేయడం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందన్నారు.

## అత్యాచారం కేసులో ఏడేళ్ల జైలు

### నల్గొండ పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు

**నల్గొండ టౌన్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన ఉప్పుతుల దుర్గాప్రసాద్ నాగార్జునసాగర్ కు చెందిన మహిళను వివాహం చేసుకోవడం జరిగింది. ఆ మహిళకు గతంలోనే వివాహం జరిగి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సదరు మహిళ భర్త రోడ్డు ప్రమాదంలో చనిపోగా దుర్గాప్రసాద్ రెండవ వివాహం చేసుకున్నది. దుర్గా ప్రసాద్ అతని భార్య ఇద్దరు కూతుర్లను తీసుకొని బతుకుదెరువు కోసం కోళ్ల ఫారంలో పనిచేయడానికి నార్కట్ పల్లి మండలం కొండపాకోనిగూడెం వెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ఏప్రిల్ 20, 2018 రోజున నిందితుడు దుర్గాప్రసాద్ రెండవ భార్య కూతురైన 14 ఏళ్ల మైనర్ బాలికను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని సాయంత్రం 7 గంటల 30 నిమిషాల సమయంలో కొండపాకోని గూడెం గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలో వాహనం ఆపి చెట్ల పొదల్లోకి లాక్కెళ్ళి అత్యాచారయత్నం చేయబోగా బాలిక గట్టిగా కేకలు వేసి పరిగెత్తుకుంటూ వచ్చి ఇంటికి చేరుకున్నారు. అనంతరం జరిగిన విషయం విషయాన్ని తల్లికి చెప్పడంతో ఆమె తన రెండవ భర్త ఆయన దుర్గాప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని 21 ఏప్రిల్ 2018 రోజున నార్కట్ పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సమగ్రమైన దర్యాప్తు జరిపి అండర్ సెక్షన్ 504, 506, 9(1)(ఎం(ఎన్),10 ఫోక్సో యాక్ట్ 2012 కేసు నమోదు చేయడం జరిగింది. సుదీర్ఘ విచారణ అనంతరం గురువారం నల్గొండ జిల్లా ఫోక్సో న్యాయస్థానంలో 7 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు 4 వేల రూపాయల జరిమానా విధించింది. బాధిత మైనర్ బాలికకు 2 లక్ష రూపాయల పరిహారం ప్రకటించింది. ఇటి కేసులో ప్రాసిక్యూషన్ తరఫున సరైన సాక్షాలను ప్రవేశపెట్టి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. సమగ్రమైన ఇన్వెస్టిగేషన్ చేయడంలో ఆనాటి నార్కట్ పల్లి ఎస్ హెచ్ ఓ గోవర్ధన్, ప్రస్తుత ఎస్ హెచ్ ఓ విష్ణు కీలకపాత్ర పోషించారు. సిడిఓలు నరసింహ, కిరణ్ మరియు భరోసా లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన ఈ కేసు పురోగతి సాధించడానికి సహకరించారు.

## అణుతయారీ నిలిపివేయాల్సిందే

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 30:** ఇరాన్‌తో అణు ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మరింత కఠినతరం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా వదిలిపెడితే తప్ప ఎలాంటి ఒప్పందమూ ఉండబోదని స్పష్టం చేశారు. అప్పటి వరకు చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.



ఇరాన్‌పై ప్రస్తుతం కొనసాగుతున్న అమెరికా నావికా దిగ్బంధనాన్ని ఆయన జీనియస్, 100 శాతం ఫుల్‌ప్రూఫ్ అని అభివర్ణించారు. అమెరికా నౌకాదళం సత్తాకు ఇది నిదర్శనమని అన్నారు. ఈ దిగ్బంధనం బాంబు దాడుల కన్నా ప్రభావవంతమైనది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు అని ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో చర్చలు ప్రస్తుతం నేరుగా కాకుండా టెలిఫోనిక్‌గా జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రతిష్టంభనపై ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, అమెరికా వైఖరిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దిగ్బంధనాన్ని కొనసాగిస్తే అపూర్వమైన సైనిక చర్య తప్పదని హెచ్చరించింది. దౌత్యానికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇప్పటివరకు సంయమనం పాటిస్తున్నామని పేర్కొంది. ఈ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్ల పైకి చేరింది. అమెరికాలో గ్యాస్ ధరలు నాలుగేళ్ల గరిష్ఠానికి చేరుకున్నాయి.

## వాణిజ్య పన్నుల శాఖలో అవినీతి పద్దు!

### నగరంలోని కార్యాలయాల్లో ఎసిబి, విజిలెన్స్ సోదాలు

### అక్రమార్కుల నుంచి పత్రాలు జప్తు

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** నగరంలోని వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన పలు కార్యాలయాలలో గురువారం మధ్యాహ్నం ఎసిబితో పాటు విజిలెన్స్ విభాగం అధికారులు సోదాలు నిర్వహించారు. వాణిజ్య పన్నుల వసూళ్లకు సంబంధించి భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంపై ఎసిబితో పాటు విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో దాడులు చేబట్టారు. అబిడ్స్‌లోని రూరల్ కార్యాలయంతో పాటు పంజాగుట్ట, బేగంపేట్, బోయిన్‌పల్లి, ఖైరతాబాద్, సోమాజిగూడ, జీడిమెట్ల 2తో పాటు మరో మూడు చోట్ల ఈ సోదాలు జరిగాయి. సోదాల సందర్భంగా ఆయా కార్యాలయాలలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఎసిబి, విజిలెన్స్ అధికారులు అక్కడి డాక్యుమెంట్లను జప్తు చేశారు. ఈ సర్కిళ్లలో అక్రమాలతో పాటు అవినీతి ఎక్కువగా వుందని ఎసిబి, విజిలెన్స్ విభాగాలు నిర్ధారణకు వచ్చాయి. దీనిపై రెండు విభాగాల అధికారులు సర్కారుకు ఒకటి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వనున్నారు. ఇదే సమయంలో ఇక్కడి అక్రమాలపై సంబంధిత అధికారులను విచారించాలని ఎసిబి, విజిలెన్స్ నిర్ణయించినట్లు తెలిసింది.

## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు

**జన్నారం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.వారు తెలిపిన వివరాల ప్రకారం బాధితురాలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన అనంతరం వేసవి సెలవుల నిమిత్తం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఉన్న బంధువులు బాబాయ్,పిన్ని ఇంటికి వచ్చింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన డోంగరి లక్ష్మణ్ (20) అనే వ్యక్తి బాధితురాలతో సాన్నిహిత్యం ఏర్పరచుకొని ఫోన్లో మాట్లాడుతూ బాధితురాలితో ఫోటోలు దిగి, ఆమెను శారీరకంగా అనుభవించాలనే దురుద్దేశంతో అట్టి ఫోటోలను సోషల్ మీడియా, కుటుంబ సభ్యులకు చూపిస్తానంటూ బెదిరింపులకు పాల్పడి, బాధితురాలు కుటుంబ సభ్యులు లేని సమయం చూసి బాధితురాలిని బలవంతంగా శారీరకంగా అనుభవించాడని బాధితురాలు తన కుటుంబ సభ్యులకు విషయం తెలుపగా, బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, నిందితున్ని పట్టుకొని రిమాండ్ నిమిత్తం లక్షెట్టిపేట కోర్టులో హాజరు పరిచినట్లు సి.ఐ రమణా మూర్తి తెలిపారు.

# మొదటి రోజు 'దోస్త్' జోరు

**డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియ షురూ**

**47,036 మంది రిజిస్ట్రేషన్లు**

**27,480 దరఖాస్తులు అప్‌లోడ్**

**3,804 ఆప్షన్లు ఎంట్రీ**

**మే 8 వరకు అవకాశం**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) -2026లో భాగంగా గురువారం నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 3804 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చినట్టు దోస్త్ కన్వీనర్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 13న దోస్త్ నోటిఫికేషన్ జారీ చేయగా.. ఏప్రిల్ 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించడం ప్రారంభించారు. గురువారం సాయంత్రం వరకు 47,036 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 38,700 మంది పేమెంట్ చేశారు. 27,480 మంది తమ అప్లికేషన్లను అప్‌లోడ్ చేశారు. మొదటి రోజు వెబ్ ఆప్షన్లను 3,804 మంది ఇచ్చారు. ఫేజ్-1 రిజిస్ట్రేషన్లను మే 7వరకు అవకాశమిచ్చారు. అర్హులైన విద్యా ర్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దర ఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మే 8 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు.

మే 14న తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం మే 15 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15 నుంచి మే 25 వరకు కొనసాగనుంది. మే 15 నుంచి మే 26 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వా ల్సి ఉంటుంది. మే 30న సెకండ్ ఫేజ్ సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌ను మే 31 నుంచి జూన్ 5 వరకు చేయాల్సి ఉంటుంది.

మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31 నుంచి జూన్ 15 వరకు జరగనుంది. మే 31 నుంచి జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి. జూన్ 20న మూడో విడత సీట్ల కేటాయింపు ఉంటుంది.

రెండో, మూడో విడత సీట్ల కేటా యింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి జూన్ 20 నుంచి జూన్ 25 వరకు ఉంటుంది.

**అన్ని విడతల్లోనూ**

సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27 మధ్యలో హాజరై అడ్మిషన్ తీసుకోవల్సి ఉంటుంది. జూన్ 29, 30 తేదీల్లో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1 నుంచి డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 969 కాలేజీల్లో 4,40,107 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో సాంప్రదాయక డిగ్రీ కోర్సులను అందిస్తున్న ఉస్మానియా, కాకతీయ, మహాత్మాగాంధీ, శాతవాహన, పాలమూరు, తెలంగాణ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంతోపాటు జేఎన్‌టీయు యూనివర్సిటీలోని కొన్ని కోర్సులకు దోస్త్ ద్వారా అడ్మిషన్లను చేపడుతున్న విషయం తెలిసిందే.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

## కష్టాల్లో బిజెపికి అనుకూల ఫలితాలు

### కాంగ్రెస్ విఫల ప్రభుత్వం

### బిఆర్ఎస్ ఔట్ డేటెడ్ : ఎంపి డా.లక్ష్మణ్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీజేపీకి ఉన్న రిపోర్ట్సు,అంచనాలకు అనుగుణంగా గణనీయ విజయాలు సాధిస్తుందని, అంచనాలకు మించిన ఫలితాలు వస్తాయని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ పార్లమెంటరీ కమిటీ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం కరీంనగర్ గణేష్ నగర్ బైపాస్ రోడ్డు ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికేలా ఈ నెల 10న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్నారని తెలిపారు. ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. చారిత్రక మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేలా మే 10న, జనాగ్రహ సభను నిర్వహించడానికి బిజెపి తెలంగాణ పార్టీ సన్నాహాలు చేస్తుందన్నారు. ప్రధాని మోదీ హాజరయ్యే ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది హాజరవుతారని, ఇది తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే సభగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓ ఫెయిల్యూర్ గవర్నమెంట్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రాన్ని ఏ విధంగా నడపాలో అర్థం కాని స్థితిలో పాలన కొనసాగిస్తుందన్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు విఆర్ఎస్ ఇచ్చారని విమర్శించారు. ఆ పార్టీ అవుట్ డేటెడ్ పార్టీ అని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రప్రదమంగా కరీంనగర్‌లో తొలి మేయర్‌గా బీజేపీ అభ్యర్థి గెలవడం ప్రజల్లో మార్పు సంకేతమన్నారు.

## ఫారెస్ట్ బీట్ అధికారికి ఎసిబి వల

### పదివేలు లంచం తీసుకుంటూ ఉండగా అరెస్ట్

**గుండాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** పోడు రైతు నుండి పదివేలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో గురువారం దాడి చేసి ఓ ఫారెస్టు బీట్ అధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతు నుండి పది వేలు లంచం తీసుకుంటు మండల పరిధిలోని నడిమిగూడెం ఫారెస్టు బీట్ అధికారి బానోతు నరేష్ ఏసీబీకి పట్టుబడ్డారు. మారుమూల గ్రామాల నుండి ఏసీబీ కి ఫిర్యాదులు అందే స్థాయిలో ఏసీబీ డిఎస్పీ వై. రమేష్. ప్రజలను చైతన్య వంతులను చేశారు. ఫిర్యాదు రాగానే స్పందించడం తో ప్రజల్లో అవేర్నెస్ బాగా పెరిగింది. గుండాల మండలం సాయనపల్లిలో పోడు రైతును ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు ఈ లంచం తీసుకుంటు బీట్ అధికారి ఏసీబీ కి చిక్కారు.



ఎసిబికి చిక్కిన బానోతు నరేష్

గత ఆరు సంవత్సరాల క్రితం మండలంలో మండల ప్రజా పరిషత్ అధికారి (ఎంపీడీవో ) గా విధులు నిర్వహిస్తూ కాంట్రాక్టర్ కి బిల్లులు మంజూరికి లంచం డిమాండ్ చేయగా కాచినపల్లి గ్రామంలో నగదు తీసుకుంటున్న క్రమంలో పట్టుకున్న సంఘటన మొదటిసారిగా జరిగింది. నేడు పోడు భూములు సాగు చేసుకుంటున్న నిరుపేద ఆదివాసి రైతులను ఇబ్బంది పెడుతున్న క్రమంలో ఒక బీట్ ఆఫీసర్‌కి పదివేలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఇది మండలంలో రెండవ సంఘటన రైతులు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి పట్టుకోవడం పట్ల పలు రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## టెన్త్‌లో రవీంద్ర భారతి విజయ దుందుభి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30 :** పదవ తరగతి ఫలితాల్లో రవీంద్ర భారతి విద్యార్థులు తమ సత్తాను చాటారు. క్రమశిక్షణనే ఆయుధంగా మలచి, నవీన పద్ధతులు, పురాతన విలువలు నానుడితో సుపరిచితమైన రవీంద్ర భారతి విద్యాసంస్థలు అందించిన ప్రోత్సాహం, విలువలతో కూడిన విజ్ఞానం, పాఠ్యప్రణాళికా రచనా విధానం, ఉపాధ్యాయులు అందించిన ప్రేరణ, తమ విజయానికి దోహదమయ్యాయని విజయాన్ని సాధించిన విద్యార్థులు పేర్కొన్నారు. తమ విద్యార్థులు 593, 593, 592, 591, 590 లాంటి మరెన్నో మార్కులు, రాష్ట్రం మొత్తం రవీంద్రభారతి విదార్థులలో 15 శాతం మంది 580కి పైబడి మార్కులు, 10 శాతం మంది తెలుగులో 100 శాతం 100 మార్కులు, 25 శాతం మంది గణితములో 100 కి 100. మార్కులు, 20 శాతం మంది సైన్స్, సోషల్‌లో 100కి 100 మార్కులు సాధించారని రవీంద్రభారతి పాఠశాలల చైర్మన్ ఎంఎస్ మణి అన్నారు. ఈ విజయంతో తమకెంతో ఆనందంగా ఉన్నదని, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించడానికి మరింత ఉత్సాహంతో, ఉత్తేజముతో ప్రణాళికా విధానాన్ని రూపొందిస్తామని, ఇంత గొప్ప ఫలితాలు సాధించిన తమ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

## 'అమ్మ దర్శనానికి వెళ్లి వస్తూ..

# ఐదుగురు సజీవదహనం

**కదులుతున్న కారులో మంటలు - రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం - మృతుల్లో ముగ్గురు మహిళలు, ఓ మైనర్ బాలిక**

**అల్వార్, ఏప్రిల్ 30:** ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం జరిగింది. కదులుతున్న కారులో మంటలు వ్యాపించి ఆ కారులో ప్రయాణిస్తున్న అయిదుగురు సజీవదహనమయ్యారు. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలోని మోజ్‌పూర్ వద్ద ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. కారులో ఉన్న ప్రయాణికులు వైష్ణవీదేవి ఆలయాన్ని సందర్శించి తిరిగి వస్తున్నారు. అదనపు ఎస్పీ ప్రియాంకా రఘువంశీ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన ప్రాంతానికి అగ్నిమాపక సిబ్బందిని పంపామన్నారు. 15 నిమిషాల్లోనే మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు చెప్పారు. కానీ అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైందన్నారు. మృతిచెందిన వారిలో ముగ్గురు మహిళలు, ఓ మైనర్ బాలిక, మరొకరు ఉన్నట్లు గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాకు చెందిన నివాసితులగా వారిని అనుమానిస్తున్నారు. బహుశా షార్ట్ సర్క్యూట్ వల్ల కారులో మంటలు వ్యాపించి ఉంటాయని డిప్యూటీ ఎస్పీ కైలాశ్ జిందాల్ తెలిపారు. సీఎన్‌జీ వాహనం కావడం వల్ల షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అనుమానిస్తున్నామన్నారు. చాలా వేగంగా కారులో మంటలు వ్యాపించాయని, ప్రయాణికులకు తప్పించుకునే సమయం కూడా దొరకలేదన్నారు. వాహనం నుంచి కేవలం కళేబరాలను వెలికితీసినట్లు చెప్పారు. వారిని గుర్తుపట్టేందుకు డీఎన్ఏ పరీక్షలు చేపట్టనున్నారు. కారు డ్రైవర్ వినోద్ కుమార్ వాహనం నుంచి బయటకు దూకాడు. కానీ అతని శరీరం 80 శాతం కాలింది. ఈ ఘటనపై మరింత దర్యాప్తు చేపట్టనున్నారు.



## నవజాత శిశువుల విక్రయ ముఠా గుట్టు రట్టు

### డాన్ మురుగన్‌ను అరెస్ట్ చేసిన గుజరాత్ పోలీసులు

### ఆదిలాబాద్‌లో ఇటుకల బట్టీ కార్మికుడుగా ప్రస్థానం

### హైదరాబాద్‌లో గుజరాత్ పోలీసుల సోదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** నవజాత శిశువుల విక్రయ ముఠా డాన్ మురుగన్ గుజరాత్ పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో ఆ రా ష్ట్ర పోలీసులు గురువారం నాడు హైదరాబాద్‌లో తనిఖీలు చేబట్టారు. మురుగన్‌కు తెలంగాణతో పాటు ఎపిలో వెలుగు చూసిన నవజాత శిశు వుల అపహరణ, విక్రయ ముఠాలతో సంబంధాలు వున్నట్లు వెలుగు చూడడంతో గుజరాత్ పోలీసులు మొదట హైదరాబాద్‌లో సోదాలు చేబట్టారు. మురుగన్ భార్య కృష్ణవేణి కూడా డాన్‌గా చలామణి అవుతుండం విదితమే. ఆమె స్వస్థలం విజయవాడ. కృష్ణవేణితో పాటు ఆమె ముఠా సభ్యులు పలువురు ఇంతకు ముందు తెలంగాణతో పాటు ఎపిలో పలుమార్లు అరెస్టవడం తెలిసిందే.

ఈ సందర్భంగా పదుల సంఖ్యలో నవజాత శిశువులను పోలీసులు స్వాధీనం చేసుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించడం, తల్లిదండ్రులను గుర్తించని పక్షంలో హోంలకు తరలించారు. కృష్ణవేణికి దేశ వ్యాప్తంగా ఇదే తరహా నేరాలకు పాల్పడే అనేక ముఠాలతో సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఈ క్రమంలో ఇతర రా ష్ట్రాలకు చెందిన అనేక మంది పట్టు బడ్డారు. ఇదే కేసులో మురుగన్ గత ఏడాది చైతన్యపూరి పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టయి మూడు నెలల పాటు జైల్లో వున్నాడు. బెయిల్‌పై విడుదలయ్యాక పారిపోయి తిరిగి ఇదే గోల్‌మాల్ కార్యకలాపాలు సాగించసాగాడు. ఇతను తాజాగా గుజరాత్‌లో పట్టుబడగా అక్కడి పోలీసుల విచారణలో తెలుగు రాష్ట్రాలలో రట్టయిన నేరాల చిట్టా బయటపడింది. దీంతో ఇక్కడి కేసుల వివరాల సేకరణకు గుజరాత్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు. ఏడాది క్రితం ఇతను ఆదిలాబాద్‌లో ఇటుకల బట్టిలో కార్మికుడుగా వున్న ఇతను ఇంతలో నవజాత శిశువుల విక్రయ ముఠాకు డాన్‌గా ఎదిగిన వైనంపై పూర్తి వివరాలు సేకరించేందుకు గుజరాత్ పోలీసులు హైదరాబాద్ వచ్చారు. ఇక్కడ ఆ రాష్ట్ర పోలీసులు మురుగన్‌తో పాటు అతని సమీమణి కృష్ణవేణి, ఇతర సభ్యులపై నమోదైన కేసుల వివరాలతో పాటు వీరంతా ఎక్కడి వారు...? ఎంతకాలంగా ఈ నేరాలు చేస్తున్నారు...? అనే దానిపై ఆరా తీస్తున్నారు. తెలంగాణలో సోదాల తరువాత గుజరాత్ పోలీ సులు ఎపికి వెళ్లే వీలుంది.

## కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ముందస్తు బెయిల్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ సతీమణి రిణికి భుయాన్‌పై వ్యాఖ్యలు చేసినందుకు అస్సాంలో న మోదైన పోలీసు కేసుల్లో నిందితుడుగా వున్న కాంగ్రెస్ అధికార ప్రతనిధి పవన్ ఖేరా ముందస్తు బెయిల్‌పై సుప్రీం కోర్టు గురువారం తీర్పు రిజర్వ్ చేసింది. ఇదే అంశంపై ఇంతకు ముందు తెలంగాణ హైకోర్టు పవన్ ఖేరాకు ముందస్తు బెయిల్ ఇవ్వగా దీనిని సుప్రీం కోర్టు డిస్మిస్ చేసి అస్సాంలో కేసు నమోదైనందున ఆ రాష్ట్రంలో బెయిల్ పొందాలని ఆదేశించడం తెలిసిందే. దీనిపై ఖేరా తరపున దాఖలైన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను అస్సాం హైకోర్టు కొట్టివేయగా దీనిని ఖేరా తరపు న్యాయవాదులు సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో వాదనలు కొనసాగాయి.

తెలంగాణ ప్రభుత్వము
దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ తాడుబందు వీరాంజనేయస్వామి దేవస్థానము**
6-2, కుమ్మరిగుట్ట, తాడుబందు, సికింద్రాబాద్, ఫోన్: 04027841283
ఆర్.సి.నెం. STVSD/29/2026, **ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్రకటన** తేది : 30.04.2026
ఇందుమూలముగా సమస్త భక్త జనులకు తెలియజేయునది ఏమనగా, శ్రీ తాడుబందు వీరాంజనేయస్వామి దేవస్థానం, కుమ్మరిగుట్ట, సికింద్రాబాద్, దేవస్థానము సంబంధించిన షాపులు (3) సంవత్సరాల కాల పరిమితికి లీజుకు ఇచ్చుటకుగాను తేది: 14.05.2026 రోజున గురువారం మ. 02.00 గంటలకు దేవస్థానం నందు బహిరంగ వేలం నిర్వహించబడును. కావున, ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు పాన్ కార్డు ప్రతి సమర్పించి ఆలయ పరిసరములలోనిది ఇట్టి వేలములో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర. సం. | వేలం వివరములు | విస్తీర్ణం | వేలంపాట కాల పరిమితి | డిపాజిట్ |
|---|---|---|---|---|
| 1 | షాప్ నెం. 3-4-358, టోబాకో బజార్, సికింద్రాబాద్. | 147 sft | 01.06.2026 నుండి 31.05.2029 | 10,000.00 |
| 2 | షాప్ నెం. 3-4-359, టోబాకో బజార్, సికింద్రాబాద్. | 144.10 sft | 01.06.2026 నుండి 31.05.2029 | 10,000.00 |
| 3 | షాప్ నెం. 3-3-387, సుభాష్ రోడ్, సికింద్రాబాద్. | 105 sft | 01.06.2026 నుండి 31.05.2029 | 10,000.00 |
| 4 | షాప్ నెం. 3-3-387, ఫస్ట్ ఫ్లోర్, సుభాష్ రోడ్, సికింద్రాబాద్. | 105 sft | 01.06.2026 నుండి 31.05.2029 | 10,000.00 |

ఇతర వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించగలరు.
ఫోన్: 040-27841283, 9059905912, 9849253620.
DIPR.No.1674-PP/CL/Advt/1/2026-27, తేది: 30.04.2026 సం/- కార్యనిర్వహణాధికారి

**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక కొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీ చేయబడిన నోటీసు**
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి **కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ** అధ్యక్షులు **శ్రీమతి నవిత బొంపెల్లి** గారు తమ పార్టీని "రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీ"గా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో **(1) శ్రీమతి నవిత బొంపెల్లి గారు (2) శ్రీమతి క్యామాజీ ప్రతిభ గారు, (3) శ్రీ దస్సంనేని వరుణ్ గారు** ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయం: **ట్రెండ్‌సెట్ రైథమ్ అపార్ట్‌మెంట్, జి 005, సి బ్లాక్, కొండాపూర్, వైట్ ఫీల్డ్స్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం-500084** సదరు పార్టీ రిజిస్ట్రేషన్ పై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నచో, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, **మొదటి అంతస్తు, DTCP భవనం, A.C. గార్డ్స్, హైదరాబాద్-500004** గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్దిష్ట గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రంలో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు **కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ**ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘము చేపడుతుంది.
అధ్యక్షులు
తేది: 30.04.2026 కర్ణాటక ప్రజ్ఞావంత జనతా పార్టీ

వార్త

ఒక పనిని బాగా చేయడం మాత్రమే కాకుండా మరింత బాగా చేయాలన్న అదనపు కోరికను కలిగి ఉండడాన్ని సామర్థ్యం అంటారు.

- హెచ్. గిల్బర్ట్స్

# వ్యయం జానెడు.. వ్యర్థం బారెడు!

శక్తికి మించిన సహాయం కానీ, సహకారం కానీ చివరకు కార్యక్రమాలు చేయడం అంత శ్రేయోస్కరం కాదు. మోయలేని భారం తలకెత్తుకుంటే అసలుకే మోసం వస్తుందన్న విషయాన్ని విస్మరించకూడదు. చరిత్రలో ఎన్నో సందర్భాల్లో ఎందరో పెద్దల విషయంలో ఇది రుజువైంది. ఏదో ఒకటి, రెండు సందర్భాల్లో అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ అదేపనిగా, ధ్యేయంగా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోకుండా అందిన కాడికి అప్పు తెచ్చి ఇష్టానుసారంగా వెచ్చిస్తుంటే ఇది వ్యక్తికి కానీ, సంస్థకు కానీ, ప్రభుత్వానికి కానీ ఏదో ఒక నాటికి చేతులు ఎత్తక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. ఇదేమీ కొత్త విషయం కాదు. ఎన్నో సంస్థలు, కుటుంబాలు, వ్యక్తులు ఒకనాడు దేదీప్యమానంగా వెలుగొంది ఆ బాటలో నడిచి పతనావస్థకు చేరుకున్న ఉదాహరణలు కోకొల్లలు. దివాలాకు సంకేతం. ఆస్తులు కుదువ పెట్టుకోవడం, అమ్ముకోవడం అవి కూడా ఆవిరైపోయిన తర్వాత చివరి అంకమే దివాలా. దివాలా అనేది వ్యక్తి విషయంలో తీవ్రంగా పరిణమిస్తారు. ఒకరకంగా సమాజ బహిష్కరణకు గురైనట్లు దివాలా తీసిన వ్యక్తిని కానీ, కుటుంబాన్ని కానీ సమాజం ఎలా చేస్తుందో వేరే చెప్పక్కర్లేదు. గత రెండు,మూడు దశాబ్దాలుగా దేశంలో అనేక రాష్ట్రాలు ఇష్టానుసారంగా అప్పుల మీద అప్పులు తెచ్చి కార్యక్రమాలకు హద్దుపద్దు లేకుండా వెచ్చిస్తున్నారు. ఓట్లకోసం, అధికారం కోసం, సీట్ల కోసం ప్రజలు అడిగినవే కాదు అడగనివి, ఊహించని వరాలు కూడా గుప్పిస్తున్నారు. వాటిని తీర్చేందుకు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దీంతో మిగులు, నిధులతో ఉన్న రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. వడ్డీయే యేటావేలాది కోట్ల రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. మరొకపక్క పన్నుల మీద పన్నులు వేసి ప్రజల నడ్డి విరుస్తున్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి పిట్టను కొట్టా పొయ్యిలో పెట్ట అన్నట్లుగా ఉంది. నెలానెలా ఉద్యోగస్తుల జీతభత్యాలకు కూడా వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొంది. మరొకపక్క ప్రజలను ఆరోగ్య పరంగా, ఆర్థికంగా తీవ్రంగా కృంగదీస్తున్న మద్యం ద్వారా ఆదాయం సమకూర్చుకునేందుకు రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. మరొకపక్క దళారులు చేసే మోసాలు అన్నీఇన్నీ కావు. కృత్రిమ కొరత సృష్టించి ధరలను సామాన్యులు అందుకో లేనంతగా పెంచేసుకుంటున్నారు. సంక్షేమ కార్యక్రమాల విషయంలో ఆర్థిక పరిస్థితిని ఏమాత్రం పట్టించుకున్నట్లు కన్పించడం లేదు. మనది సంక్షేమ ప్రభుత్వమే, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న లక్షలాది మంది నిరుపేదలకు, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనివ్వాల్సిందే. వారికి అన్నిరకాల సహకారాలు అందించాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. ప్రజాస్వామ్యవాదులు ఎవ్వరూదీన్ని వ్యతిరేకించరు, వ్యతిరేకించలేరు కూడా. కానీ వారి పేరుపై జరుగుతున్న దోపిడీ మాట ఏమిటి? అంతులేని అవినీతి సంగతి ఏమిటి? వేలాది కోట్ల రూపాయలు వడ్డీకి తెచ్చుకుంటున్న డబ్బులు ఇలా దుర్వినియోగం కావడం ఎంతవరకు న్యాయమో పాలకులు ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే కొన్ని లక్షల కోట్ల రూపాయలు నిరుపేదల అభ్యున్నతికి వెచ్చించారు. ఏపద్దు కింద ఎన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చించారో అధికారులకే లెక్కలు దొరకని పరిస్థితి. దారిద్ర్యరేఖకు దిగువనున్న కోట్లాది కుటుంబాలను ఆదుకుని వారిని ఆ దుర్భర పరిస్థితుల నుంచి దాటించామని అంకెలతోసహా వివరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలించినా దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి సంఖ్య పది, ఇరవైశాతానికి మించరనివారు స్పష్టం చేస్తున్నారు. కానీ తెలుగు రాష్ట్రాల్లో తెల్లకార్డుల సంఖ్య చూస్తే దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి సంఖ్య ఎనభైశాతానికిపైగా ఉంది. రెండూ ప్రభుత్వ విభాగాలే. ఒకదానికి ఒకదానికి పొంతన ఉండదు. ఇందులో ఏది సత్యం? ఏది అసత్యమన్నది పాలకులకు తెలియంది కాదు. ఒకటి, రెండు కాదు, యేటా వేలాది కోట్ల దళారుల కైవసం అయిపోతున్నది. బినామీ, బోగస్, కార్డులను ఏరివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా అంతగా సఫలీకృతం కావడం లేదు. దేశవ్యాప్తంగా చూసినా ఎన్ని లక్షల బోగస్ కార్డులు ఉన్నాయో లెక్కలకు అందదు. ఈ కార్డులపై పేదలకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు, బియ్యం ఒకటేమిటి ఇండ్లతోసహా భోంచేశారు. ఇదంతా అందరికి తెలిసిన బహిరంగ రహస్యమే. అనర్హులను పూర్తిగా ఏరివేయలేని నిస్సహాయ, నిర్భాగ్య పరిస్థితి. దళారుల ఆట కట్టించలేని దౌర్భాగ్య పరిస్థితి. మరొకపక్క అవినీతి విజృంభించిపోతున్నది. ఇంకొక పక్క రైతులకు గిట్టుబాటు కాన రావడం లేదు. అందుకే ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. ఈ సంక్షేమ కార్యక్రమాన్ని కొందరు దళారులకు, మరికొందరు వ్యాపారులకు కల్పతరువుగా మారుతున్నాయి. లాభాల కోసమే వ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. కమిషన్ల కోసమే దళారులు ఉన్నారనేది కూడా నిజం. అలా వ్యవహరిస్తే అందుకు పెద్దగా తప్పు పట్టలేం. కానీ నెలనెలా ప్రజాసొమ్మును జీతభత్యాల రూపంలో తీసుకుంటున్న కొందరు అధికారులను విమర్శించే కంటే వీరిని ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులను నిందించాలి. ఏదిఏమైనా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, నిర్మాణాత్మక కార్యక్రమాల నిధులు పక్కదారి పట్టకుండా దళారుల పాలు కాకుండా రాజకీయాలకు అతీతంగా అందరూ నడుం కట్టాల్సిన తరుణమిది. ప్రజాపాలకులు అనేవారు ప్రతిపైసా ప్రజాసొమ్ముకు కాపలాదారులమనే విషయం విస్మరించరాదు.

గౌరవం అన్నది పదవులు, హోదాలు పొందడంలో లేదు. పదవులు, గౌరవ వాదులకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.



అరిస్టాటిల్

అధికారం నిలుపుకోలేనివారు వేరొకరిపై అధికారం చూపడం భావ్యం కాదు.



ఆస్కార్‌వైల్డ్

## ప్రజావాక్కు

### ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుతీర్పు అత్యంత పవిత్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలు మార్చడం ప్రజాస్వామ్యవిలువలకే గొడ్డలిపెట్టు. ప్రస్తుతం ఉన్న ఫిరాయింపు నిరోధక చట్టం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ఈ చట్టంలోని లొసుగులను వాడుకుని ప్రతినిధులు స్వార్థప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసంచేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు అయ్యేలా కఠిన నిబంధనలు ఉండాలి. సభాపతి నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యం ఫిరాయింపుదారులకు వరంగా మారుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విస్తారమైన పంటలు

తెలంగాణకు ఉండే విస్తారమైన వనరులను దృష్టిలో ఉంచుకొని ఉపాధి హామీని వినియోగించి ప్రయోగాలు చేసే అవసరం ఉంది. తెలంగాణలో పెరిగిన నీటి వసతి కారణంగా విస్తారంగాపంటలు పండుతున్నాయి. అందులో మక్కలు, వరి వంటివి కొన్ని కోట్ల మెట్రిక్ టన్నులు పండుతున్నాయి. ఉదాహరణకు వరి 2014లో 48 లక్షల మెట్రిక్ టన్నులు పండితే నేడు 4 కోట్ల మెట్రిక్ టన్నులు పండుతున్నది. మరి ఇవన్నీనిల్వచేయడానికి సరిపోయిన గన్నిబాగ్స్ ఉన్నాయా అన్నది పెద్దప్రశ్న అయితే ఒక నాడు పల్లె పల్లెనపల్లెర్లు మొలిసే అనిపాడుకున్న తెలంగాణ నేడు భారతదేశ అన్నంగిన్నెగా తయారైంది.

- భారత అవినాష్, జనగామ

### నిధుల కొరత

నేటి ఆధునిక కాలంలో ఒక దేశాభివృద్ధి ఆదేశ విశ్వవిద్యాలయాలు చేపట్టే పరిశోధనలపైనే ఆధారపడి ఉంటుంది. విజ్ఞాన ఆధారిత సమాజంలో ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధికి చోదకశక్తులు. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో విశ్వవిద్యాలయాలు కేవలం బోధనా కేంద్రాలుగా మాత్రమేకాకుండా, అత్యాధునిక పరిశోధనా వేదికలుగా వర్ధిల్లుతున్నాయి. అమెరికా తనమొత్తం దేశీయ ఉత్పత్తిలో 3శాతం కంటేఎక్కువ నిధులను పరిశోధనల కోసం వెచ్చిస్తూ, పరిశ్రమలతో బలమైనఅనుసంధానాన్ని కలిగి ఉంది.

- కె.రామారావు, నల్గొండ

### ఉత్తుత్తి మాటలేనా!

ముఖ్యమంత్రి, అటవీశాఖామంత్రి, ప్రభుత్వభూములు అక్రమిస్తే జైలే గతి అని ఈమధ్య ప్రకటనలు ఇస్తున్నారు. మరి ఆచరణలో అది ఏమి కనపడటం లేదు. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామం దగ్గర సర్వేనంబర్ 295 లోని అంజూర్ అటవీ భూమిని కల్కి ట్రస్టు వారు ఏరకమైన అనుమతులు లేకుండా ఆక్రమించి ఆశ్రమం నిర్మించారు. ఈ భూమి నీ ఒక వ్యక్తి ఎవరికో అమ్మగా, వారినుండి మేము కొన్నాము అని కల్కి ట్రస్టు వారు ప్రభుత్వానికి సమాధానం ఇచ్చారు. ఒరిజినల్ పత్రాలు లేకుండా 21 ఎకరాల భూమిని కల్కి ట్రస్టు వారికి ఎలారిజిస్టర్ చేశారు? ఎవరికి ఎంత ముట్టినది ? తేల్చాలి. అది వాస్తవంగా అటవీ భూమి చుట్టూ డీప్ అంజూర్ అటవీ భూమి ఉండగా మధ్యలో ప్రవేట్ ల్యాండ్ ఎలా ఉంటుంది,? రెవెన్యూ వారిని మేనేజ్ చెసి కల్కి వాళ్ళు రిజిస్టర్ చేయించుకున్నారు.

- నార్నేవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### తోటివారితో పోల్చుకోకూడదు

పబ్లిక్ పరీక్షల్లో ఏదైనా తరగతి లేదా ఇంటర్ పరీక్ష ఫలితాలు వెల్లడించిన తర్వాత కొంత మంది విద్యార్థులు వారి సహచర మిత్రులు కాస్త ఎక్కువ మార్కులు వచ్చిన తరుణంలో లేదా ఆశించిన ఫలితం రానప్పుడు కుంగుబాటు మరీ విపరీతమై అందరికీ బాధాకరమైన పనికి ఆలోచనా రహితంగా సొంత నిర్ణయాలు తీసుకోవడం ప్రసక్తే లేదు. పరీక్ష తర్వాత సంతృప్తి లేనప్పుడు వెంటనే రెండోమారు ప్రయత్నానికి పూర్తి ధ్యానంతో దృష్టిసారించాలి. జీవితంలో ఇదేమీ ఆఖరి ఛాన్సు కాదు. తోటివారితో పోల్చుకోవడం సందర్భంకానేకాదు. తల్లితండ్రులకు ఆనందం లేదా భరోసా కలిగించాలి. చదువుమీద విశ్వాసం దానికి తగిన శ్రమవారికి వారే పెంచుకోవాలి. బలహీనత ధోరణి ఎక్కడైనా కష్టాలు తెస్తుందని గుర్తెరగాలి

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మీనమేషాలు లెక్కించకుండా ఫీజ్ బకాయినిధులను విడుదలచేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పర్యావరణ అసమతుల్యంతో ఎండ తీవ్రత

**అభివృద్ధి చెందుతున్న ఆధునిక టెక్నాలజీతో సమాంతరంగా పర్యావరణానికి కూడా హాని కలుగకుండా వాతావరణాన్ని పరిరక్షించుకునే విధానాలు మానవుడు అవలంబించగలగాలి. లేకుంటే అత్యధికంగా ఎండ తీవ్రతతో వచ్చే ఉపద్రవాలు మానవాళికి తీవ్ర నష్టం కలిగించడమే కాకుండా మానవుడు ప్రకృతిలో చేసేటువంటి వ్యతిరేక కార్యకలాపాలు మానవజాతి ఒక మచ్చగా మిగిలిపోతాయి. తద్వారా భూగోళంపై జీవకోటి అస్తవ్యస్తమైపోయే ప్రమాదం లేకపోలేదు. ఎండ తీవ్రత వల్ల మానవులతో పాటు సహజంగా భూమిపై సంచరించే పక్షులు జంతు జాతి అంతరించిపోయే అవకాశం లేకపోలేదు. పరిసరాల చుట్టూ సమతుల్యమైన పర్యావరణం కొరకు అవసరమైన చోట ప్రకృతివనములను సమృద్ధిగా పెంచుకునేందుకు ప్రతి ఒక్కరు మరింత భాగస్వాములు కావాలి. ఈక్రమంలో ఇకనైనా మానవులు ప్రత్యక్షంగా పరోక్షంగా పర్యావరణానికి నష్టం కలిగించే విధానాలకు స్వస్తి పలికి పర్యావరణ పరిరక్షణకు మరింత తోడ్పాటును అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంటుందేమో.**

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభ దశలోనే తీవ్రమైన వేడితోపాటు వడ గాలులు అధికమవుతున్నాయి. ఈ క్రమంలో కాలాలకు అనుగుణంగా భూగోళంపై అనేక వాతావరణ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వేసవి కాలంలో నిరంతరం ఉండే వేడికన్నా అత్యధిక ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదు కావటం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసే విధంగా వీస్తున్న వడ గాలులతో ఇంట్లో నుండి బయటకు రావడానికి సంకోచించవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సూర్యుడి నుండి భూమి గ్రహించిన అధిక వేడిని తిరిగి భూతలం నుండి పైకి వెళ్లకుండా వేడి త్వరగా చల్లగా కాకుండా మోతాదుకు మించి భూ వాతావరణంలోకి అధికంగా విడుదలవుతున్న కార్బన్ డయాక్సైడ్ లాంటి విష వాయువులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ క్రమంలో భూ ఉపరితలం వాతావరణం అత్యధిక ఉష్ణోగ్రతలు కలిగి ఉండటం వల్ల మానవులు తట్టుకునే ఉష్ణోగ్రత కంటే అధికమైన ఉష్ణోగ్రతలు నమోదై తీవ్రమైన గ్లోబల్ వార్మింగ్ ప్రభావం ఏర్పడి అనేక ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. దీనికి ప్రధానంగా మానవుడు భూగోళం మీద పర్యావరణ పరిరక్షణపై మరింత శ్రద్ధ తీసుకోకపోవడమే అనిపిస్తుంది. భూ వాతావరణంలో సహజంగా ఉండే వివిధ వాయువుల నిష్పత్తి కంటే భూమి పై మరింతగా కలుషిత వాయువులు ఎక్కువవుతున్నాయి. దీనికి ప్రధానంగామానవ అవసరాలకు ఉపయోగిస్తున్న మోతాదుకు మించిన ఇంధనాలు వాడకం, మితిమీరిన పారిశ్రామికీకరణ, కార్బన్డయాక్సైడ్, విషవాయువును స్వీకరించి స్వచ్ఛమైన ఆక్సిజన్ను విడుదల చేసే పర్యావరణ పరిరక్షణకు అవసరమైన వృక్ష సంపదను సమృద్ధిగా పెంచుకోలేకపోవడం, ఆటవిక ప్రాంతం తరిగిపోతుండడం వంటిఅంశాలపై మానవులు నిర్లక్ష్యధోరణి కలిగి ఉండడంవల్ల అధికంగా విషపూరిత వాయువ్యర్థాలతో వాతావరణం కలుషితం అవుతూ పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇటీవల వాతావరణ శాఖ విశ్లేషకుల సూచనలు గమనిస్తే రాబోయే సమీప కాలంలో సూపర్ ఎల్‌నినో వచ్చే అవకాశం లేకపోలేదని వార్తలు వినిపిస్తున్నాయి. అంటే భూమి వేడెక్కడం, అధిక వేడి గాలులు రావడమే కాకుండా ఉష్ణోగ్రతలు గణనీయంగా నమోదు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఆ పరిస్థితి సంభవిస్తే కరవు కాటకాల వంటి పరిస్థితి ఎదురు కావచ్చుఏమో. ఎండ తీవ్రత వల్ల కూడా భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బావుల్లో, బోర్లలో, చెరువుల్లో, కుంటల్లో నీరు తగినంత లేకపోవడంతో త్రాగు నీటి కరవుతోపాటు వ్యవసాయానికి నీరు లేకపోవడం, పంటలు పండకపోవడం ఇలాంటి అనేక సమస్యలు మానవ సమాజంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపే అవకాశం లేకపోలేదు. కొంతమంది స్వార్థపూరిత స్వప్రయోజనాల కొరకు యధేచ్ఛగా ప్రకృతి వనరులను నాశనం చేస్తూ పర్యావరణ వినాశనానికి కారణం అవుతుండడం వల్లే వాతావరణంలో అసాధారణ పరిస్థితులు ఏర్పడుతూ అధిక ఎండ తీవ్రతలతో జనజీవనం అస్తవ్యస్తం



వం కావడం సర్వసాధారణం అవుతున్నదని అనిపిస్తుంది. కొన్నిసార్లు మానవులు ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రాణాపాయ స్థితిలో పడిపోతుంటారు. బయట సంచరించే గూడు లేని మూగ జీవాలు జంతువులు, పక్షులు సైతం తీవ్రమైన ఎండ తాకిడికి అల్లాడిపోతున్నాయేమో. మానవాళి తన చుట్టూ ఉన్న పరిసరాల్లో సమతుల్యమైన పర్యావరణంకోసం వృక్ష సంపదను తగినంతగా పెంచుకోలేకపోవడం, ఇష్టానుసారంగా మోతాదుకు మించిన ఇంధనాల వాడకం దీనివల్ల గ్లోబల్ వార్మింగ్ అధికమై వాతావరణ సమతుల్యత లోపించడం వల్ల తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని అర్థం చేసుకోవాల్సిన అవసరం మానవ సమాజానికి ఉండాల్సిందే. స్వప్రయోజనాల కొరకు కావచ్చు మానవ అవసరాలకు కావచ్చు వృక్షాలను ఉపయోగించుకునే రీతిలో మానవాళి మరల సరిపడా వృక్షాలు పెంచకపోవడం వల్ల తరుచుగా వాతావరణ పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. కానీ ప్రస్తుతం ఆధునిక నాగరికత ప్రపంచంలో మానవుని అవసరాలు సులభతరం చేసుకునే రీతిలోమానవ మేధస్సు ప్రకృతికి సమాంతరంగా కృత్రిమ వాతావరణ యంత్రాలను సృష్టిస్తున్నప్పటికీ, ఇలాంటివన్నీ కూడా సరైన పద్ధతుల్లో వాడినప్పుడు మాత్రమే ప్రయోజనం ఉంటుంది. లేకుంటే వాటి నుండి వచ్చేటువంటి విషతుల్యమైన వాయు వ్యర్థాలు వాతావరణంలో కలిసిపోయి దుష్ప్రభావాన్ని చూపెడుతూ మానవ మనుగడకే ఇబ్బందికరంగా మారే అవకాశం లేకపోలేదు. పట్టణాలు నగరాలలో జన సాంద్రత కూడా అధికం కావడం అవసరాలకు అత్యధిక ఇంధన వాహనాలను ఉపయోగించడం అందులో నుండి వచ్చేటువంటికార్బన్ డయాక్సైడ్ ,కార్బన్ మోనాక్సైడ్ లాంటి విషవాయువులు మోతాదుకు మించి వాతావరణంలో కలిసిపోవడం ఒకఎత్తు అయితే కృత్రిమ యంత్ర పరికరాలు అయినా ఎయిర్ కండిషన్స్, రిఫ్రిజిరేటర్లు, కోల్డ్‌స్టోరేజ్‌ల వాడకం అందులో నుండి తరచుగా వెలువడుతున్న క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రో ఫ్లోరో కార్బన్లు వంటి విషతుల్యమైన వాయు పదార్థాలు వాతావరణంలోని ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. తద్వారా విభిన్న ప్రాంతాల్లో ఎండ తీవ్రతలో వ్యత్యాసం గోచరిస్తుంది. ఏదిఏమైనప్పటికీ అధునాతనమైన పద్ధతుల ద్వారా మానవుడు తన అవసరాలను సులభతరం చేసుకునే రీతిలో అనుసరిస్తున్న విధానాలతోపాటు జనసాంద్రత పెరిగిపోతున్న పట్టణ నాగరిక అభివృద్ధిలో తరచుగా పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న ఆధునిక టెక్నాలజీతో సమాంతరంగా పర్యావరణానికి కూడా హాని కలుగకుండా వాతావరణాన్ని పరిరక్షించుకునే విధానాలు మానవుడు అవలంబించగలగాలి. లేకుంటే అత్యధికంగా ఎండ తీవ్రతతో వచ్చే ఉపద్రవాలు మానవాళికి తీవ్ర నష్టం కలిగించడమే కాకుండా మానవుడు ప్రకృతిలో చేసేటువంటి వ్యతిరేక కార్యకలాపాలు మానవజాతి ఒక మచ్చగా మిగిలిపోతాయి. తద్వారా భూగోళంపై జీవకోటి అస్తవ్యస్తమైపోయే ప్రమాదం లేకపోలేదు. ఎండ తీవ్రతవల్ల మానవులతో పాటు సహజంగా భూమిపై సంచరించే పక్షులు జంతుజాతి అంతరించిపోయే అవకాశం లేకపోలేదు. పరిసరాల చుట్టూ సమతుల్యమైన పర్యావరణం కొరకు అవసరమైన చోట ప్రకృతి వనాలను సమృద్ధిగా పెంచుకునేందుకు ప్రతిఒక్కరు మరింత భాగస్వాములు కావాలి. ఈక్రమంలో ఇకనైనా మానవులు ప్రత్యక్షంగా పరోక్షంగా పర్యావరణానికి నష్టం కలిగించే విధానాలకు స్వస్తిపలికి పర్యావరణ పరిరక్షణకు మరింత తోడ్పాటును అందించవలసిన ఆవశ్యకత ఎంతైనాఉంటుందేమో. •

# దేశ నిర్ణయాలు విదేశీ ప్రభావంలో ఉన్నాయా?

డాక్టర్ ఎ. భార్గవరాజ్

భారతదేశం చరిత్రాత్మకంగా అలీన విధానంలో కీలక పాత్ర పోషించింది. కానీ ప్రస్తుతం అమెరికా వైపు వాలుతున్నది, ఈ పరిణామాలు సమతుల్యత" నుంచి 'ఒకవైపు వాలడం' సూచిస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. ఒకప్పుడు భారత్ అలీన దేశాలకు నాయకత్వం వహించి ప్రపంచానికే శాంతి దేశంగా, మధ్యవర్తిత్వం వహించే విధంగా ఉండేది. కానీ ప్రస్తుతం మన దేశ పరువు ప్రపంచ దేశాలతో ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు మాటలు, మన విదేశీ వ్యవహారాల దగ్గర పరువుపోతోంది. భారత విదేశాంగ విధానం ప్రస్తుతం మారుతున్న దిశలో వుంది. భారత్‌ను నరకంతో పోల్చడంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఆ కథనాలను చూశాము వాటిని అక్కడితో వదిలేస్తున్నామని చెప్పారు. ఇది సరైన సమాధానమేనా. ట్రంప్‌ను మాటమాటకి మా మిత్రుడు అనిచెప్పే ప్రధాని, ట్రంప్‌కి సమాధానం చెప్పలేడా లేదా నోరు రాదా? 2014 కు ముందు మన్మోహన్ సింగ్‌ను మౌనముని అని ప్రతిసారి విమర్శించిన ప్రధాని ఇప్పుడు మూగముని అయ్యాడని తెలుస్తోంది. భారతదేశం ప్రపంచ శక్తులతో భాగస్వామ్యం చేస్తుందా? లేక వాటి ప్రభావం వల్ల నడుస్తుందా? అనేది కేవలం విమర్శ కాదు, ఒక దేశ భవిష్యత్తుపై ఆలోచనను రేకెత్తిస్తోంది. ప్రధాని విదేశీ పర్యటనలలో భారత్ గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు లేదా విదేశీ నేతలు భారత్ను అవమానించినప్పుడు ఆయన మౌనంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాలు విమర్శకులు ప్రధాని 'దేశభక్తి'ని ప్రశ్నిస్తున్నారు. డోనాల్డ్‌ట్రంప్ వంటి విదేశీ నేతలు భారత దేశంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసినప్పుడు, ప్రధాని మౌనంగా ఉన్నారని, ఇది దేశ బలహీనతకు సంకేతమని, చేతగానితనంగా ప్రపంచ దేశాల మధ్య నిలుపుతున్నారు. ప్రపంచ వేదికలపై భారతదేశానికి గుర్తింపు పెరిగిందని, మోదీ పాలనలో దేశం 'విశ్వగురువు'గా ఎదుగుతోందని కేంద్రనాయకులు వాదిస్తారు. భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరినప్పుడు, తన జోక్యంతోనే ఆపరేషన్ సిందూర్ ముగిసిందని, తద్వారా భారీ ప్రాణ నష్టాన్ని తప్పించానని ట్రంప్ పదేపదే చెప్పుకొచ్చారు. వీటిపై ప్రధాని నోరుమెదపలేదు. విదేశీ నేతల వ్యాఖ్యలపై మౌనం అనేది కొన్నిసార్లు దౌత్యపరమైన వ్యూహంకావచ్చు లేదా వాణిజ్య లేదా భౌగోళిక ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం కావచ్చు. కానీ ఒక దేశాన్ని మాటమాటకి అగౌరవపరచి మాట్లాడడం, దానికి ప్రధాని మౌనం వహించడం దేశ కీర్తికి మంచిదికాదు. అమెరికా పర్యటనలో ఒక అధికార పార్టీకి చెందిన రామ్‌మాధవ్ వంటి కీలక నాయకుడు ఆషామాషీ కాదు, పార్టీ వ్యూహకర్త మేము మీరు చెప్పిన అన్నింటికి ఒప్పుకున్నాము కదా ...రష్యా నుంచి ఆయిల్ కొనడం తగ్గించాము, మీరు వేసిన 50 పన్నులకు ఒప్పుకున్నాము, ఆయుధాలు మీ దగ్గరే కొన్నాము ఇలా మేము అన్నీ చేశాం, ఇంకా ఎందుకు ఒత్తిడి? అనే భావనను రామ్ మాధవ్ వెలిబుచ్చడం ఒక విధంగా అమెరికా భారత్ సంబంధాల్లో అసమానతను సూచిస్తావుంది. అంటే ఇదికేవలం భారత ప్రభుత్వంపై విమర్శ మాత్రమే కాదు, అంతర్జాతీయ సంబంధాల అసమానతపైకూడా ఎలా ఉందో తెలుస్తోంది. ఇది స్వతంత్ర విదేశాంగ విధానంపై సందేహాన్ని కలిగిస్తోంది. ఈ భరింపులు ఎవరికోసం దేశం కోసమా లేక వ్యక్తిగత పరువు కోసమా లేక కార్పొరేట్ల కోసమా అనేది ప్రధాని సెలవివ్వాలి. దేశీయ నిర్ణయాలపై బాహ్య ప్రభావం ఉందా?అనే ప్రశ్న ప్రభుత్వం ప్రచారం చేసే ఆత్మనిర్భర్ భారత్‌కు ముమ్మాటికీ వ్యతిరేక సంకేతమే. 1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ పాకిస్థాన్‌కు మద్దతుగా భారత్‌ను హెచ్చరించారు. అయితే ఇందిరా గాంధీ ఏమాత్రం భయపడకుండా అమెరికా మాకు యజమాని కాదు అని ముఖంమీదే స్పష్టంచేశారు. అమెరికా బెదిరింపులకు ఆమె తలొగ్గలేదు. అమెరికా వెళ్ళినప్పుడు, నిక్సన్ ఆమెను తక్కువ చేసి మాట్లాడినా ఆమె హుందాగా, ధైర్యంగా సమాధానమిచ్చారు. మేక్ ఇన్ ఇండియా నినాదం ఉన్నప్పటికీ, రక్షణ రంగంలో విదేశాలపై ఆధారపడటం పెరిగింది. ముఖ్యంగా విదేశీ పెట్టుబడులకు అధిక ప్రాధాన్యతనివ్వడం, కార్పొరేట్ అనుకూల విధానాలు పాటించడం ప్రజా రంగసంస్థలను ప్రైవేటీకరణ చేయడం కూడా విదేశీ ప్రమేయమే ఎక్కువగా ఉందని తెలుస్తోంది. స్వతంత్రతను కోల్పోవడం ప్రమాదకరం, విదేశీ జోక్యంపెరగడం, దేశ ప్రయోజనాలు పక్కన పడే ప్రమాదం వుంది. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఇటువంటి ప్రధాని లేరని భవిష్యత్తులో చరిత్రే సమాధానం చెబుతుంది. •

# శ్రమ జీవులకు నిరంతర స్ఫూర్తి మేడే



వాసం శెట్టి సుభాష్

దేశానికి కర్షకుడి అవసరం ఎంత ఉందో కార్మికుడి అవసరం కూడా అంతే ఉంది. అభివృద్ధిలో కార్మిక రంగానిది కీలక పాత్ర. శ్రీ శ్రీ అన్నట్లు శ్రమకు మించిన ఆయుధం లేదు. శ్రమ శక్తి లేనిదే ఏ దేశ అభి వృద్ధి జరగదు. అందుకే శ్రమను గౌరవించాలి, గుర్తించాలి. శ్రమ దోపి డికి వ్యతిరేకంగా ఎందరో మహానుభావులు జరిపిన పోరాట ఫలితంగా కార్మిక లోకంలో చైతన్యం వెల్లివిరిసిం ది. ఆనాటి దోపిడి విధానాలను సమూలంగా మార్చుకుని కార్మికులు తమ హక్కులను సాధించుకున్న రోజు మేడే. కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు వెళ్ళదు. కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. మే డే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. నేడు 140వ మేడే పండుగను జరుపుకోవడంతో పాటు చంద్రన్న సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర శ్రామికుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. 19వ శతాబ్దంలో పరిశ్రమల్లో పని చేసేందుకు అసంఖ్యాకంగా కార్మికుల అవసరం ఏర్పడింది. పెట్టుబడి దారులు శ్రామికులతో బానిసల్లాగా పని చేయించి అధిక లాభాలు పొందుతుండేవారు. కనీస వసతులైన తిండి, బట్ట, నివాసం వంటివి కల్పించకుండా కనీసం రోజుకు 16 నుంచి 20 గంటలు పని చేయించే వారు. పని స్థలాల్లో సరైన గాలి, వెలుతురు ఉండేవి కావు. దాంతో కొందరు కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. ఈ పరిస్థితికి భిన్నంగా, శ్రమదోపిడీ నుంచి బయటపడేందుకు కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజే మేడే. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ ఎనిమిది గంటల పని దినం అమల్లోకి రావడంతో జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే. మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారు. చికాగో పోరాటం కంటే ముందే భారత దేశంలో కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా




రైల్వే స్టేషన్‌లో1862లో సమ్మె చేశారు. అప్పటివరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అయితే ఆ పోరాటం విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారకపోవడంతో ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. 1923లో మొదటిసారిగా భారత దేశంలో మేడేను పాటించారు. అప్పటి నుంచి ప్రతి యేడు కార్మికులు ఐక్యంగా మే డేను పాటిస్తున్నారు. కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకెళ్ళదని నమ్మే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని శ్రామికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. కార్మికుల సంక్షేమంపై చంద్రన్న ముద్ర స్పష్టంగా కనిపిస్తున్నది. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవం, ముందు చూపు వల్ల తమకు మంచిరోజులు వచ్చాయని కార్మికలోకం సంబరపడుతున్నది. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించిన ఘనత చంద్రన్నకే దక్కుతుంది. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే దిశగాకూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలతోసహా వివిధ సంస్థల సహకారంతోవారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా అవకాశాలు మెరుగు పడతాయని చెప్పవచ్చు. ఇది కూటమి ప్రభుత్వం ఘనతే. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటాబేసను అనుసంధానించడంతోపాటు కార్మికులు లేటరల్ ఎంట్రీద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతున్నది. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించి నైపుణ్యాలు పెంచిఅధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం కల్పనదిశగా కసరత్తు సాగుతున్నది. రాష్ట్రంలోని 20లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణను కూటమిప్రభుత్వంచేస్తున్నది. తరచు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్నారు. కార్మిక, కర్షకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందుకు వెళ్లడం ప్రస్తుతం అత్యంత అవసరం. కార్మికవర్గం పక్షాన నిలబడి వారికి మేలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. నాలా చట్టంరద్దు, ఉచిత ఇసుక విధానం, భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు సరళతరంచేయడం వంటి నిర్ణయాలతో ఇప్పటికే నిర్మాణ రంగాన్నినిల బెట్టి లక్షల మంది జీవితాలకు భద్రత కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. 175నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ కూటమి ప్రభుత్వం కార్మికుల ప్రభుత్వంగా, కష్టజీవుల ప్రభుత్వంగా మారింది. 140వ మేడే సందర్భంగా శ్రామికుల జీవితాల్లో మరిన్ని చంద్రోదయ క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం. •

(రచయిత: కార్మిక శాఖ మంత్రి)

# ఇరాన్ యుద్ధంతో పాక్ కుదేలు

- ❖ పెనుభారం మోపిందని కేబినెట్‌లో ప్రధాని షరీఫ్ ఆందోళన
- ❖ 800 మిలియన్ డాలర్లకు పెరిగిన చమురు దిగుమతి బిల్లు

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 30:** అమెరికా ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం గత రెండేళ్లలో తాము సాధించిన ఆర్థిక పురోగతిపై తీవ్ర ప్రభావం చూపిందని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా దేశ చమురు దిగుమతి బిల్లు 300 మిలియన్ డాలర్ల నుంచి 800 మిలియన్ డాలర్లకు పెరిగిపోయిందని, ఇది ఆర్థిక వ్యవస్థపై పెనుభారం మోపుతోందని కేబినెట్ సమావేశంలో తెలిపారు. పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించి, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతీయ స్థిరత్వం కోసం పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలను కేబినెట్‌కు వివరిస్తూ ఏప్రిల్ 11న ఇస్లామాబాద్ వేదికగా అమెరికా,ఇరాన్ ప్రతినిధుల మధ్య ఏకంగా 21 గంటల పాటు మారథాన్ చర్చలు జరిగాయని, ఇది దౌత్యపరంగా ఒక ముఖ్యమైన ముందడుగు అని షెహబాజ్ పేర్కొన్నారు. ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ఉప ప్రధాని ఇషాక్ దార్ వంటి సీనియర్ అధికారుల సమన్వయంతో ఈ చర్చలు విజయవంతమయ్యాయని, దాని ఫలితంగానే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోందని వివరించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చీ తన బృందంతో పాకిస్థాన్‌లో పర్యటించి, పలు దఫాలు చర్చలు జరిపారని ప్రధాని వెల్లడించారు. తనతో రెండు గంటల పాటు సమావేశమయ్యారని, తమ నాయకత్వంతో సంప్రదించిన తర్వాత సానుకూల నిర్ణయం తీసుకుంటామని అరఘ్చీ హామీ ఇచ్చారని చెప్పారు. అరఘ్చీ రష్యా పర్యటనకు ముందు ఫోన్‌లో మాట్లాడానని, ఒమన్‌లో జరిగిన సమావేశాలు సానుకూల దృక్పథంతో జరిగాయని ఆయన చెప్పినట్లు షెహబాజ్ తెలిపారు. త్వరలోనే ఈ వివాదం ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో రెండో విడత చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. శాంతి పరిష్కారం కోసం ఇరాన్‌తో చర్చలకు సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల పునరుద్ఘాటించారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, పలువురు ఉన్నత కమాండర్లు మరణించడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. ఇరాన్ ప్రతీకార చర్యలతో ఈ ఘర్షణ గల్ఫ్ ప్రాంతమంతటా విస్తరించిన విషయం తెలిసిందే.



పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

### ఇరాన్ యుద్ధంకోసం రూ.2.1 లక్షలకోట్లు ఖర్చు

**వాషింగ్టన్, ఏప్రిల్ 30:** ఇరాన్‌తో యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెనుభారాన్ని మోపింది. ఈ యుద్ధం కారణంగా ఇప్పటివరకు 25 బిలియన్ డాలర్లు భారత కరెన్సీలో దాదాపు రూ.2.1 లక్షల కోట్లు ఖర్చయినట్లు పెంటగాన్ బడ్జెట్ చీఫ్ అధికారికంగా ప్రకటించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన అత్యంత సమగ్రమైన అంచనా ఇదే కావడం గమనార్హం. ఇరాన్‌పై జరిపిన దాడుల వల్ల అమెరికా వద్ద ఉన్న అత్యాధునిక క్షిపణులు, బాంబుల నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని తెలిపారు. యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లోనే సుమారు 5.6 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను వినియోగించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో రక్షణ బడ్జెట్‌పై జరిగిన కీలక సమావేశంలో అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ పాల్గొన్నారు. రక్షణ బడ్జెట్‌ను 40 శాతం పెంచడం ద్వారా గతంలో జరిగిన తక్కువ పెట్టుబడుల లోటును పూడ్చుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, యుద్ధంపై ప్రతిపక్ష డెమొక్రాట్లు, కొందరు రిపబ్లికన్ల వ్యాఖ్యలు "ఓటమిని కోరేవిగా" ఉన్నాయని ఆయన విమర్శించారు. చైనాతో ఆధిపత్యం కోసం కాకుండా, ఒక సమతుల్య సంబంధాన్ని కొనసాగించడానికే అమెరికా ప్రయత్నిస్తుందని హెగ్సెత్ స్పష్టం చేశారు. ఇరాన్‌తో యుద్ధంలో సహకరించని మిత్రదేశాలు, ముఖ్యంగా నాటో సభ్య దేశాలు, తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇజ్రాయెల్, దక్షిణ కొరియా, పోలెండ్ వంటి దేశాలను ఆదర్శవంతమైన మిత్రదేశాలుగా ఆయన కొనియాడారు. గతంలో ఇరాన్ కూడా యుద్ధం వల్ల తమకు రూ. 25 లక్షల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, దానికి అమెరికా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది.

## ఆపరేషన్ సిందూర్ నిలిపివేత
# మా సొంత నిర్ణయమే!

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** ఆపరేషన్ సిందూర్ నిలిపివేతపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని ఆయన అన్నారు. కానీ అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికీ తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిలిపివేత వ్యూహాత్మక నిర్ణయమేనని అన్నారు. కానీ సామర్థ్యం లేక నిలిపివేయలేదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు ఒక ఉదాహరణ అన్నారు. మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని ప్రశంసించారు. సొంత నిబంధనలు, నిర్ణయం ప్రకారమే సరైన సమయంలో దానిని ముగించామని తెలిపారు. ఇది మనం స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమని పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్ర బిందువు అని రాజ్‌నాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని, దానికి బహుముఖ కోణాలు ఉన్నాయని అన్నారు. దానిని కూకటివేళ్లతో పెకలించాలని ఆయన పిలుపునిచ్చారు. పాకిస్థాన్ అనునిత్యం ఉగ్రవాదానికి మద్దతుగా నిలుస్తోందని ఆరోపించారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే పాకిస్థాన్‌మాత్రం తీవ్రవాదానికి కేంద్రబిందువు అని రాజ్‌నాథ్ సింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



రాజ్‌నాథ్‌నాథ్‌సింగ్

#### పర్షియన్‌గల్ఫ్‌లో 2379
### అమెరికా సైనికుల డేటా లీక్..

**హాండాలా సైబర్‌గ్రూప్ వాట్సాప్‌లలో సందేశాలు**

**టెహ్రాన్, ఏప్రిల్ 30:** ఇరాన్‌తో సంబంధాలున్న ఓ హ్యాకర్ల బృందం అమెరికాకు గట్టి షాక్ ఇచ్చింది. పర్షియన్ గల్ఫ్‌లో మోహరించిన 2,379 మంది అమెరికా మెరైన్స్ వ్యక్తిగత వివరాలను లీక్ చేసినట్లు హాండాలా అనే సైబర్ గ్రూప్ ప్రకటించింది. తమ టెలిగ్రామ్ ఛానెల్‌లో సైనికుల పేర్లు, ఇతర వివరాలను విడుదల చేసినట్లు తెలిపింది. తమ నిఘా సామర్థ్యాలను చాటుకునేందుకే ఈ లీక్‌కు పాల్పడినట్లు హ్యాకర్లు పేర్కొన్నారని అమెరికా పత్రిక ఒకటి వెల్లడించింది. అంతటితో ఆగకుండా ఆ సైనికుల వాట్సాప్‌కు మేం మిమ్మల్ని గమనిస్తున్నాం, మిమ్మల్ని లక్ష్యంగా చేసుకోవచ్చు అంటూ బెదిరింపు సందేశాలు పంపినట్లు ఇరాక్‌కు చెందిన షఫాక్ న్యూస్ రిపోర్ట్ చేసింది. సైనికుల కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి చిరునామాలు, వారి దినచర్యలు, కదలికల సమాచారం తమ వద్ద ఉందని హ్యాకర్ల బృందం హెచ్చరించింది. ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ తీవ్రంగా స్పందించింది. సైనికుల వివరాలు బహిర్గతం కావడం భద్రతకు పెను ముప్పు అని భావిస్తూ ఈ సైబర్ దాడిపై ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. డేటా ఎలా చోరీకి గురైందనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఇదే హాండాలా గ్రూప్ గత నెలలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వ్యక్తిగత ఈ మెయిల్‌ను హ్యాక్ చేసినట్లు ప్రకటించుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికా,ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ సైబర్ దాడి జరగడం ప్రాధాన్యంను సంతరించుకుంది. ఈ ఘటనతో అంతర్జాతీయ ఘర్షణల్లో సైబర్ దాడులు మరింతకీలకంగా పనిచేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### భారత్‌కు క్షమాపణలు చెప్పిన నేపాల్ ఎయిర్‌లైన్స్

**ఖాట్మండు, ఏప్రిల్ 30:** నేపాల్ ఎయిర్‌లైన్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వివాదాస్పద మ్యాప్ విషయంలో వెనక్కితగ్గి, భారత్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పింది. జమ్మూకశ్మీర్‌ను పాకిస్థాన్‌లో భాగంగా చూపడం వంటి సున్నితమైన అంశంపై తలెత్తిన వివాదాన్ని ఆ సంస్థ సకాలంలో గుర్తించి సరిదిద్దుకుంది. సోషల్ మీడియాలో షేర్‌చేసిన నెట్‌వర్క్ మ్యాప్‌లో అంతర్జాతీయ సరిహద్దులకు సంబంధించి భౌగోళిక వ్యత్యాసాలు ఉన్నాయని నేపాల్ ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది. ఆ మ్యాప్ తమ దేశ అధికారిక వైఖరికాదని, కేవలం అది ఒక సాంకేతిక పొరపాటు మాత్రమేనని పేర్కొంటూ హృదయపూర్వక క్షమాపణలు కోరింది. భారత్‌తో ఉన్న బలమైన సంబంధాలను గౌరవిస్తామని, ఎవరి మనస్తాపానికైనా చింతిస్తున్నామని తెలిపింది. వివాదం రేగిన వెంటనే ఆ పోస్టును తొలగించడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి లోపాలు తలెత్తకుండా అంతర్గత సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. మన దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన జమ్మూకశ్మీర్ విషయంలో జరిగిన ఈ తప్పిదంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు రావడంతో నేపాల్ ఎయిర్‌లైన్స్ వేగంగా స్పందించింది. ఇరు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాల దృష్ట్యా ఇలాంటి పొరపాట్లు దౌత్యపరమైన ఇబ్బందులకు దారితీయకుండా ఉండటానికి వెంటనే క్షమాపణ చెప్పింది.

## మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**15 మంది దుర్మరణం... 30 మందికి తీవ్ర గాయాలు**



సంఘటనా స్థలంలో రోదిస్తున్న బాధితుల కుటుంబసభ్యులు,

**థార్, ఏప్రిల్ 30:** మధ్యప్రదేశ్‌లోని ధార్‌జిల్లాలో గత రాత్రి కూలీలతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడటంతో 15 మంది దుర్మరణం చెందారు. వీరిలో మహిళలు, చిన్నారులు ఉన్నారు. మరో 30మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఇండోర్ అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ విషాద ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, పనులు ముగించుకుని సుమారు 40 మందికి పైగా కూలీలు ఒక పికప్ వ్యాన్‌లో తమ గ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులతో, అతివేగంతో వెళ్తున్న వాహనం చిక్లియా ఫాటా సమీపంలో నియంత్రణ కోల్పోయింది. దీంతో వాహనం పలు మార్లు పల్టీలు కొట్టి, డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు వ్యాన్‌లో ఉన్నవారు దాని కింద నలిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ధార్‌లోని జిల్లా భోజ్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం ఇండోర్‌లోని ఆసుపత్రులకు తరలించారు.

ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సహాయ నిధి నుంచి రూ. 2 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఈ ఘటనపై తిర్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌సిఎల్‌టి అధ్యక్షుడిగా జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రెవాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) అధ్యక్షుడిగా పంజాబ్ - హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (పదవీ విరమణపొందిన) అనుపిందర్ సింగ్ గ్రెవాల్‌ను నియమించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సిబ్బంది, శిక్షణ శాఖ(డిఒపిటి) జారీ చేసిన అధికారిక ప్రకటన ప్రకారం, "పంజాబ్ - హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అయిన జస్టిస్ అనుపిందర్‌సింగ్ గ్రెవాల్‌ను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) అధ్యక్ష పదవికి నియమించాలన్న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నియామకం రూ.80,000 (స్థిర వేతనం) (సవరణకు ముందు) వేతన శ్రేణిలో, పదవీ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి ఐదేళ్ల పాటు లేదా ఆయనకు 67 ఏళ్లు నిండే వరకు ఈ రెండింటిలో ఏది ముందుగా సంభవిస్తే అప్పటి వరకు అమలులో ఉంటుంది," అని ఆ ప్రకటన పేర్కొంది. ఎన్‌సిఎల్‌టి అధ్యక్షుడిగా నవంబర్ 1, 2021 నుండి సేవలందించి, ఈ ఏడాది ప్రారంభంలో పదవీ విరమణ చేసిన జస్టిస్ రామలింగం సుధాకర్ స్థానంలో జస్టిస్ గ్రెవాల్ బాధ్యతలు స్వీకరిస్తారు. పంజాబ్‌లోని లూథియానా జిల్లాకు చెందిన ఒక రైతు కుటుంబంలో మార్చి 10, 1964న జన్మించిన జస్టిస్ గ్రెవాల్, ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. అక్కడ ఆయన 1985లో చరిత్రలో బిఎ (ఆనర్స్), 1987లో చరిత్రలో ఎంఎ పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన ఎల్‌ఎల్‌బి పట్టా పొందారు. 1992లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి పట్టా పొందారు. ఆయన 1992లో పంజాబ్ - హర్యానా హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, పంజాబ్ ప్రభుత్వంలో అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్, డిప్యూటీ అడ్వకేట్ జనరల్, సీనియర్ డిప్యూటీ అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్ వంటి అనేక ముఖ్యమైన న్యాయ పదవులలో పనిచేశారు. జస్టిస్ గ్రెవాల్ నవంబర్ 2009లో పంజాబ్ - హర్యానా హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ కేసులను వాదించడానికి సీనియర్ ప్యానల్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. బెంచ్‌కు పదోన్నతి పొందే వరకు ఆ పాత్రలో కొనసాగారు. ఆయన సెప్టెంబర్ 25, 2014న పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. తరువాత, డిసెంబర్ 2014లో రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ అయ్యి, మే 2016లో అక్కడ శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత, ఆయన తిరిగి పంజాబ్ -హర్యానా హైకోర్టుకు బదిలీ అయ్యారు, అక్కడ అక్టోబర్ 2016లో బాధ్యతలు స్వీకరించారు.



### హెచ్1బి లాటరీతో ఉద్యోగం కోల్పోయిన ఎన్నారై టెక్కీ!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** అమెరికాలో ఏటా 2 లక్షల డాలర్ల (సుమారు రూ.1.6 కోట్లు) భారీ వేతనం అందుకుంటున్న ఓ ఎన్నారై టెక్కీ హెచ్ 1బీ వీసా లాటరీలో ఎంపిక కాకపోవడంతో ఉద్యోగం కోల్పోయి భారత్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. ప్రస్తుతం రూ.40 లక్షల అప్పుతో ఇక్కడి కఠినమైన ఉద్యోగ మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని సోషల్ మీడియాలో తన ఆవేదనను పంచుకున్నారు. హెచ్ 1బీలో ఎంపిక కాకపోవడంతో భారత్‌కు బలవంతంగా తిరిగి వచ్చాడు. తన వీసా గడువు ముగిసిపోవడం, పనిచేస్తున్న యూఎస్ కంపెనీకి భారత్‌లో కార్యాలయం లేకపోవడంతో బదిలీకి అవకాశం లేక తప్పనిసరి పరిస్థితుల్లో వెనక్కి రాక తప్పలేదని తెలిపారు. ఉన్నట్టుండి భారీ ఆదాయం సున్నాకి పడిపోవడం, స్వదేశానికి తిరిగి రావడం తనను తీవ్ర షాక్‌కు గురి చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడి జాబ్ మార్కెట్ అతిపెద్ద అడ్డంకిగా మారింది. పోటీ చాలా తీవ్రంగా ఉంది. కానీ, నన్ను ఆశ్చర్య పరిచిన విషయం ఇంటర్వ్యూల కఠినత్వం. అమెరికాతో పోలిస్తే ఇక్కడ అడుగుతున్న ప్రశ్నలు చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయని వాపోయారు. రూ.40 లక్షల అప్పు తీర్చాలన్న ఒత్తిడి తన మానసిక ప్రశాంతతను దెబ్బతీస్తోందని వివరించారు. ఈ పోస్ట్ వైరల్ కావడంతో నెటిజన్లు పలు సలహాలు ఇచ్చారు. అధిక జీతంపై ఆశలు తగ్గించుకుని, ముందు ఏదో ఒక ఉద్యోగంలో చేరడంపై దృష్టి పెట్టండని ఒకరు సూచించారు. మీ అంతర్జాతీయ అనుభవం, 2 లక్షల డాలర్ల జీతం అనే అహాన్ని పక్కనపెట్టండి. ఇప్పుడు రూ.15-20 లక్షల ప్యాకేజీ వచ్చినా అదృష్టమే అని మరో యూజర్ వ్యాఖ్యానించారు. అమెరికా జీతంతో పోల్చుకోవద్దని, భారత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అంచనాలు పెట్టుకోవాలని చాలామంది సలహా ఇచ్చారు.

### ఇరాన్‌పై భూతల దాడిచేస్తే తీవ్ర పరిణామాలు తప్పవు..!

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ వార్నింగ్**

**మాస్కో, ఏప్రిల్ 30:** ఇరాన్‌పై అమెరికా భూతల దాడి చేయొద్దని, అలాచేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వార్నింగ్ ఇచ్చారు. ఇరువురి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సందర్భంగా పుతిన్ ఈ హెచ్చరిక చేసినట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దాదాపు 90 నిమిషాల పాటు మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన కీలక సమాచారం రష్యాకు చెందిన విదేశీ సలహాదారు యురి ఉషకోవ్ వెల్లడించారు. ట్రంప్, పుతిన్ ఇరాన్ యుద్ధం, ఉక్రెయిన్ యుద్ధాలపై చర్చించారు. ఇరాన్‌పై అమెరికా భూతల దాడి చేయడం ప్రమాదకరమని, అలా జరిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్‌ను హెచ్చరించారు. మరోవైపు ఉక్రెయిన్‌పై కాల్పుల విరమణ అంశంలో ట్రంప్ సూచనను పుతిన్ స్వాగతించారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ ట్రంప్‌తో చెప్పారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు అవసరమైతే మధ్యవర్తిత్వంలో సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా ట్రంప్‌తో పుతిన్ తెలిపారు. ఈ అంశంపై ట్రంప్ కూడా స్పందించారు. పుతిన్‌తో చర్చలు బాగా సాగాయని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించడంలో సాయం అందించేందుకు రష్యా సిద్ధంగా ఉందని ట్రంప్ అన్నారు. త్వరలోనే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించేందుకు రష్యా సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోందని ట్రంప్ అన్నారు. త్వరలోనే దీనిపై ఒక సానుకూల ప్రకటన వెలువడే అవకాశం ఉందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మూడో కాన్పుకు ప్రసూతి సెలవు ఇవ్వాల్సిందే

**- తమిళనాడు ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు ఆదేశం**
**- మెటర్నిటీ లీవ్స్ విషయంలో వివక్ష చూపకూడదని వ్యాఖ్య**



**చెన్నై, ఏప్రిల్ 30:** ఉద్యోగులకు ప్రసూతి ప్రయోజనాలను, ముఖ్యంగా మూడో కాన్పుకు ఇచ్చే సెలవును మంజూరు చేయడంలో ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. షాయిూ నిషా దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ, జస్టిస్‌లు ఆర్. సురేష్ కుమార్, ఎన్. సెంథిల్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఫిబ్రవరి 2, 2026 నుండి ఫిబ్రవరి 1, 2027 వరకు ప్రసూతి సెలవు కోరుతూ పిటిషనర్ దాఖలు చేసిన విజ్ఞప్తిని తిరస్కరిస్తూ విల్లుపురం ప్రధాన జిల్లా జడ్జి మార్చి 27, 2026న జారీ చేసిన ఉత్తర్వులను, ఏప్రిల్ 27, 2026న తిరిగి విధుల్లో చేరమని ఆమెను కోరిన విల్లుపురం మోటార్ యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను ధర్మాసనం రద్దు చేసింది. మార్చి 13, 2026 నాటి ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)ను పరిగణనలోకి తీసుకోకుండా, నిషా సమర్పించిన దరఖాస్తును పరిశీలించి, మొదటి, రెండవ గర్భం దాల్చిన మహిళలకు ఇచ్చే ప్రసూతి సెలవుతో సమానంగా ఒక వారంలోగా ప్రసూతి సెలవును మంజూరు చేయాలని ధర్మాసనం జిల్లా జడ్జిని ఆదేశించింది.

## వారి కోసం ఆ చట్టాలను మార్చండి

**- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం.. బాలిక అబార్షన్ కేసులో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** మైనర్ బాలికలపై జరిగిన అత్యాచారాల కారణంగా ఏర్పడిన గర్భాలను చట్టబద్ధంగా తొలగించుకోవడానికి ఉన్న కాల పరిమితిని తొలగించేందుకు, వైద్యపరమైన గర్భ విచ్ఛేద చట్టాన్ని (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్) సవరించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం 30 వారాల గర్భంతో ఉన్న 15 ఏళ్ల బాలిక గర్భాన్ని తొలగించాలన్న ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆదేశానికి వ్యతిరేకంగా, న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) దాఖలుచేసిన క్యూరేటివ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. గర్భం 24 వారాల గరిష్ట పరిమితిని దాటిందని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈదశలో, మైనర్లపై అత్యాచారాల కేసులలో గరిష్ట పరిమితిని తొలగించేందుకు చట్టాన్ని సవరించాలని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. "మైనర్ బాలికపై అత్యాచారం కారణంగా అవాంఛిత గర్భం దాల్చిన సందర్భాలలో,కాలపరిమితి వర్తించకుండా ఉండేలా దయచేసి మీ చట్టాన్ని సవరించండి," అని సిజెఐ అన్నారు. మైనర్ బాధితురాలు గర్భం దాల్చిన విషయాన్ని గ్రహించి, చట్టబద్ధమైన పరిష్కారాల గురించి తెలుసుకునేలోపే, కాలపరిమితి ముగిసిపోతుందని ధర్మాసనం పేర్కొంది. చాలా మంది బాధితులు ఈ విషయాన్ని బయట పెట్టడానికి వెనుకాడతారని కూడా ధర్మాసనం ఎత్తి చూపింది. అటువంటి పరిస్థితిలో, పరిష్కారాలను నిలిపివేయలేమని తెలిపింది. బాలికలపై అత్యాచారాల కేసులలో విచారణలు వీలైనంత త్వరగా జరి గేలా చట్టాన్ని సవరించాలని సిజెఐ అన్నారు. నేటి విచారణ సందర్భంగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను ఉపయోగించి గర్భస్రావానికి అనుమతి ఇచ్చినప్పుడు, చట్టబద్ధమైన పరిమితులు వైద్యులకు మాత్రమే వర్తిస్తాయని, అవి కోర్టుకు వర్తించవని ధర్మాసనం ఏఎస్‌జీకి తెలిపింది. ఎయిమ్స్ అభ్యర్థనను స్వీకరించడానికి కోర్టు నిరాకరించింది. ఆసుపత్రి తన నిర్ణయాన్ని మైనర్‌పై రుద్దలేదని పేర్కొంది. గర్భాన్ని కొనసా గించాలా లేదా తొలగించుకోవాలా అనేది నిర్ణయిం చుకోవాల్సింది ఆ బాలికేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



### ఇరాన్ అమ్ములపొదిలోకి కొత్త అస్త్రం!

**టెహ్రాన్, ఏప్రిల్ 30:** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. శాంతి చర్చలు విఫలమవుతున్న తరుణంలో అమెరికాకు ఇరాన్ నౌకాదళ కమాండర్, రియర్ అడ్మిరల్ షహ్రామ్ ఇరానీ సరి కొత్త హెచ్చరిక జారీ చేశారు. శత్రువు వెన్నులో వణుకుపుట్టించే ఒక ఆయుధాన్ని టెహ్రాన్ త్వరలో మోహరిస్తుందని, వారికి గుండెపోటు రాదని ఆశిస్తున్నానని ఆయన తెలిపారు. ఆయన ఆ ఆయుధం వివరాలను వెల్లడించనప్పటికీ, అది యుద్ధభూమిలో పరిస్థితిని ఏకపక్షంగా మార్చివేస్తుందని పేర్కొన్నారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ అనేక ప్రతీకార చర్యలు చేపట్టిందని, వాటిలో అమెరికా విమానవాహక నౌక అబ్రహం లింకన్‌ను లక్ష్యంగా చేసుకుని జరిపిన పలు క్షిపణి దాడులు కూడా ఉన్నాయని ష్రామ్ ఇరానీ తెలిపారు. ఈ దాడులు అమెరికా వైమానిక కార్యకలాపాలకు తాత్కాలికంగా అంతరాయం కలిగించాయని వివరించారు. పశ్చిమాసియా అంతటా అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యాలపై ఇరాన్ బలగాలు 100కు పైగా విడత దాడులు చేసినట్లు గుర్తు చేశారు. మా కొత్త ఆయుధం అమెరికా గెండెల్లో రైళ్లు పరిగెత్తించడం ఖాయమన్నారు.

## భూ వివాదాలకు ప్రత్యేక రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్

**- సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు**
**- విచారించిన ధర్మాసనం... కేంద్రానికి నోటీసులు**
**- నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశం**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేక రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్ కేడర్‌ను ఏర్పాటు చేయాలని, భూ వివాదాలను పరిష్కరించే అధికారులకు కనీస న్యాయ అర్హతలను నిర్దేశించాలని ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) దాఖలైంది. ఈ పిల్‌ను పరిశీలించడానికి సుప్రీంకోర్టు గురువారం అంగీకరించింది. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారించింది. అధికారిక న్యాయ విద్య, న్యాయ శిక్షణ లేని రెవెన్యూ, కన్సాలిడేషన్ అధికారులు టైటిల్, వారసత్వం, సంక్రమణ, స్వాధీనం, ఇతర ఆస్తి హక్కులపై తీర్పులు ఇవ్వడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 21, 50లను ఉల్లంఘిస్తుందని ఈ పిటిషన్‌లో వాదించారు. విచారణ సందర్భంగా సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, "ఈ అంశం చాలా ఆసక్తికరంగా కూడా ఉంది.

కానీ ఇది శాసనసభ పరిధిలోకి వస్తుందని వారు అంటారు" అని వ్యాఖ్యానించింది. స్వయంగా హాజరైన ఉపాధ్యాయ్, ఈ సమస్య జిల్లాల వ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ భారతదేశంలో వ్యాజ్యదారులు లేవనెత్తిన అత్యంత తీవ్రమైన ఆందోళనలలో ఒకటిగా మారిందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. "అవును, నేను ప్రతి వారం 2-3 జిల్లాలకు వెళ్తాను. చాలా అభ్యర్థనలు ఈ విషయానికి సంబంధించినవే. ఏ దస్తావేజు చెల్లుబాటు అవుతుందో నిర్ధారించడానికి ఒక చక్‌బందీ అధికారి (ఏకీకరణ అధికారి) వద్ద 40 ఏళ్లుగా ఒక కేసు పెండింగ్‌లో ఉంది. ఇది అధికారాల విభజనను ప్రభావితం చేస్తుంది" అని ఆయన అన్నారు. లేవనెత్తిన సమస్యలు చాలా వరకు శాసనపరమైనపరిధిలోకి రావచ్చని వ్యాఖ్యానిస్తూనే,సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, "నాలుగు వారాల్లోగా తిరిగి సమాధానం ఇవ్వవలసిన నోటీసు జారీ చేయండి," అని ఆదేశించింది.

పిటిషన్ ప్రకారం, భారతదేశంలో దాదాపు 66 శాతం సివిల్ వ్యాజ్యాలు భూమి, ఆస్తి వివాదాలకు సంబంధించినవే, కానీ అటువంటి విషయాలు తరచుగా అధికారిక న్యాయ శిక్షణ లేని కార్యనిర్వాహక అధికారులచే మొదటి దశలోనే నిర్ణయించబడుతున్నాయి, దీని ఫలితంగా అస్థిరమైన, ఆలస్యమైన, చట్టపరంగా లోపభూయిష్టమైన నిర్ణయాలు వెలువడుతున్నాయి.

# నకిలీ విత్తన అమ్మకాలపై కొరడా!

**పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
తెలంగాణలో నకిలీ విత్తనాలపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ అధికారులు, విత్తన కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విత్తన కంపెనీలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసుశాఖతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.గతంలో నాణ్యత తక్కువగా ఉన్న విత్తనాలపై కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దుచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు విత్తన నిల్వ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని,సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాలవల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని తేల్చి చెప్పారు. ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని మంత్రి సూచించారు.జిల్లా నుంచి మండల స్థాయివరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ నిల్వలు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విడి పత్తి విత్తనాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దుల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. విత్తనాల సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు లైసెన్సింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్దేశించారు. జిటిటి ఫెయిల్ అయిన పత్తి విత్తనాలను పూర్తిగా వినియోగానికి అనర్హంగా ప్రకటించాలన్నారు. అదేవిధంగా కో మార్కెటింగ్ విధానంలో ఏ కంపెనీ విత్తనాన్ని, ఏ పేరుతో అమ్ముతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని, విత్తనచట్టంలో ఉన్న లోపాలను కంపెనీలు అవకాశంగా మార్చుకొని రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలను చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తన కంపెనీల ఆ తరహా ప్రయత్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు.అవసరమైతే కో మార్కెటింగ్ పూర్తి రద్దు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. వానాకాలం (ఖరీఫ్) 2026 సాగు సన్నాహకంలో భాగంగా విత్తనాల లభ్యతను కంపెనీల వారీగా, పంటల వారీగా సమీక్షించారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రంలో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశం ఉందని దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరానికి దాదాపు రెండింతలు నిల్వలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడ్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక మార్గమే సమాజ పరివర్తనకు దిక్సూచి

**గవర్నర్ శివప్రతాప్ శుక్లా**



సమావేశంలో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మంత్రి జూపల్లి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి**
**హైదరాబాద్, ఏప్రిల్ 30 :** గురువారం ఉదయం కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ స్థాపకులు పూజ్య బాబూజీ మహారాజ్ 127వ జయంతి, సిక్కు గురువు గురు తేజ్ బహదూర్ 350వ షహీది దివస్‌ను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉత్తరాఖండ్ గవర్నర్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్‌సింగ్, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కన్హా శాంతి వనం నిర్వాహకులు, శ్రీరామ్ చంద్ర మిషన్ అధ్యక్షుడు ఆధ్యాత్మికవేత్త కమలేష్ పటేల్ (దాజి)తో కలిసి పాల్గొన్నారు.'ఒకే మానవత్వం – ఒకే హృదయం: గురుతేజ్ బహదూర్ బోధనలు' అనే అంశంతో జరిగిన ఈకార్యక్రమంలో ధ్యానం, స్మరణ, విశ్వ సహోదర భావాలను పంచుకున్నారు. అనంతరం తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.... బాబూజీ మహారాజ్ మానవత్వానికి విశ్వ ప్రేమ, ఆధ్యాత్మిక చైతన్యానికి మార్గ దర్శకులని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. అంతర్గత మార్పే బాహ్య మార్పుకు పునాది అని, వ్యక్తుల్లో శాంతి, సమతుల్యత పెరిగితే సమాజం సహజంగానే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లకు శాశ్వత పరిష్కారం ఆధ్యాత్మిక దృక్పథంలోనే ఉందని స్పష్టం చేశారు. నైతికత, నిజాయితీ, వినయం, కరుణ వంటి విలువలతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. సహజ్ మార్గం అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని గవర్నర్ పేర్కొన్నారు. రామ్‌చంద్రమిషన్ ఉత్తర ప్రదేశ్‌లోని ఫతేహ్‌గఢ్ నుంచి ప్రారంభమై, షాజహాన్‌పూర్ నుంచి బాబుజీ మహారాజ్ విస్తరించారని తెలిపారు. సహజ్ మార్గం ద్వారా ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. గౌతమ బుద్ధుడు, మహావీరుడి బోధనల నుంచి భారతదేశం ఎప్పటికీ శాంతి మార్గాన్నే అనుసరిస్తూ వచ్చిందని గవర్నర్ పేర్కొన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ వంటి సంస్థలు ఈ దిశగా కీలక పాత్ర పోషిస్తున్నాయని గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గురు తేజ్ బహదూర్ త్యాగం, ధైర్యం, ఆధ్యాత్మిక విలువలను, అలాగే బాబూజీ మహారాజ్ బోధించిన అంతర్ముఖ శాంతి, ఐక్యతపై ప్రముఖులు ప్రస్తావించారు.

## జిఐ గుర్తింపునకు చేరువలో సంగారెడ్డి చామదుంప

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాకు చెందిన సజ్జాపూర్ చామదుంప భౌగోళిక గుర్తింపు పొందే దిశగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. చెన్నైలోని జిఐ రిజిస్ట్రి కార్యాలయంలో ఈ ఉత్పత్తికి సంబంధించిన దరఖాస్తును నిపుణులకమిటీ పరిశీలించింది. సజ్జాపూర్ ప్రాంతంలో పండే చామదుంపల రుచి,నాణ్యతకు ప్రసిద్ధి చెందాయి. మార్కెట్‌లో లభించే సాధారణ చామదుంపల కంటే భిన్నంగా ఉండటమే కాకుండా, త్వరగా ఉడికేగుణాన్ని కలిగి ఉంటాయి. ఒకవేళ ఈ పంటకు జిఐ ట్యాగ్ లభిస్తే సంగారెడ్డి ప్రాంత రైతులకు అంతర్జాతీయస్థాయిలో బ్రాండింగ్ లభించనుంది. దీంతో ఎగుమతులు పెరగడమే కాకుండా గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. తెలంగాణ ఉద్యానవనశాఖ సజ్జాపూర్ చామ దుంపకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి శ్రమిస్తోంది. ఈ ప్రక్రియ తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే అధికారికంగా జిఐ గుర్తింపు లభించే అవకాశం ఉంది.ఇప్పటికే తాండూరు కందిపప్పు జిఐ జాబితాలో ఉండగా, ఇప్పుడు చామదుంప కూడా ఆ గౌరవాన్ని దక్కించుకోనుంది. ప్రకృతి సిద్ధంగా లభించే ఈ చామదుంపలకు భౌగోళిక గుర్తింపు లభిస్తే తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తుల ఖ్యాతి ప్రపంచవ్యాప్తం కానుంది.

## జనగణలో బిసిల కాలం లేకపోవడంపై బిసి కమిషన్ ఆందోళన

**జనగణన డైరక్టర్‌కి కమిషన్ ఛైర్మన్ నిరంజన్ లేఖ**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30**
రాష్ట్రంలో జరుగుతున్న మొదటి విడత జనగణలో బీసీల కాలం లేకపోవడంపై తెలంగాణ బిసి కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర జనగణన డెరెక్టర్ భారతి హోళీకేరికి రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ గురువారం లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ రాజకీయ వ్యవహారాల కాబినెట్ సబ్ కమిటి ఏప్రిల్ 30న జరిగిన సమావేశంలో 2027 జనగణనలో బీసీల కుల డాటా సేకరించడానికి నిర్ణయం చేసిందని, రాష్ట్రంలో ఏప్రిల్ 26న ప్రారంభమైన మొదటి విడత జనాభా లెక్కల సేకరణలో బీసీ జనాభా సేకరణను విస్మరించడం బీసీలను నిరుత్సాహపరిచిందని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ గురువారం రాష్ట్ర జనగణన డెరెక్టర్ భారతి హోళీకేరికి రాసిన ఒక లేఖలో పేర్కొన్నారు. ఈ అంశంతో వివరణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం 2వ విడతలో బీసీ వివరాలను సేకరిస్తుందని పేర్కొనడం జరిగిందని లేఖలో గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న బీసీ కులాల జాబితాను డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్‌కు పంపిస్తూ ఆయా కులాల వారి వివరాలను ఏవిధంగా 2వ విడత జాబితాలో నమోదు చేస్తారో వివరించాలని బీసీ కమిషన్ కోరింది. ఇదే అంశంపై సవివరమైన వివరణను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఇవ్వాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్‌ను కోరినట్టు నిరంజన్ తెలిపారు.

# ఆన్‌లైన్‌లో పురుగుమందుల విక్రయాలు వద్దు

**రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
ఆన్‌లైన్‌లో ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై వ్యవసాయశాఖ అధికారులు,అమెజాన్ ప్రతినిధులతో తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సమావేశమైంది. ఈ మేరకు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన గురువారం బిఆర్‌కె భవన్‌లో జరిగిన సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులు, అమెజాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ కోదండరెడ్డి కీలక ఆదేశాలు జారి చేశారు. మానవ ఆరోగ్యానికి హానికరమైన, అధిక విషపూరిత పురుగు మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో విక్రయించకూడదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పురుగు మందులను విక్రయించరాదని, ఆన్‌లైన్ విక్రయాలు రైతులకు సౌలభ్యంగా ఉన్నప్పటికీ, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ, అమెజాన్ వంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమెజాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. వ్యవసాయ కమిషన్ సూచనలను పూర్తిగా పాటిస్తామని, రైతుల క్షేమమే తమ ప్రాధాన్యత అని తెలిపారు. నిషేధిత పురుగు మందులను వెంటనే ప్లాట్‌ఫామ్ నుండి తొలగిస్తామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు భూమి సునీల్, మరికంటి భవాని, వ్యవసాయశాఖ అధికారులు శైలజ, వ్యవసాయ కమిషన్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ డా. కేశవులు, సంధ్యారాణి, స్రవంతి, రజిత, శ్రావణి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## వారం రోజుల్లోగా విద్యార్థుల మెస్ చార్జీలను చెల్లించాలి

**లేకపోతే సిఎం ఇంటి ఎదుట బైఠాయింపు**

**ఆర్.కృష్ణయ్య**

**సైఫాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వారంరోజుల్లోగా ఎస్టీ విద్యార్థుల మెస్ చార్జిలు చెల్లించాలని రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదుట బైఠయిస్తామని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం 8 నెలలుగా ఎస్టీ విద్యార్థులకు, 4 నెలలుగా ఎస్సీ, బిసి విద్యార్థులకు మెస్ బిల్లులు, కరెంట్ బిల్లులు, నీటి బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టల్స్ నిర్వాహణ పూర్తిగా సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క హాస్టల్‌లో 200నుంచి 300 వరకు విద్యార్థులు నివసిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నెల, నెల రావాల్సిన బడ్జెట్‌ను నిలిపివేస్తే నిర్వాహణ ఏ విధంగా కొనసాగుతుందని ఆయన ప్రశ్నించారు. కూరగాయలు, గుడ్లు, మాంసం, నూనె, పప్పు దినుసులు, ఇతర వస్తువుల కోసం అధికారులు అప్పులు చేసి, వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి హాస్టల్స్ నిర్వహణ చేస్తున్నారని ఇది విద్యార్థుల సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణ ఖర్చులు ప్రస్తుతం ఇచ్చే మొత్తంతో అసలు సరిపోవడం లేదన్నారు. హాస్టల్స్‌ను సక్రమంగా నడపాలంటే ప్రస్తుతం ఉన్న నర్వహణ నిధులను 10 వేల నుంచి 50 వేలకు పెంచాలని, హాస్టల్స్‌లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రతి కాలేజీ హాస్టల్స్‌కు గ్రేడ్–1 వార్డెన్లను నియమించాలని, 100 మందికి పైగా విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటే వర్కర్ల సంఖ్యను పెంచాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి నాయకులు సి.రాజేందర్‌ముదిరాజ్, గొరిగే మల్లేష్‌యాదవ్, పగిళ్ల సతీష్, నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒయు పరిధిలో డిగ్రీలో 10 వేల సీట్లకు కోత!

**ప్రైవేటు కాలేజీల తనిఖీల్లో అధికారుల చర్యలు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30**
రానున్న 2026–27 విద్యా సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీ ల్లో 10వేల సీట్లు తగ్గనున్నాయి. సీట్లు తగ్గడంతోపాటు కొన్ని ప్రైవేటు కాలేజీల్లో సెక్షన్లను తగ్గించడమే కాకుండా.. మరికొన్ని కాలేజీల్లో కోర్సులకు సైతం 1ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు కోత విధించారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో దోస్త్–2026 అడ్మిషన్ల నేపథ్యంలో అనుబంధ గుర్తింపును ఇవ్వడం కోసం యూనివర్సిటీ అధికారులు సుమారు నెలరోజులపాటు ఫిజికల్ తనిఖీలను నిర్వహించారు. 6 కమిటీలు తనిఖీలను నిర్వహించినట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. 2025–26లో యూనివర్సిటీ పరిధిలో 418 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చారు. గత నాలుగేళ్లుగా ఫిజికల్‌గా తనిఖీలు నిర్వహించకపోయినప్పటికీ అనుబంధ గుర్తింపును ఇస్తూ వస్తున్నారు. కరోనా తరువాత నుంచి ఫిజికల్ తనిఖీలను చేపట్టడంలేదు. నెల రోజులుగా 270 కాలేజీల తనిఖీలు పూర్తి చేశారు. వీటికంటే ముందు మరో 70 కాలేజీలను డిగ్రీ, పీజీ కోర్సుల నేపథ్యంలో తనిఖీలను నిర్వహించారు. నాన్ దోస్త్ కాలేజీలను ప్రస్తుతం తనిఖీలు చేయలేదని.. త్వరలోనే వాటి తనిఖీలను పూర్తి చేయనున్నట్టు అధికారులు తెలిపారు. రానున్న 2026–27 విద్యా సంవత్సరానికి ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 330 ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపుఇచ్చినట్టు అధికారులు తెలిపారు. కాలేజీల తనిఖీల్లో భాగంగా కాలేజీల్లో ఉన్న సౌకర్యాలు, బోధన సిబ్బంది కొరత కారణంగా కొన్ని కాలేజీలకు కొన్ని సెక్షన్లను తగ్గించగా.. కొన్ని కాలేజీలకు కోర్సులను తగ్గించినట్టు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది డిగ్రీ సీట్లలో 10వేల సీట్లు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## సమాజంలో అసమానతలను నిర్మూలించడంలో విద్య కీలకపాత్ర: టిపిటిఎఫ్

**హైదరాబాద్(చిక్కడపల్లి) ఏప్రిల్30 (ప్రభాతవార్త)**
సమాజంలో నెలకొన్న అసమానతలను నిర్మూలించడంలో విద్య కీలక పాత్ర పోషించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీటీఎఫ్) డిమాండ్ చేసింది. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "కామన్ స్కూల్ విద్యా విధానం శాస్త్రీయ విద్య అమలు" అనే అంశంపై టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎఫ్ ఆర్‌టి అధ్యక్షవర్గసభ్యులు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పాలకులు రాజకీయ ఎజెండా కోసం పాఠ్యపుస్తకాల్లో మత విద్వేషాలను చొప్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంక్షోభంలో ఉందని, దానిని కాపాడుకోవడానికి ప్రగతిశీల సంఘాలు ముందుకు రావాలన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర విద్యా కమిషన్ ఇచ్చిన నివేదికలో సామాజిక, మానవీయ కోణాలు లోపించాయని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ కామన్ స్కూల్ వ్యవస్థ కోసం ప్రజలందరూ ఏకమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు నర్సింహా రెడ్డి,ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు పి.నాగిరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం ప్రకాష్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.తిరుపతి రెడ్డి, ఎం.రవీందర్, పి.నారాయణమ్మ, డి.శ్రీనివాస్, లక్ష్మయ్యయాదవ్, యం.కృష్ణారెడ్డి, రావుల రమేష్, ఏ భుజంగరావు, డి.రాజయ్య, బి. రాజు, యస్.విజయ్, భోగ రమేష్, టీపీటీఎఫ్ సభ్యులు, పాల్గొన్నారు

# రైతులకు భారీ ఊరట

## వానాకాలం సాగుకు పెరగని పత్తి విత్తనాల ధరలు

**గతేడాది ధరలకే విక్రయించాలని ఆదేశాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
వానాకాలం పత్తి సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీపికబురు అందించాయి. పెరుగుతున్న పెట్టుబడి వ్యయం నేపథ్యంలో ఈ ఏడాది పత్తి విత్తనాల ధరలను పెంచకూడదని నిర్ణయించాయి.2026–27 వానాకాలం పత్తి సాగుకు సంబంధించి పాత ధరలనే కొనసాగిస్తూ కేంద్ర వ్యవసాయశాఖ ఉత్తర్వులు జారి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఏటా 50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. రాష్ట్రంలో వరి తర్వాత అత్యధికంగా సాగయ్యేది పత్తిపంటే. ఎకరాకు దాదాపు 25 వేల నుంచి రూ.35వేల వరకు పత్తి సాగుకు పెట్టుబడి అవుతోంది. ఈ వానాకాలానికి ఎకరానికి సగటున రెండు ప్యాకెట్ల చొప్పున లక్షల సంఖ్యలో పత్తి విత్తన ప్యాకెట్లు తెలంగాణకు అవసరం కానున్నాయి. ప్రస్తుతం బిజి–2(475) గ్రాముల పత్తి విత్తనధర రూ.901 గా ఉండగా బిజి -1 (475 గ్రాములు) ప్యాకెట్ ధర రూ.635గా ఉంది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో పత్తి రైతులకు కీలకమైన బిటి పత్తి విత్తనాల గరిష్ట విక్రయ ధరలను కేంద్ర వ్యవసాయశాఖ ఖరారు చేసింది. 2026–27 సీజన్‌కు సంబంధించి బిజి–1, బిజి–2 రకాల ధరలపై ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ వానాకాలానికి పాత ధరలనే కొనసాగించాలని నిర్ణయించిన నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగిన నేపథ్యంలో, పెట్టుబడి వ్యయం ఏటికేడు పెరుగుతున్నందున పత్తి కనీస మద్దతు ధరను కూడా పెంచాలని కోరుతున్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరలను పెంచని నేపథ్యంలో విత్తన కంపెనీలు, డీలర్లు పాత ధరల కంటే తక్కువ ధరకే విక్రయించాల్సి ఉంటుంది. కానీ ఒక్క రూపాయి ఎక్కువగా వసూలు చేయకూడదు. కాగా అటు దేశంలో, ఇటు తెలంగాణ రాష్ట్రంలో మొత్తం సాగు విస్తీర్ణంలో పత్తి పంటదే కీలకమైన స్థానం. అయితే బిజి పత్తిలోనూ ప్రొటీన్‌ను తట్టుకునే సామర్థ్యాన్ని గులాబి రంగు పురుగు పెంచుకోవడం ఇప్పుడు శాస్త్రవేత్తలను , రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

# స్కూల్ గ్రాంట్స్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

**ఎఐఎఫ్‌టివో జాతీయ సమావేశాల్లో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30**
స్కూల్ గ్రాంట్స్ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఒకేరకమైన విద్యావిధానం, బోధనా పద్ధతులు, నియామక ప్రక్రియ, ఉద్యోగ విరమణ వయస్సు తదితర సర్వీసు అంశాలు ఉండేవిధంగా కేంద్ర ప్రభుత్వం స్కూల్ గ్రాంట్స్ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్‌టివో) కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం జాతీయ స్వర్ణోత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో జైపూర్‌లో జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 30 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ .. దేశవ్యాప్తంగా విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపట్ల గత 50 సంవత్సరాలుగా ఏఐఎఫ్‌టివో ముందుండి పోరాడుతుందని, రాబోయే రోజుల్లో ఈ సమాఖ్యను పటిష్టం చేస్తూ ఒకే వేదికపై అన్ని రాష్ట్రాల ఉపాధ్యాయ సంఘాలు వచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ నిబంధన తొలగింపుకై కేంద్ర ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాలన్నారు.

హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల మాదిరిగా అన్ని రాష్ట్రాలలో సీపీఎస్ విధానం రద్దు పరచి పాత పెన్షన్ పునరుద్ధరించే విధంగా జాతీయ ఉద్యమాలు నిర్మించాలని అభిప్రాయ పడ్డారు.

ఈ సమావేశాలలో సంఘం సెక్రటరీ జనరల్ సి.యల్. రోజ్, ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆనంద్ సింగ్, తెలంగాణ రాష్ట్రం నుండి పిఆర్‌టీయు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, ఏఐఎఫ్‌టివో కార్యదర్శి చిత్తలూరి ప్రసాద్ పాల్గొన్నారు.

**ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన**

# లా విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30**
ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన లా విద్యార్థులకు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో గురువారం ఛైర్మన్ ఇంటర్న్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టరెడ్డి మాట్లాడుతూ.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన తప్పనిసరి ఇంటర్న్‌షిప్ ప్రాముఖ్యతను వివరించారు. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులు వాస్తవ జీవిత సమస్యలపై అనుభవాన్ని పొందగలరని పేర్కొన్నారు. ప్లేస్‌మెంట్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఇంటర్న్‌షిప్ అవసరాన్ని అవగాహన చేసుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్న్‌లకు నిర్వహించిన వివిధ ఇంటరాక్టివ్ సెషన్లలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, భారతరాజ్యాంగం, గ్లోబల్ రాజకీయ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ న్యాయంపై ప్రభావం, మేధో సంపత్తి హక్కుల ప్రాధాన్యం, భారత విదేశాంగ విధానం, దేశీయ,అంతర్జాతీయ చట్టాల సంబంధం, గ్లోబలైజేషన్ నేపథ్యంలో ట్రాన్స్‌నేషనల్ గవర్నెన్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉస్మానియా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆంధ్ర మహిళా సభ మహిళా న్యాయ కళాశాల, ఇస్లామియా కళాశాలల విద్యార్థులు 21 రోజుల తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌ను ఉన్నత విద్యా మండలిలో విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఈ కాలంలో వారు వివిధ సెషన్లకు హాజరుకావడంతోపాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వివాద పరిష్కారం, ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వం, సమన్వయం, లా అండ్ టెక్నాలజీ, న్యాయ విద్యలో మారుతున్న ధోరణులు, 21వ శతాబ్దంలో చట్టపరమైన నిబంధనలు వంటి అంశాలపై ప్రెజెంటేషన్లుచేసి అసైన్‌మెంట్‌లు సమర్పించారని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇంటర్న్‌లు తమ అనుభవాలను ప్రొఫెసర్ బాలకిస్టారెడ్డితో పంచుకొని, తమకు ఈ అవకాశాన్ని కల్పించిన ఉన్నత విద్యా మండలికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ప్రొఫెసర్ రాజేశ్వర్ మిట్టపల్లి, ఆర్.రాధాకృష్ణన్, ఆంధ్ర మహిళా సభ న్యాయవిభాగానికి చెందిన అమృత అశోక్, ఇస్లామియా కళాశాల న్యాయ విభాగ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆజమ్ ఖాన్ పాల్గొన్నారు.

# చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధి

**స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క**




మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**
చిన్నారి చిరునవ్వే సమాజ, రాష్ట్ర, దేశ నిజమైన అభివృద్ధి అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో అడాప్షన్ హెల్పింగ్ డెస్క్, ఫోస్టర్ కేర్ సెంటర్‌ను, శిశువులకు పాలిచ్చే గదిని (బ్రెస్ట్ ఫీడింగ్ కియోస్క్)ను మంత్రి సీతక్క ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సమాజంలో కుటుంబం, ప్రేమ లేకుండా పెరుగుతున్న పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అడాప్షన్ హెల్ప్ డెస్క్ లక్ష్యమని స్పష్టం చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా దత్తతపై సరైన సమాచారం, చట్టబద్ధమైన మార్గదర్శనం, కౌన్సిలింగ్ అందిస్తామని వివరించారు. అనధికారిక దత్తతల పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతి పిల్లవాడికి శాశ్వత కుటుంబం అందించలేకపోయినా, తాత్కాలికంగా ప్రేమతో కూడిన వాతావరణం కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లుల గౌరవాన్ని కాపాడటంలో భాగంగా కాచిగూడ బస్టాండ్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ కియోస్క్‌లను ఏర్పాటు చేయడం కీలక నిర్ణయమని మంత్రి తెలిపారు. జనసమర్ధ ప్రదేశాల్లో తల్లులు గౌరవంతో, భద్రతతో తమ శిశువులకు పాలిచ్చే అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ప్రతి ప్రాంతాల్లో బెస్ట్ ఫీడింగ్ కియోస్క్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టడం మొదటిసారి అని పేర్కొన్నారు. పిల్లల మానసిక ఆరోగ్యంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి సీతక్క తెలిపారు. రోష్నీ సెంటర్‌తో భాగస్వామ్యంతో పిల్లలకు కౌన్సిలింగ్, థెరపీ సేవలు అందిస్తూ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలన్నీ ప్రభుత్వం చేపట్టిన "99 రోజుల ప్రణాళిక"లో భాగమని, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే లక్ష్యమని ఆమె స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ సేవాదళ్...

క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ సేవాదళ్ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కాంగ్రెస్‌ది అహింస సిద్ధాంతమని, ఆ సిద్ధాంతాన్ని కాంగ్రెస్ సేవాదళ్ కూడా అనుసరిస్తుందన్నారు. ఎప్పటికప్పుడు కాంగ్రెస్ సేవాదళ్ పార్టీ సిద్ధాంతాల మీద శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ సేవాదళ్ అంటే దేశభక్తుల సంఘమని, జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు సేవాదళ్ నిర్వహించాలన్నారు. ఈమేరకు ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సేవాదళ్ శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సేవాదళ్ కాంగ్రెస్ సిద్ధాంతాలకు శ్రీరామ రక్ష అని, సిద్ధాంత బలం ఉంటే ఎన్ని కష్టాలు అయినా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. సేవాదళ్ శిక్షణ కార్యక్రమాలను జిల్లాలకు విస్తరిస్తే కాంగ్రెస్ సైన్యం మరింత బలపడుతుందన్నారు.

## ఉస్మానియాలో చిన్నారికి

# అరుదైన లివర్ మార్పిడి చికిత్స

### గ్లైకోజెన్ స్టోరేజ్ టైప్-3తో బాధపడుతున్న బాలుడికి ఆపరేషన్ సక్సెస్

### ప్రొ. మధుసూదన్ నేతృత్వంలో 14 గంటల శస్త్రచికిత్స



చికిత్స పొందిన చిన్నారి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఉన్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు అరుదైన ఆపరేషన్ నిర్వహించి రికార్డ్ సృష్టించారు. బాలుడికి కాలేయ మార్పిడి ఆపరేషన్ నిర్వహించి సక్సెస్ అయ్యారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఈ ఆపరేషన్ జరిగింది. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు అరుదైన గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్ (జీఎస్‌డి) టైప్-3తో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి విజయవంతంగా కాలేయ మార్పిడి నిర్వహిం చారు. ఈ శస్త్రచికిత్స ఈనెల 28వ తేదీన సర్జిక ల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో జరిగింది. జీఎస్‌డి టైప్-3 (కోరి/ఫోర్బ్స్ వ్యాధి) అనేది ఒక వంశపారంపర్య జీవక్రియ వ్యాధి. శరీరంలో గ్లైకోజెన్‌ను గ్లూకోజ్‌గా మార్చే ఎంజైమ్ లోపం వల్ల కాలేయం, కండరాలలో గ్లైకోజెన్ పేరుకు పోతుంది. దీని వల్ల హైపోగ్లైసీమియా, కాలేయం వాపు, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. రాజేంద్రనగర్, ఉడంగడ్డ ప్రాంతానికి చెందిన ఎండి ఇర్ఫాన్, సాజియా దంపతుల కుమారుడు 10 కిలోల బరువున్న మాస్టర్ ఎండి అఫాన్(18 నెలలు) అనే బాలుడు అధిక ఆకలి, కడుపు ఉబ్బరం, ఉదయం నీరసం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చాడు. పరీక్షల్లో తక్కువ రక్త చక్కెర స్థాయిలు, అధిక ట్రైగ్లిజరైడ్స్, పెరిగిన కొలెస్ట్రాల్, కాలేయం విస్తరణ గుర్తించారు. బయాప్సీ, జన్యు పరీక్షల ద్వారా జీఎస్‌డి టైప్-3 నిర్ధారణ అయ్యింది. చికిత్సలో భాగంగా బాలుడి తండ్రి ఎండి ఇర్ఫాన్ నుండి కొంత భాగాన్ని సుమారు 240 గ్రాముల ఆరోగ్యకరమైన కాలేయ కణజాలాన్ని తీసుకుని మార్పిడి చేశారు. సుమారు 14 గంటలపాటు సాగిన ఈ శస్త్రచికిత్సకు ప్రొఫెసర్ మధుసూదన్ నేతృత్వం వహించారు. శస్త్రచికిత్స తర్వాత చిన్నారి ఆరోగ్యం స్థిరంగా ఉండి, మళ్లీ హైపోగ్లైసీమియా సమస్యలు కనిపించలేదని వైద్యులు తెలిపారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు డాక్టర్ మధుసూదన్ తెలిపారు. ఈ చికిత్స సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.50 నుంచి 60 లక్షలు ఖర్చవుతుండగా ఆరోగ్య శ్రీ కింద పూర్తిగా ఉచితంగా నిర్వహిం చడం విశేషం. అలాగే మార్పిడి తర్వాత అవసరమైన ఇమ్యునోసప్రెసెంట్ మందులు కూడా ప్రభుత్వమే అందిస్తోంది. భారతదేశ ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీఎస్‌డి టైప్-3కి కాలేయ మార్పిడి నిర్వహించిన అరుదైన,మొట్టమొదటి కేసుగా ఇది రికార్డ్ సృష్టించింది. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, డిఎంఇ తదితర వైద్యబృందాన్ని అభినందించారు. బాలుడికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేసిన బృందంలో డాక్టర్ మధుసూదన్, వాసిఫ్ ఆలీ, సుదర్శన్‌రెడ్డి, అభిమన్యు, రఘు, మాధవి, సునిల్, రమేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిరక్ష్యాన్ని ఉపేక్షించం

**హైదరాబాద్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎట్టి పరిస్థితుల్లోను నిర్దేశించిన లక్ష్యాల మేరకు ముందుకు సాగాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. గురువారం హిమాయత్ నగర్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల పనుల సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, లక్ష్మణకుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపిలు, ఎంఎల్యేలు, ఎంఎల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్లు, హౌసింగ్ కార్పోరేషన్ ఎండి వి.పి గౌతమ్, కలెక్టర్లు, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. అటవీ భూములకు సంబంధించిన అంశాలను ఆ శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఫారెస్ట్ క్లియరెన్సుల కారణంగా ఇళ్ల నిర్మాణం కుంటుపడటానికి వీలు లేదని పేర్కొన్నారు. కలెక్టర్లు తమ విచక్షణాధికారాలను ఉపయోగించి ఫారెస్టు భూముల పరిహారం లాంటి అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. క్షేత్ర స్థాయిలో కూడా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని చెప్పారు. కలెక్టర్లు నిబంధనల పేరుతో జాప్యం చేయకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఉపేక్షి ంచేది

## దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ

### సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాత్రికేయ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2,800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాబడి, వ్యయ నిబద్ధతలపై ప్రత్యక్ష ప్రభావం

### పశ్చిమాసియా సంఘర్షణ ఎఫెక్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** ఆసియా సంఘర్షణ దేశ ఆర్థిక కార్యకలాపాలపై ఒత్తిడిని పెంచడం ప్రారంభించినందున, ఇది 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాబడి వసూళ్ళు, వ్యయ నిబద్ధతలు రెండింటిపై ప్రత్యక్ష ప్రభావాలను చూపుతుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం నిర్వహించిన ఏప్రిల్ నెలవారీ ఆర్థిక సమీక్షలో ఆందోళన వ్యక్తం చేసింది. బలమైన దేశీయ డిమాండ్, విధానపరమైన వెసులుబాట్లు, ప్రభుత్వ పెట్టుబడుల కారణంగా పశ్చిమ ఆసియా సంఘర్షణ నుంచి దేశం సాపేక్షంగా దూరంగా ఉందని పేర్కొంది. ఇదే సమయంలో ఇంధన సరఫరా అంతరాయాలు, ప్రపంచ అనిశ్చితులపై ఆధారపడిన ప్రమాదాలతో పాటు ద్రవ్యోల్బణం, ఆర్థికపరమైన ఒత్తిళ్లు, విస్తృత వాణిజ్య లోటుల గురించి కూడా హెచ్చరించింది.

పశ్చిమ ఆసియా సంఘర్షణ సరఫరాకు గణనీయమైన ఆటంకం కలిగిస్తున్నప్పటికీ, దేశీయ డిమాండ్, విధానపరమైన వెసులు బాట్లు, పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ, నిరంతర ప్రభుత్వ పెట్టుబడులు కొంత రక్షణ కల్పిస్తున్నాయని వెల్లడించింది. భవిష్యత్తులో పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, సరఫరా లోని పరిమితుల వల్ల తలెత్తే ఒత్తిళ్ల కారణంగా డిమాండ్ పరిస్థితులు, ఆర్థిక కార్యకలాపాలు ప్రభావితమవుతాయని తెలిపింది. అయితే, మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణతో శాంతి పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున, 2026 ద్వితీయార్థంలో పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

# ధాన్యం, భరోసా సొమ్ము ఫ్రీజ్

### హోల్డ్‌లో పెడుతున్న బ్యాంకులు

### పాత బకాయిలు, ష్యూరిటీ లోన్లకు జమ

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** ధాన్యం అమ్మకం నిమిత్తం వచ్చిన సొమ్ము, అలాగే రైతు భరోసాగా వచ్చిన మొత్తాలను సంబంధిత రైతులకు ఇవ్వకుండా బ్యాంకులు మోకాలడ్డుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం అమ్మకం సొమ్ములు, రైతు భరోసా నిధులను బ్యాంకులు ఇతర అప్పులకు జమ చేసుకోకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయినా, నిబంధనలను ఉల్లంఘించి కొన్ని బ్యాంకులు ఫ్రీజ్ చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత రుణం చెల్లించలేదని, ష్యూరిటీ రుణ బకాయిలు ఉండటం తదితర కారణాలతో కొన్ని బ్యాంకులు రైతుల ఖాతాల్లో పడిన సొమ్మును హోల్డ్‌లో పెడుతున్నాయి. ఫలితంగా రైతులు డబ్బులు డ్రా చేసుకోలేని పరిస్థితి దాపురించింది. బాధితులు డబ్బుల కోసం బ్యాంకులకు క్యూ కడుతూ.. తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. తెలంగాణలో రైతు భరోసా, రైతుబంధు డబ్బులు జమ అయినప్పటికీ, కొన్ని బ్యాంకులు ఆ నిధులను 'ఫ్రీజ్ (స్తంభింపజేయడం) చేస్తున్నాయి.. పాత పంట రుణాలు, అప్పుల వడ్డీల కోసం బ్యాంకర్లు ఈ చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి, నల్గొండ, సంగారెడ్డి తదితర జిల్లాల్లో బ్యాంకుల్లోని తమ ఖాతాల్లోని సొమ్మును రైతులు డ్రా చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ కార్డు, ఇంటికి ఒకరు తదితర కారణాలతో మాఫీని రుణమాఫీనిలిపేసింది. ప్రభుత్వం విడుదల చేసిన అర్హుల జాబితాలో పేర్లున్నా కూడా మాఫీ కాలేదు. రూ.రెండు లక్షలలోపు ఉన్న వారికి మాత్రమే మాఫీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే పై డబ్బును రైతులు చెల్లిసేస్తే రూ.రెండు లక్షలు మాఫీ చేస్తామంది. దీంతో వాటిని చెల్లించకపోవడంతో వాయిదా మీరిపోయి ఉన్నాయి. అలాగే గత ఎన్నికలకు ముందు పంట రుణం తీసుకున్న తోటి రైతులకు ష్యూరిటీ సంతకం పెట్టినందుకు వివిధ జిల్లాల్లోని పలువురు రైతులకు కొన్ని బ్యాంకులు రైతుబంధు, పింఛను డబ్బులను ఫ్రీజ్ చేయించాయి. అలాగే ఇదే జిల్లాల్లోని కొన్ని బ్యాంకులో గత ఎన్నికల ముందు పంట రుణం తీసుకోగా మాఫీ కాలేదు. ఇటీవల ధాన్యం విక్రయించిన డబ్బు ఖాతాలో జమ కాగా, రుణం చెల్లించనందున ఆ ఖాతాను బ్యాంకు సిబ్బంది ఫ్రీజ్ చేశారు. ఈ విధంగా బ్యాంకులు వివిధ ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

## ఇక విద్యుత్ మీటర్ల ఆటోమేటిక్ రీడింగ్

### దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో అమలు

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపంపిణీ సంస్థ పరిధిలోని హై టెన్షన్ (హెచ్.టి) విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి ఇక నుండి ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ అమలు కానుంది. ఇందువల్ల వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని సంస్థ అధికారులు భావిస్తున్నారు. సంస్థకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న హెచ్.టి. సర్వీసులన్నింటికీ ఆటోమేటిక్ మీటర్ రీడింగ్ (ఏఎంఆర్) విధానాన్ని విజయవంతంగా అమలులోకి తెచ్చింది. డిస్కామ్ పరిధిలోని హెచ్.టి. సర్వీసులన్నింటినీ నేరుగా కార్పొరేట్ కార్యాలయంలోని హెచ్.టి. బిల్లింగ్ సర్వర్తో అనుసంధానించారు. దీనివల్ల క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే డేటా సేకరించడం సాధ్యమవుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

## భగీరథ లీకేజీ గుంతలో పడి చిన్నారి మృతి

**బచ్చన్నపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి మిషన్‌భగీరథ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి బలైపోయింది. పైపులకోసం తీసిన గుంత రోజుల తరబడి పూడ్చకపోవడంతో ఆ చిన్నారి పాలిట శాపంగామారింది. ఈ విషాద సంఘటన గురువారం మండలంలోని ఆలీంపూర్ గ్రామంలో చోటుచేసు కుంది. గ్రామానికి చెందిన ఎలికట్టె శ్రీనివాస్ - కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు దక్షిత(5), మోక్షిత (4) పెద్ద కుమార్తె ఒకటో తరగతి చదువుతుండగా, చిన్న కుమార్తె గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి వెళ్తుంది. కవిత ఇద్దరు కుమార్తెలను పాఠశాల గేటుపక్కన నిలబెట్టి అంగన్వాడీ కేంద్రంకు పోయింది. గేటు ప్రక్కనే మిషన్‌భగీరథ పైపులైన్ కోసం తీసిన గుంతలో మోక్షిత పడిపోయింది. వెంటనే పెద్ద కుమార్తె దక్షిత తన తల్లివద్దకు వెల్లి విషయం చెప్పడంతో ఆమె పరుగెత్తుకుని వచ్చి గుంతలో దూకి చిన్నారిని భయటకు తీసింది. అప్పటికే మోక్షిత పరిస్థితి విషమించింది.

## 10.2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తి

### వేగంగా కొనుగోళ్ల ప్రక్రియ- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందని పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. రబి సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 10.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేసి, లక్ష మంది రైతుల ఖాతాల్లో రూ. 500.20 కోట్లను విడుదల చేసినట్లు పేర్కొంది. భారీగా వస్తున్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మొత్తం 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించింది. వీటిలో 4,350 ప్యాక్స్ కేంద్రాలు, 3,563 ఐకెపి, ఇతర సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపింది. రైతుల నుంచి ఇప్పటివరకు 4.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం, 5.50 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యాన్ని సేకరించినట్లు పౌరసరఫరాలశాఖ వివరించింది.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా విద్యుత్‌సరఫరా

### డిప్యూటీ సీఎం విక్రమార్క

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వేసవి తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో హైదరాబాద్‌లో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో గృహ, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందదన్నారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.

# ఎపి టెన్త్ ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ అల్ టైమ్ రికార్డ్

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధంచిన్ ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ స్టేట్ టాప్ మార్క్ 599 మార్కులతో అల్ టైమ్ రికార్డ్ సృష్ంచింది అని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 599 మార్కులు ఒకే ఒక్క విద్యార్థికి వచ్చాయి అని ప్రకటించగా ఆ ఒక్క విద్యార్శి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి కావడం మాకెంతో గర్వంగా ఉంది అని ఆమె తెలిపారు.

అలాగే క్రంది విభాగాలో అత్యుత్తమ మార్కులు సాధంచిన శ్రీ చైతన్య విద్యార్థుల సంఖ్యను కూడా ఆమె ప్రకటించారు. 598 ఆ పైన మార్కులు సాధంచిన విద్యార్థులు 18 మంది.597 ఆ పైన మార్కులు సాధంచిన విద్యార్థులు 64 మంది,596 ఆ పైన మార్కులు సాధంచిన విద్యార్థులు 139 మంది,595 ఆ పైన మార్కులు సాధంచిన విద్యార్థులు 258 మంది, 590 ఆ పైన మార్కులు సాధంచిన విద్యార్థులు 1,245 మంది, 580 ఆ పైన మార్కులు సాధంచిన్ విద్యార్థులు 4,352 మంది అని పేర్కొన్నారు. గరిష్ఠంగా 600 మార్కుల్లో, శ్రీ చైతన్య స్కూల్ సుమారు సగటు మార్కులు 521 సాధంచిందని, మొత్తం ఉత్తీర్ణత శాతం సుమారు 99శాతంగా నమోదైందని ఆమె తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన సుమారు 100 బ్రాంచులు, 100శాతం ఉత్తీర్ణతను సాధంచామని పేర్కొన్నారు. అలాగే సబ్జెకుల వారీగా 100/100 మార్కులు సాధంచిన వారి సంఖ్య ఫస్ లాంగ్వేజ్ 5997, సెకండ్ లాంగేవజ్ - 608, ఇంగ్లిష్-14, మాథ్స్ - 4470, సైన్స్ - 1247, సోషల్ 2367, వివిధ సబ్జెకులలో 14,703 మంది 100/100 మార్కులు సాధంచడం జరిగందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 28 జిలాలో 21 జిలాలో (75శాతం) శ్రీ చైతన్య స్కూల్ మాత్రమే టాప్ మార్క్ సాధంచింది. అదే విధంగా 64శాతం మండలాలో, 77శాతం టౌన్,/సిటీ లలో శ్రీ చైతన్య స్కూల్ దే టాప్ మార్క్ అని ఆమె తెలిపారు.

ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్ ఫలితాలలో కూడా, ఆల్ ఇండియా ఓపెన్స్ కేటగరీలో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు 100 లోపు 12 ర్యాంకులు, 1000 లోపు 77 ర్యాంకులు సాధంచారని తెలిపారు. అలాగే 29వ తేదీన విడుదలైన తెలంగాణ పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కూడా శ్రీ చైతన్య స్కూల్ స్టేట్ ఫస్ట్ మార్క్ 597 సాధంచడంతో పాటు, 580 ఆ పైన సాచించిన విద్యార్థులు 829 మంది అని, సుమారు సగటు మార్కులు 532, మొత్త ఉత్తీర్ణత శాతం 99.7శాతం అని ఆమె తెలిపారు. ఇటీవల విడుదలైన సిబిఎస్ఈ, 10వ తరగతి ఫలితాలో, శ్రీ చైతన్య స్కూల్కు చందిన ఇద్దరు విద్యార్థులు 499/500 మార్కులు సాధించారని, మెజారిటీ రాష్ట్రాల్లో టాప్ మార్కులతో పాటు, ఓవరాల్‌గా 100శాతం పాస్ సాధించామని ఆమె తెలిపారు.





## గ్రేడ్ ఎ పరిధి వరి విత్తనాలను అందుబాటులో ఉంచాలి

### మంత్రి తుమ్మల ఆదేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** ఎఫ్‌సిఐ గ్రేడ్ ఏ పరిధిలోకి వచ్చే రకాల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. వానాకాలం సాగుకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగును ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దాంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశముందన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో సాగవుతున్న వరి రకాలపై గురువారం రైస్ మిల్లర్ల రాష్ట్ర సంఘం ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమయ్యారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలపై సమగ్రంగా ఆరా తీశారు. మిల్లర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రభుత్వం అందరి దృష్టి రైతు సంక్షేమంపై కేంద్రీకృతం కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం సేకరిస్తున్న వడ్లతోపాటు మార్కెట్‌లో ప్రైవేట్ సేకరణకు, ఎగుమతులకు అనువైన రకాల సాగును ప్రోత్సహిస్తున్నందుకు వ్యవసాయశాఖకు, మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంటియు 1010, కెఎన్‌ఎం118, ఐఆర్ 64 వంటి రకాలుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నప్పటికీ, ఎగుమతులు మాత్రం ఇంకా పొడవైన గింజలున్న రకాలు పండించే పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచే అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అలాంటి రకాల అభివృద్ధిపై యూనివర్సిటీ శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కోరారు. రాష్ట్రంలో సన్న రకాలుగా పరిగణించే కొన్ని వరి రకాలు ఎఫ్‌సిఐ గ్రేడ్ ఎలోకి రావడం లేదని, ఈ అంశాన్ని కూడా పరిశీలించాలనిమంత్రి తుమ్మలను మిల్లర్లు అభ్యర్థించారు. అదే సమయంలో ప్రస్తుత వానాకాలానికి ఎంపిక చేసిన 8 రకాలలో 2 రకాలు మిల్లింగ్‌కు అనుకూలంగా లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో అందరి అభిప్రాయాలను సమగ్రంగా పరిశీలించి వరి సన్న రకాల ఎంపికను శాస్త్రీయంగా చేయాలని సంబంధిత అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

## ఎల్లా మృదంగం విన్యాసం అద్భుతం

### ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

**రవీంద్రభారతి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** 83 ఏళ్లలో వయస్సులో కూడా చెక్కుచెదరని సంగీత పటిమ మృదంగం విన్యాసంతో సభికులను కట్టివేసిన సుప్రసిద్ధ మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ డా. ఎల్లా వెంకటేశ్వరరావు మృదంగవాద్యం అత్యంత అద్భుతమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రశంసించారు. ప్రపంచ సంగీతలోకంలో తనకంటూ ఒక ప్రత్యేకతను నిలబెట్టకోవడం ఇటు భారతదేశానికి తెలుగుబిడ్డ అయినందుకు అటు యావత్ తెలుగుజాతికి అదృష్టం, గర్వకారణమని ఆయన అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ సోమశేఖర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కల్చరల్ సొసైటీ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమందిరంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భట్టివిక్రమార్క విశిష్ట అతిథులు ఆచార్య అలేఖ్య పుంజాల, డా. ఏనుగు నరసింహారెడ్డి, మద్దాళి రఘురామ్, నేమాని పార్థసారధి తదితరులతో కలిసి డా. ఎల్లా వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రసంగించారు. సభకుముందు మృదంగం లయమాధురితో ఎల్లా వెంకటేశ్వరరారావు మృదంగ విన్యాసం ఆహుతులను మైమరపించి సంగీతలోకంలో విహరింపజేసింది.



ఎల్లా వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న భట్టివిక్రమార్క

## ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు పదవీ విరమణ

**హైదరాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గొట్టె సుధీర్ బాబు గురువారం పదవీ విరమణ చేశారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన సుధీర్ బాబు 1991లో పోలీసు శాఖలో డిఎస్‌పిగా చేరి అంచలంచలుగా పదోన్నతులు అందుకుంటూ 2001లో ఐపిఎస్ హోదాకి ఎదిగారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డిసిపిగా, సిటీ ట్రాఫిక్, శంషాబాద్, పశ్చిమ మండల డిసిపిగా మహబూబ్‌నగర్ ఎస్‌పిగా ఆయ న పనిచేశారు. అనంతరం డిఐజిగా పదోన్నతిపై వరంగల్ పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం ఐజిగా నగర ట్రాఫిక్ పోలీసు అదనపు కమిషనర్‌గా మల్టీ జోన్ ఐజపిగా, పూర్వపు రాచకొండ పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. రాచకొండ పోలీసు కమిషనర్‌గా వున్న సమయంలోనే ఆయనకు అదనపు డిజి హోదా దక్కింది. ఉమ్మడి ఎపిలో గ్రూప్ వన్ అధికారి ఈ ర్యాంకు సాధించిన రెండవ అధికారిగా తెలంగాణ నుంచి మొదటి అధికారిగా సుధీర్ బాబు ఘనత అందుకున్నారు. 35 ఏళ్ల సుధీర్ఘ సర్వీసులో ఆయనకు అనేక రివార్డులు, అవార్డులు వరించాయి. బు ధవారం నాడు ఆయనకు ఇబ్రహీంపట్నం మూడవ స్పెషల్ పోలీసు బెటాలియన్‌లో గౌరవ వందనం లభించింది. కాగా సుధీర్ బాబు పదవీ విరమణతో ఫ్యూచర్ సిటీ ఇంచార్జి కమిషనర్‌గా జాయింట్ సిపి చందనా దీప్తి బాధ్యతలు చేబట్టారు. శుక్రవారం ఉదయం నూతన కమిషనర్‌గా డాక్టర్ తరుణ్ జోషి బాధ్యతలు చేబడతారు.

## నేడు ఆర్‌టీసీ సంఘాలతో సిఎంసమావేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30:** శుక్రవారం ఆర్‌టీసీ కార్మిక సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రపంచ కార్మికులకు, శ్రమైక జీవులకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని అన్ని వర్గాల కార్మికులకు, ఆర్టీసీ కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్మిక దినోత్సవం ప్రజా పాలన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు సంతోషాన్ని అందించిందనీ, ఆర్టీసీ కార్మికుల చిరకాల స్వప్నం ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో సహచర కేబినెట్ మంత్రుల సహకారంతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందనీ కొనియాడారు.

## పెండింగ్‌లోని రాష్ట్ర విభజన హామీలను నేరవేర్చాలి

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30:** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న రాష్ట్రానికి రావడం శుభపరిణామని, అయితే కేవలం వచ్చి వెళ్లడం కాకుండా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో రాష్ట్ర విభజన హామీలను నేరవేర్చి వెళ్లాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్ధూంభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేన శంకర్, వి.ఎస్.బోస్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో సాధారణ అభివృద్ధి పనులు కాకుండా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని, లేకపోతే ప్రధానికి తెలంగాణ పట్ల, ఇక్కడి ప్రజల పట్ల ద్వేషం ఉందన్న అనుమానం నిజం అవుతుందన్నారు.

## నేటి నుంచి సనత్‌నగర్ టిమ్స్‌లో ట్రయల్ రన్

### మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 30:** ఈనెల 1నుంచి నుంచి సనత్‌నగర్ టిమ్స్‌లో ట్రయల్ రన్‌ను నిర్వహించనున్నారు. నెల రోజుల పాటు 22 విభాగాల్లో ఓపీ సేవలను కొనసాగించాలని అధికారులకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. సనత్‌నగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు.. నేటి నుంచి హాస్పిటల్‌లో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సుమారు నెల రోజుల పాటు ట్రయల్ రన్ కొనసాగనుంది. ట్రయల్ రన్‌లో భాగంగా రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అవుట్ పేషెంట్, దయాగ్నసిస్ సేవలు అందించనున్నారు.

## ఓటరు జాబితా సవరణలో 7.85 కోట్లు తొలగింపు!

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 30:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ సర్) దేశవ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నది. అక్రమ ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం (ఈసీ) సర్‌ను చేపట్టింది. తొలి దఫాలో బీహార్, రెండో దఫాలో భాగంగా మరో 12 రాష్ట్రాలు, యూటీల్లో సర్ ప్రక్రియ పూర్తైంది. ఈ రెండు దఫాల్లో 7.85 కోట్ల ఓటర్లను తొలగించినట్టు ఈసీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీకి రాజకీయంగా ఇబ్బందికరంగా కనిపించే ప్రాంతాల్లోనే ఓట్ల తొలగింపు ఎక్కువగా జరుగుతున్నట్టు ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. 10 శాతం కంటే ఎక్కువగా బీహార్‌లో, ఇటీవల 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో (యూటీ) సర్ ప్రక్రియను పూర్తి చేశారు. బీహార్‌లో 65 లక్షల ఓటర్లను తొలగించగా.. రెండో దఫాలోని మిగతా రాష్ట్రాల్లో మరో 7.2 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. దీంతో సర్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ తొలగించిన ఓటర్ల సంఖ్య 7.85 కోట్లకు చేరింది.

# ఎండకి రంగు మారితే..



వేడి దంచేస్తోంది కదా! రోజూ కొద్దిసేపు అలా బయటికి వెళ్లొచ్చినా చాలు. చర్మం రంగు మారిపోతుంది. ట్యాన్ పట్టేసిందని తెగ తిట్టేసుకుంటాం. కానీ చర్మ కణాలను యూవి కిరణాల బారి నుంచి రక్షించే ప్రక్రియే ఇది. ఎంత మంచిదైనా చర్మం భిన్న రంగుల్లో కనిపిస్తోంటే ఏం బాగుంటుంది? ట్యాన్‌ని తేలిగ్గా పోగొట్టుకునే ఈ చిట్కాలను పాటిస్తే సరి. బంగాళదుంపను సన్నని చక్రాలుగా కోసి, సమస్య ఉన్నచోట రుద్దండి. దీనిలోని క్యాటకోలేజ్ అనే ఎంజైమ్ ట్యాన్‌ను తగ్గిస్తే.. యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. ఫైనాపిల్ ముక్కను తీసుకొని మెత్తని గుజ్జులా చేసుకోవాలి. దానికి చెంచా తేనె కలిపి, ట్యాన్ ఉన్న ప్రదేశంలో పూతలా వేయండి. ఇరవై నిమిషాలయ్యాక చల్లని నీటితో కడిగేస్తే చాలు. దీనిలోని ఎ,సి విటమిన్లు దెబ్బతిన్న చర్మకణాలను పునరుత్తేజం చేస్తాయి. బ్రోమెలైన్, యాంటీ ఆక్సిడెంట్లు చర్మం తిరిగి నిగారించేలా చేస్తాయి. స్ట్రాబెర్రీలో ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్లు ఉంటాయి. వీటిని తాజా క్రీమ్‌తో కలిపి, మెత్తగా మిక్సీ చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని సమస్య ఉన్నచోట రాసి, 20 నిమిషాలయ్యాక చల్లని నీటితో కడిగేస్తే చాలు రంగు మెరుగవడమే కాదు, చర్మానికి కావాల్సిన తేమా అందుతుంది. కలబందలోని విటమిన్ ఇ కూడా ట్యాన్‌ను దూరం చేసేదే. దీని గుజ్జును చర్మానికి పట్టించండి. ఎండ వేడి నుంచి తక్షణ ఉపశమనం కలుగుతుంది. ట్యానే కాదు, ఎండ కారణంగా ఏర్పడే ఎర్రదనం, అలర్జీలకూ ఇది మెరుగైన ఔషధం.

# బేబీ హెయిర్ ఉంటే !



పెళ్లిళ్లు, మెహందీ, సంగీత్ అంటూ వేడుకలు జరుగుతూనే ఉంటున్నాయి కదా! అందంగా కనిపించ దానికి రకరకాల హెయిర్ స్టైల్స్ వేస్తుంటాం. కానీ బేబీ హెయిర్ ఉంటే మాత్రం మాటిమాటికీ జుట్టు చెదిరి ఇబ్బంది పెడుతుంది. ఇది కనిపించకుండా అందంగా దాచేద్దామిలా.. నచ్చిన హెయిర్‌స్టైల్ వేసుకున్నాక పాత టూత్‌బ్రష్ లేదా మస్కారా బ్రష్ తీసుకుని చిన్నచిన్న వెంట్రుకలు కనిపించే చోట వీటిని ఉపయోగించి నెమ్మదిగా దువ్వితే అవి లోపలికి వెళ్లి పోతాయి. దువ్వే ముందు బ్రష్‌ని తడిపితే మీ పని ఇంకా తేలిక అవు తుంది. వాతావరణ కాలుష్యం, ఎండ వంటి వాటివల్ల జుట్టు పొడిగా మారి ఇబ్బంది పెడుతుంది. దీనికి తోడు తలస్నానం చేసిన వెంటనే హెయిర్ డ్రైయర్లు పెడుతుంటాం. వీటివల్ల కూడా జుట్టు పొడిగా అయ్యి బేబీ హెయిర్ ముందు కొస్తుంది. ఇలాకాకుండా ఉండాలంటే గాఢత తక్కువ ఉండే హెయిర్‌స్ప్రేలు, కొబ్బరినూనె, జిడ్డుతక్కువ నూనెలను ఎంపిక చేసుకోవాలి. హెయిర్ డ్రైయర్‌ను ఉపయోగిస్తే తక్కువ ఉష్ణోగ్రత వద్ద పెట్టి చేసుకోవాలి. ఈ జాగ్రత్తలన్నీ పాటించలేం మావల్ల కాదంటారా.. తలను పట్టి ఉండే హెయిర్ క్లిప్‌లు, బ్యాండ్లు, మిస్సీబన్, మిస్సీపోని వంటి కొత్తరకం హెయిర్‌స్టైల్స్‌ను ఎంచుకోండి. బేబీ హెయిర్ విసిగించదు.

# ఈ కాలంలో దుమ్ము బాధ పోవాలంటే..



ఈ వేసవిలో పొడి వాతావరణం వల్ల ఇంట్లో దుమ్ము చేరడం సహజం. రోజూ శుభ్రం చేసినప్పటికీ ఆయా వస్తువులపై, ఇంటి మూలల్లో కంటికి కనిపించని దుమ్ము కణాలు ఉండిపోతాయి. అలాగని ప్రతి వస్తువునూ తుడిచే సమయం, ఓపిక రోజూ ఉండకపోవచ్చు. అందుకే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే ఈ కాలంలో ఇంట్లో దుమ్ము బెడదను తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు అవేంటో తెలుసుకుందాం..

ఇంటిని శుభ్రం చేయడానికి చాలామంది చీపురును వాడుతుంటారు. అయితే దీనివల్ల మన కంటికి కనిపించని దుమ్ము కణాలు నేల పైనే ఉండిపోతాయి. అదే వ్యాక్యూమ్ క్లీనర్‌ని ఉపయోగిస్తే ఇంటి మాలమూలల నుంచి దుమ్మును తొలగించచ్చు. రోజూ పొడి వ్యాక్యూమ్ క్లీనర్స్‌తో శుభ్రం చేస్తూనే.. వారానికోసారి లేదా రెండుసార్లు తగి వ్యాక్యూమ్ క్లీనర్‌తో క్లీన్ చేస్తే ఫలితం ఉంటుంది. చెప్పులు, షూస్.. వంటివి బయటి నుంచి ఎక్కువ దుమ్మును మోసుకొస్తాయి. కాబట్టి వాటిని ఇంట్లో దాకా తీసుకురాకుండా.. బయటే వదిలేయాలి. అలాగే ముఖద్వారం లోపలే కాకుండా.. బయట కూడా ఒక మృదువైన ఫ్యాబ్రిక్‌తో తయారుచేసిన డోర్‌మ్యాట్ వేస్తే.. మన పాదాలపై ఉన్న కంటికి కనిపించని దుమ్మును అది ఆకర్షిస్తుంది. తద్వారా ఇంట్లోకి దుమ్ము చేరకుండా జాగ్రత్త పడచ్చు. కొంతమందికి ఇంట్లో కూడా చెప్పులు వేసుకునే అలవాటుంటుంది. అయితే వాటిని బయటికి తీసుకెళ్లకుండా ఇంట్లోనే వాడుకోవాలి. అలాగే ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకోవడమూ ముఖ్యమే. ఈ కాలంలో సన్నటి దుమ్ము రేణువులు బెడ్‌షీట్స్, సోఫా కవర్స్, కర్టెన్లపై చేరుతుంటాయి. అందుకే వాటిని కాస్త గట్టిగా దులిపితే దుమ్ము లేవడం గమనిస్తుంటాం. అందుకే వీటిని వారానికోసారి మార్చి శుభ్రం చేయడం మంచిది. బయటి నుంచి వచ్చే దుమ్ము వల్ల కిటికీ గ్రిల్స్/బ్లైండ్స్ త్వరగా మురికిగా మారతాయి. ఇలాంటప్పుడు డిజర్జెంట్ నీళ్లు లేదా నీళ్లలో ముంచి పిండిన సాక్స్‌తో వాటిని శుభ్రం చేస్తే.. ఇంట్లో దుమ్ము బెడద ఉండదు. ఇల్లు కూడా నీట్‌గా కనిపిస్తుంది.



సాక్స్‌కు ప్రత్యామ్నాయంగా విభిన్న లేయర్లతో కూడాన బ్లైండ్ క్లీనర్స్ కూడా ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్నాయి. డోర్‌మ్యాట్స్, కార్పెట్స్‌లో కంటికి కనిపించని దుమ్ము ఎక్కువగా చేరుతుంది. వాటిని వ్యాక్యూమ్ క్లీనర్‌తో తరచూ శుభ్రం చేస్తూనే.. వారం లేదా పదిహేను రోజులకోసారి మార్చి శుభ్రం చేయడం మంచిది. ఇంట్లో కొన్ని రకాల సామగ్రిపై పేరుకున్న దుమ్మును తొలగించాలంటే పెద్ద పనిలా అనిపిస్తుంటుంది. శరీరం బద్ధకిస్తుంది. ఇలాంటప్పుడు 'లింట్ రోలర్' ఉపయోగిస్తే పని సులభంగా పూర్తి అవుతుంది. పేరుకు తగ్గట్లే రోలర్‌లా ఉండే దీంతో ఆయా వస్తువుల ఉపరితలంపై రోల్ చేస్తే చాలు. వాటిపై ఉన్న దుమ్మును కూడా ఇది ఆకర్షించుకొని వాటిని మెరిపిస్తుంది. ఇంట్లో షెల్ఫులు/అరల్లో ఎక్కువగా దుమ్ము చేరుతుంటుంది. పైగా ఆ దుమ్ము ఓ పట్టాన వదలదు కూడా! ఇలాంటప్పుడు మృదువుగా ఉండే క్లీనింగ్ డస్టర్‌ని ఉపయోగిస్తే పని సులువవుతుంది. పెంపుడు జంతువుల చర్మంపై ఉండే వెంట్రుకల వల్ల కూడా ఇంట్లోకి దుమ్ము చేరుతుంది. అలా జరగకూడదంటే. వాటికి రోజూ స్నానం చేయించడం, అవి తిరిగే, పడుకునే ప్రదేశాల్ని



నీట్‌గా ఉంచడం మంచిది. తద్వారా వాటి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చు. ఇష్టంతోనో లేదంటే గృహాలంకరణలో భాగంగానో.. ఈ మధ్య చాలామంది ఇంట్లో వివిధ రకాల ఇండోర్ మొక్కల్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే వీటిలో కొన్ని దుమ్మును శోషిస్తాయంటున్నారు నిపుణులు. కలబంద, స్నేక్ ప్లాంట్, బోస్టన్ ఫెర్న్, పీస్ లిల్లీ, రబ్బర్ ప్లాంట్.. వంటివి అందులో కొన్ని! వీటిని ఇంట్లో ఏర్పాటుచేసుకుంటే ఇటు అలంకరణ వస్తువుగా అందాన్నిస్తుంది. అటు ఇంట్లో దుమ్ము లేకుండా ఉంటుంది.

# జగన్మాత

ఎవరే దృష్టితో ఆరాధిస్తే వార్ని ఆయా రూపంతో అనుగ్రహిస్తోందీ జగన్మాత! ఎవరే విధంగా పూజిస్తూ ఆయా లీలతో వరాన్ని ప్రసాదిస్తోందీ జగజ్జనని,. ఆ జగన్మాత తత్త్వం తెలిసికొనుట సామాన్యమా? నిష్కల్మషమైన భక్తితో ఆరాధిస్తేనే శక్తిస్వరూపిణియైన ఆ జగన్మాత సులభ సాధ్యమవుతుదని శ్రీ శంకర భగవత్పాదులు చెప్పారు. మానవుని లో ఒక చైతన్యశక్తిని కల్గించా ఆధ్యాత్మిక సాధనతో జీవితాన్ని మలుపుత్రిప్పి, చెడును తొలగించి మంచి వెలిగించే విధికి శక్తిని స్తవము చేయుట తొలిమెట్టు, ఆ తల్లిని స్తవము చేసిన రీతి శంకర భగవత్పాదుల వారు తప్ప మరొకరు కన్పించరు. సృష్టి, స్థితి లయకారులకు చైతన్యాన్ని స్ఫూర్తిని కల్గించే ఆమె (జగన్మాత) శక్తి స్వరూపిణి, సకల శక్తులకు మూలశక్తి, అదే పరాదేవత పరాశక్తి. ఈ జగత్తు శక్తి మయమైనది. ఏ శక్తియొక్క కలయిక లేనిదే శివుడైనా కదలలేడో అదియే పరాశక్తి, సృజనశక్తి బ్రహ్మ అయితే పాలనాశక్తి విష్ణువు లయశక్తి శివుడై నారు. ఇవన్నీదేవి పరాశక్తి రూపాలే! సర్వ ప్రపంచానికి కారణభూతురాలైన శక్తి స్వరూపమైన జగనాత్మను పూజిస్తే సకల దుఃఖాల తొలగి శాంతి కలుగుతుందని మన భారతీయుల ప్రగాఢ విశ్వాసము.

# పప్పులకు పురుగు పడుతుందా..



ఇంట్లో సరకులు నిండుకుంటా యని ఒకేసారి ఎక్కువ మొత్తంలో బియ్యం, పప్పు ధాన్యాలు కొనేస్తుంటాం. అవి పాడవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటాం. అయినా ఫలితం ఉండదు. ఇక ఇలా జరగకుండా కొన్ని చిట్కాలు... ఎక్కువ మొత్తంలో పప్పు ధాన్యాలు నిల్వ చేయాలనుకుంటే, డబ్బా అడుగు భాగంలో కొన్ని ఎండిన వేప ఆకులను వేసి పప్పులను నింపండి. వేప క్రిమినాశిని కాబట్టి పప్పులు పురుగు పట్టవు. పప్పు నిల్వ చేసే డబ్బాల్లో మూడు నాలుగు ఎండు మిరపకాయలు వేస్తే పురుగులు చేరవు. పప్పులు పురుగు పట్టకుండా ఉండాలంటే.. ఐదారు పొట్టు తీయని వెల్లుల్లి రెబ్బలను ఆ సీసాల్లో వేయండి. వాటిని ఎండిపోయే వరకూ ఉంచి.. తరవాత బయటకు తీసేసి కొత్తవి ఉంచండి. అయిదారు లవంగాలను పప్పుల డబ్బాలో పెట్టి.. గాలి తగలకుండా మూత బిగిస్తే సరి.

# ఏకాగ్రతను పెంచే బంతాట

కాలక్షేపం అంటూ ఫోన్లూ, ట్యాబ్‌లకు అతుక్కుపోతోన్న పిల్లల మనసు మళ్లించాలంటే ఆరుబయట ఆడించే ఆటే సరైన మార్గం. ఇవి వారికి శారీరక శ్రమను అందించడమే కాదు, మెదడునీ చురుగ్గా ఉంచుతాయి. అలాంటిదే ఈ బ్యాలెన్సింగ్ బాల్ గేమ్. దీనికోసం మీరు చేయాల్సిందల్లా.. ముందు ఒక లక్ష్యం ఏర్పాటు చేయాలి. దానికి ఐదు మీటర్ల దూరం వరకూ కాస్త ఎడం ఇచ్చి సమాంతరంగా రెండు గీతలు గీయాలి. ఇద్దరు చిన్నారుల్ని లక్ష్యానికి మరోవైపు లైన్ చివర నిలబెట్టాలి. వారి చేతికి ఒకేలాంటి కర్రలిచ్చి ఇద్దరినీ పట్టుకోమనాలి. ఇప్పుడు వాటిపై ఓ బంతిని పెడితే, కింద గీత దాటకుండా ఆ బాల్ కింద పడకుండా ఇద్దరూ బ్యాలెన్స్ చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలి. ఈ ఆట ఏకాగ్రతను పెంచడంతో పాటు, ఇతరులతో సులువుగా కోఆర్డినేట్ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.



# తెర

# 'లెనిన్' జూన్ 26న విడుదల



'లెనిన్' జూన్ 26న విడుదల

యంగ్ అండ్ డైనమిక్ యాక్టర్ అఖిల్ అక్కినేని నెక్స్ట్ మూవీ 'లెనిన్' సినిమా నుంచి ఇప్పటి వరకు 'వారెవా వారెవా..' , 'ఎట్టా ఎట్టా..' అనే రెండు సాంగ్స్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ రెండు చార్ట్‌బస్టర్ సాంగ్స్ మంచి హైప్‌ను క్రియేట్ చేశాయి. మ్యూజికల్ సెన్సేషనల్ తమన్ సంగీత సారథ్యంలో విడుదలైన ఈ పాటలు అందరి దృష్టిని ఆకర్షించి సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇటీవల కింగ్ నాగార్జున.. లెనిన్ మూవీ ఫస్ట్ కాపీని చూసి సినిమా అవుట్‌పుట్‌తో పాటు టీమ్ పనితీరుపై చాలా ఇంప్రెస్ అయ్యారు. అంతే కాకుండా, నిన్న సినిమా చూశానని, ఎంతో నచ్చిందని తన ఎక్స్ అకౌంట్ (ట్విట్టర్)లో ట్వీట్ ద్వారా తెలియ జేశారు. ఈ సినిమాతో జూన్ 26న థియేటర్లలో ప్రేక్షకులు 'కొత్త అఖిల్'ను చూడబోతున్నారనే కూడా ఆయన హామీ ఇచ్చారు. నిన్న రాత్రి మా లెనిన్ సినిమా ఫస్ట్ కట్ చూసాను. నమ్మకంతో, గర్వంతో చెబుతున్నాను.. జూన్ 26న మీరు ఒక కొత్త అఖిల్‌ను చూడబోతున్నారు. ఆ తేదీని గుర్తుంచుకోండి. ' లెనిన్' సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథతో పూర్తి ఎంటటైనర్‌గా రూపుదిద్దు కుంటోంది. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో విడుదల కానుంది. ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా మేకర్స్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# 'భోగి' చిత్రం ఫస్ట్ లుక్ రిలీజ్



చార్మింగ్ స్టార్ శర్వా, మాస్ మేవరిక్ సంపత్ నందితో కలిసి చేస్తున్న భారీ పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ సాగా 'భోగి'. ప్రతిష్టాత్మక శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. శర్వా కెరీర్‌లో అత్యంత భారీ స్థాయి ప్రాజెక్టుల లో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ పోస్టర్, శర్వా పుట్టినరోజు ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. వీటికి అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా మేకర్స్ అనుపమ పరమేశ్వరన్ పాత్రను పరిచయం చేస్తూరు 'కందుల సులోచనరాణి'గా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అనుపమ పల్లెటూరి యువతిగా సహజసిద్ధమైన లుక్‌లో కనిపిస్తుంది. మోదుగ ఆకులు తో ఆకుపళ్లెం తయారు చేస్తూ జీవనం సాగించే సులోచన పాత్రలో అనుపమ పూర్తిగా లీనమయ్యారు. ప్రకృతితో ముడిపడి ఉన్న ఈ పాత్రలో ఆమె సహజత్వం, ధైర్యం, బలం ప్రతిబింబి స్తున్నాయి. ఇప్పటికే రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి అడవుల్లో హైఇంటెన్సిటీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు. త్వరలో హైదరాబాద్ పరిసరాల్లో నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో డింపుల్ హయాతి మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. 1960ల నేపథ్యంలో తెలంగాణమహారాష్ట్ర సరిహద్దుల్లో సాగే ఈ కథ యాక్షన్, భావోద్వేగాలతో నిండిన పీరియడ్ డ్రామాగా రూపొందు తోంది. 'భోగి' టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్, కిషోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'భోగి' చిత్రం రక్షా బంధన్ సందర్భంగా ఆగస్టు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'ఎపిక్ ' ఫస్ట్ సెమిస్టర్ టీజర్ విడుదల



'ఎపిక్' టీజర్ అందమైన అనుభూతిని అందిస్తూ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్యల మధ్య కథను కేంద్రీకరిస్తుంది. 'బేబీ' సినిమా తర్వాత ఈ జంటకు ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలో యింగ్ ఉంది. ఇప్పుడు ఈ హిట్ పెయిర్ సరికొత్తగా మరోసారి వెండితెరపై మ్యాజిక్ చేయడానికి సిద్ధమైంది. 90es వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ సినిమాతో వెండితెరపై అడుగుపెడుతున్నారు. తాజాగా విడుదలైన టీజర్, మొదటి సినిమాతోనే ఆయన ఘన విజయాన్ని ఖాతాలో వేసుకోబోతున్నారనే నమ్మ కాన్ని కలిగిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలోని తొలి గీతం 'సంచారమే" ఇప్పటికే అన్ని ప్లాట్‌ఫార్మ్‌లలో ట్రెండ్ అవుతూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. కథానాయిక వైష్ణవి చైతన్య మాట్లాడుతూ.. ముందుగా 'సంచారమే' పాటపై ప్రేమను కురిపించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఎపిక్ కథ నాకు చాలా నచ్చింది. కథ వినగానే నేను ఈ సినిమాలో భాగం కావాలి అనుకున్నాను. నేను పోషించిన కడలి పాత్ర చాలా బాగుంటుంది. దర్శకుడు ఆదిత్య హాసన్ మాట్లాడుతూ.. "ఈ సినిమా ప్రతి ఒక్కరికీ చేరువయ్యే ప్రేమకథ. కథ రాస్తున్నప్పుడు, తీస్తున్నప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల మనసు గెలుచుకుంటుందని నమ్మాను. చిత్ర విజయం పట్ల ఎంతో నమ్మకంగా ఉన్నాము.

# 'డాక్టర్ కీర్తి', మే 8న థియేట్రికల్ రిలీజ్



గోపాలకృష్ణ దొండపాటి సమర్పణలో స్వర్ణ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళ స్టార్ హీరోయిన్ భావన ప్రధాన పాత్రలో నటించిన మలయాళ చిత్రం హంట్ తెలుగులో 'డాక్టర్ కీర్తి', ఎంబీబీఎస్ ఎంఎస్ అనే పేరుతో అనువాదమవుతోంది. మలయాళ దర్శకుడు షాజీ కైలాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ సంచలనం సృష్టించిన కలకత్తాలోని జరిగిన డాక్టర్ రేప్ మర్డర్ నేపథ్యంగా తెరకెక్కించారు. చిత్ర నిర్మాతలు స్వర్ణకుమారి దొండపాటి, ఎం.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ కోల్ కత్తాలో సంచలనం సృష్టించిన డాక్టర్ రేపు మర్డర్ కేసు ఆధారంగా మలయాళ ప్రముఖ దర్శకుడు షాజీ కైలాస్ అద్భుతంగా తెరకెక్కించిన సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాము. నటి కవిత మాట్లాడుతూ మలయాళంలో సూపర్ డూపర్ హిట్ అయిన ఈ సినిమాను తెలుగులోకి గోపాలకృష్ణ ఆయన టీమ్ తీసుకొస్తోంది. యదార్థ ఘటనల ఆధారంగా దర్శకుడు షాజీ కైలాస్ ఈ సినిమాను ఆసక్తికరంగా తెరకెక్కించారు. మహిళలకు రక్షణ లేని ఈ సమాజంలో వెస్ట్ బెంగాల్‌లో ఒక డ్యూటీ డాక్టర్‌కు ఎదుర్కొన్న విషాదకర ఘటన మనందరినీ కలిచివేసింది. ఆ వైద్యురాలి ఆత్మ తన బాధను చెబితే ఎలా ఉంటుంది అనేది ఈ మూవీలో దర్శకుడు తెరకెక్కించారు. ప్రొడ్యూసర్ లయన్ సాయివెంకట్ మాట్లాడుతూ గోపాలకృష్ణ గారు 'డాక్టర్ కీర్తి', ఎంబీబీఎస్ ఎంఎస్ అనే ఒక మంచి మూవీని మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా చూశాను. నేను ఆ మూవీ చూస్తూ కథలో లీనమైపోయాను. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చాలా బాగుంది. ఇది రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా తెరకెక్కించిన మూవీ. ఈ మూవీ చూడగానే పీవీఆర్ వాళ్లు రిలీజ్ చేసేందుకు ముందుకొచ్చారంటే ఎంత బాగుందో అర్థం చేసుకోవచ్చు. లీగల్ అడ్వొకేట్ ప్రభాకర్ మాట్లాడుతూ 'డాక్టర్ కీర్తి', ఎంబీబీఎస్ ఎంఎస్ సినిమా టీజర్ చాలా బాగుంది. ఈ సినిమా గోపాలకృష్ణకి మంచి విజయాన్ని అందించాలని కోరుకుంటున్నా. ఈ సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. అన్నారు.

# 'అగధ'లో మంజుల మనవరాలు జోవికా



తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఒకప్పుడు అగ్ర కథానాయిక గా వెలుగొందారు మంజుల. ఎన్టీఆర్‌తో మనుషలంతా ఒక్కటే, మగాడు, నేరం నాది కాదు ఆకలిది, ఏయన్నార్‌తో దొరబాబు, బంగారు బొమ్మలు, మహాకవి క్షేత్రయ్య, కృష్ణతో మాయదారి మల్లిగాడు, రక్తసంబంధాలు, శోభన్ బాబుతో మంచి మనుషులు, పిచ్చిమారాజు వంటి ఎన్నో సూపర్ హిట్స్ లో నటించారు. మంజుల కూతురు వనితను 'దేవి'తో నటిగా పరిచయం చేశారు ఎంఎస్ రాజు. ఇప్పుడు మంజుల మనవరాలు, వనిత కుమార్తె జోవికా విజయ్ కుమార్‌ను 'అగధ' తో నటిగా పరిచయం చేస్తున్నారు ఎంఎస్ రాజు. ఇందులో ఆమె పాత్ర పేరు 'హరిణి'. ఆమె క్యారెక్టర్ పోస్టర్ ని ఈరోజు విడుదల చేశారు. జోరున కురుస్తోన్న వర్షంలో మసకబారిన పురాతన నేపథ్యంలో, జోవికా అద్భుతమైన రూపంలో కనిపిస్తుంది. ఆమె హావభావాలు పలికించే కళ్ళలో అమాయకత్వం, దాగి ఉన్న శక్తి కలగలిసి ఉన్నాయి. ఇది కథ యొక్క ఆధ్యాత్మిక, మర్మమైన మూలాలతో గాఢంగా ముడిపడి ఉన్న పాత్రను సూచిస్తుంది.'అగధ'కు సంబంధించి ఇప్పటివరకూ విడుదల చేసిన అన్ని పోస్టర్లు ఈ సినిమా తాలూకు ఇంటెన్సిటీ ని ఆవిష్కరించే విధంగా ఉన్నాయి.

# 'కర' విజయాన్ని సాధిస్తుంది: సతీష్ కుమార్



ధనుష్, మమితా బైజు జంటగా కుష్మిత గణేష్ సమర్పణలో డా. ఐషరి కె. గణేష్ నిర్మించిన చిత్రం కర్త. ఈ మూవీకి విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఏప్రిల్ 30న విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్ అధినేత సీహెచ్. సతీష్ కుమార్ మీడియాతో చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఆయన ఏం చెప్పారంటే.... మాది విశాఖపట్నం. చిన్న సినిమాల్ని కొంటూ డిస్ట్రిబ్యూషన్ స్టార్ చేశాను. ఆ తరువాత ఓ మూవీని కూడా నిర్మించాను. అర్జున్ రెడ్డి, 'కబాలి', 'సింగం 3', 'సలార్', కాంతారా చాప్టర్ 1 వంటి సినిమాల్ని ఉత్తరాంధ్రలో డిస్ట్రిబ్యూషన్ చేశాను. ధనుష్ 'ధర్మయోగి' సినిమాని తెలుగులో రిలీజ్ చేశాను. ప్రొడక్షన్‌లోనూ మంచి సినిమాల్ని చేయాలని అనుకుంటున్నాను. ఈ 'కర' మూవీ కోసం నా స్నేహితుడు రాజేష్ సపోర్ట్ తీసుకున్నాను. ధనుష్ గారికి మంచి మార్కెట్ ఉంది. ఇందులో మంచి కంటెంట్ ఉందని నాకు నమ్మకం ఉంది. ఈ మూవీ గొప్ప విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేస్తున్నాను. ధనుష్ సినిమా అంటే చాలా మంది పోటీ పడతారు. కానీ నేను పర్సనల్‌గా కేర్ తీసుకుని నిర్మాత గణేష్‌ని అప్రోచ్ అయ్యాను. నా ప్రయత్నం చూసి ఈ చిత్రాన్ని నాకు ఇచ్చారు. 80 శాతం బిజినెస్ ఆల్రెడీ కంప్లీట్ అయింది.సాధారణ ప్రేక్షకులందరికీ ఈ చిత్రం కనెక్ట్ అవుతుంది. ఓ సాధారణ మనిషికి ఎదురయ్యే సమస్యల్ని చాలా స్ట్రాంగ్ కంటెంట్, ఎమోషనల్ కంటెంట్ తో కర్త రాబోతోంది. నైజాంలో దిల్ రాజు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. అలా ఒక్కో ఏరియాలో ఒక్కొక్కరికి ఇచ్చాం. నేను ఉత్తరాంధ్ర ఏరియాకి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాను. దాదాపు 400కు పైగా స్క్రీన్లలో రిలీజ్ చేస్తున్నాం. హిందీ వర్షెన్‌తో కలిపితే 600కి పైగా స్క్రీన్లలో వచ్చే అవకాశం ఉంది. కరస్వామి అనే వ్యక్తి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అందుకే తెలుగులో 'కర' అనే టైటిల్‌ను పెట్టారు... 'పోరు తొళిల్' నాకు ఎంతో ఇష్టమైన సినిమా. విఘ్నేశ్ మేకింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన మీద నాకు చాలా నమ్మకం ఉంది.

## బ్యాటింగ్‌లో ఆర్సీబీ వైఫల్యం

# గుజరాత్ విక్టరీ

**అహ్మదాబాద్:** డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్‌కు గుజరాత్ టైటాన్స్ షాకిచ్చింది. సొంతగడ్డపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆర్సీబీ ఉంచిన 156 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్‌టైటాన్స్ 15.5ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఐపీఎల్‌లో అయిదో విజయంతో ప్లే ఆఫ్ అవకాశాలను పదిలంగా ఉంచుకుంది.

శుభ్‌మన్ గిల్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 18 బంతుల్లో 43 రన్స్ సాధించాడు. జాస్ బట్లర్ కూడా 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో చెలరేగి 39 రన్స్ చేసి గెలుపుకు బాట వేశారు. సాయి సుదర్శన్(6), వాషింగ్టన్ సుందర్(12), షారుక్ ఖాన్(8) నిరాశపర్చినా.. మిగతా పనిని రాహుల్ తెవాటియా(27), రషీద్ ఖాన్(7) పూర్తి చేసి గుజరాత్ టైటాన్స్‌కు విజయం అందించారు.



వరుసగా 5 ఫోర్లు బాదిన విరాట్ కోహ్లీని అవుట్ చేసిన ఆనందంలో కగిసో రబడ

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీకి విరాట్ కోహ్లీ దూకుడు ఆరంభం ఇచ్చాడు. రబడ తొలి ఓవర్‌లో 5 వరుస బౌండరీలతో అలరించాడు. అయితే వెంటవెంటనే ఓపెనర్లు బెతెల్(5)ను సిరాజ్, కోహ్లీ(28)ను రబడ అవుట్ చేశారు. పడిక్కల్, రజత్ పాటిదార్(19) మూడో వికెట్‌కు 44 పరుగులు జోడించి ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత ఆర్సీబీ వేగంగా వికెట్లు కోల్పోయింది. మిడిల్ ఆర్డర్‌ను అర్షద్, రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ కుప్పకూల్చారు. మరో ఎండ్‌లో దేవదత్ పడిక్కల్ ధాటిగా ఆడుతూ 24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40 పరుగులతో రాణించడంతో ఆర్సీబీ జట్టు వంద మార్కు దాటింది. చివర్లో భువనేశ్వర్ కుమార్ బ్యాట్‌తో 15 బంతుల్లో 15 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. గుజరాత్ బౌలర్ల ధాటికి ఆర్సీబీ 19.2 ఓవర్లలోనే 155 పరుగులకు ఆలౌటైంది. గుజరాత్ బౌలర్లలో అర్షద్ 3 వికెట్లు.. రషీద్ ఖాన్, హోల్డర్ రెండేసి వికెట్లు.. సిరాజ్, రబడ ఒక్కో వికెట్ పడగొట్టారు.



# హైదరాబాద్ పాంచ్ పటాకా

(వార్త క్రీడా విభాగం)

- *ముంబై 243 చేసినా ఓటమే
- *రాజస్తాన్ 229 ఇచ్చినా పరాజయమే
- *ఢిల్లీ ముందు 242 సెట్ చేసి విజయం
- *చెన్నైకు 194 ఇచ్చి కాపాడుకుంది
- *రాజస్థాన్‌ను పేకమేడలా కూల్చింది
- * వరుసగా 5 మ్యాచ్‌ల్లో గెలుపు
- * 12 పాయింట్లతో మూడో స్థానం

సన్ రైజర్స్ హైదరాబాద్. నిలకడైన ఆటతీరుతో పంజాబ్ కింగ్స్ స్థానానికే ఎసరు పెట్టేలా కనిపిస్తోంది. ఒక్క మ్యాచ్ లో తప్పిస్తే ఆరేంజ్ ఆర్మీ విధ్వంసకర బ్యాటింగ్ కొనసాగింది. ప్రతిమ్యాచ్‌లో 200 ప్లస్ పరుగులు సాధిస్తూ వస్తోంది. ఛేజింగ్‌లోనైనా, లక్ష్యాన్ని కాపాడుకోవడంలోనైనా ఈసీజన్‌లో మేమే టాప్ అనిపించుకుంటున్నారు. వరుసగా 5 విజయాల తో ప్లే ఆఫ్ రేసులో దూసుకుపోతోంది.

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయాలతో అదరగొడుతోంది. ఆరంభంలో తడబడ్డా... సొంత గడ్డ ఇచ్చిన బూస్టింగ్‌తో వరుస విజయాలు సాధిస్తోంది. ముంబై ఇండియన్స్ 244 రన్స్ టార్గెట్‌ను సైతం ఉఫ్ మనిపించింది. వరుసగా అయిదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ప్లే ఆఫ్ రేసులో స్ట్రాంగ్ కంటెండర్ టీమ్‌గా నిలిచింది.

ఆరేంజ్ ఆర్మీ.. ఐపీఎల్ 2026 సీజన్‌ను ఓటమితో ఆరంభించింది. కోల్‌కతాపై విజయంతో రెండో మ్యాచ్‌లో గెలుపు బోణీ చేసినా...ఆతర్వాత వరుసగా రెండుఓటములు ఖాతాలో చేరాయి. సొంతగడ్డ ఉప్పల్ స్టేడియం వేదికగా ఆడిన తొలి మ్యాచ్‌లోనూ ఓటమి పొందడంతో సన్‌రైజర్స్‌పై నమ్మకం సడలింది. ఇక్కడి నుంచి అందరి అంచనాలను భిన్నంగ్ ఆరేంజ్ టీమ్ గెలుపు ట్రాక్‌లో పడింది. సొంతగడ్డపై హాట్రిక్ విజయాలు అందుకుంది. ఉప్పల్ విజయాల బూస్టింగ్‌తో సన్‌రైజర్స్... జైపూర్, వాంఖడే లోనూ విజయ దుంధుబి మోగించింది. ముఖ్యంగా ముంబై మ్యాచ్‌లో సన్‌రైజర్స్ ఆట పీక్‌కు చేరింది. భారీ టార్గెట్‌ను కూడా అలవోకగా ఛేధించింది. టార్గెట్ ఛేధించడంలోనే కాదు తమ స్కోర్లను కూడా కమిన్స్ సేన కాపాడుకుంటూ వస్తోంది.

సన్‌రైజర్స్ ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉంది. టాపార్డర్ మొత్తం పరుగుల వేటలో ఉంది. విధ్యంసకర బ్యాటింగ్ లైనప్... ఆరేంజ్ ఆర్మీకి విజయాల మీద విజయాలు కట్టబెడుతోంది. ఆరంభంలో విఫలమైన అభిషేక్ ఒక్కసారిగా ఆట గేర్ మార్చాడు. ఓ సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీలతో 425 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండో స్థానంలో ఉంది కూడా సన్‌రైజర్స్ బ్యాట్స్‌మెన్ హెన్రీ క్లాసెన్. అతను నాలుగ అర్ధసెంచరీలతో ఇప్పటివరకు 414 రన్స్ సాధించాడు. ఇక ఇషాన్ కిషన్ 40.25 బ్యాటింగ్ సగటుతో 312 పరుగులతో ఉన్నాడు. అందులో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఓ అర్ధసెంచరీతో సహా 262 రన్స్ చేశాడు. సూపర్ ఆల్‌రౌండర్‌గా ఎదిగిన నితీష్ కుమార్ బ్యాటింగ్‌లోనూ కీలక సమయంలో పరుగులు సాధిస్తూ జట్టు విజయాల్లో తనదైన రోల్ పోషిస్తున్నాడు.

సన్‌రైజర్స్ ఇపుడు భారీ లక్ష్యాలను ఛేధించడంలో దిట్టగా మారింది. బ్యాటర్లు పవర్ ప్లే నుంచే ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకు పడుతున్నారు. టాప్‌ఆర్డర్‌లోని ట్రావిస్ హెడ్, అభిషేక్, ఇషాన్, క్లాసెన్‌లలో కనీసం ముగ్గురు ప్రతి మ్యాచ్‌లో ఇరగదీస్తుండడమే సన్‌రైజర్స్ విజయ రహస్యంగా మారింది. ఒకరు కాకపోతే మరొకరు బాధ్యత తీసుకుని మ్యాచ్ ఫినిషర్లుగా మారుతున్నారు. క్లాసెన్ నిలకడైన బ్యాటింగ్ కూడా ఆరేంజ్ ఆర్మీకి కలిసివస్తోంది. నితీష్ కుమార్-క్లాసెన్ జోడీ... చివరి ఓవర్లలో ప్రశాంతంగా ఆడుతూ మ్యాచ్‌లను గెలిపిస్తున్నారు.

ఇక పాట్ కమిన్స్ వచ్చిన తర్వాత సన్‌రైజర్స్ బౌలింగ్ మరింత పటిష్టంగా మారింది. కమిన్స్ బౌలింగ్‌లో కీలక మార్పులు చేస్తూ, జట్టును విజయపథంలో నడిపిస్తున్నారు. ఈ కారణాల వల్లనే సన్‌రైజర్స్ వరుస విజయాలతో దూసుకుపోతూ, పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి చేరింది. ఇదే ఆటతీరు కొనసాగితే టాప్ ప్లేస్ కూడా ఖాయం.



## క్వార్టర్ ఫైనల్లో చైనీస్ తైఫీతో భారత్ ఢీ

**హోర్సెన్స్(డెన్మార్క్):** థామస్ కప్ బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు.. క్వార్టర్‌ఫైనల్లో చైనీస్ తైఫీతో తలపడనుంది. హోర్సెన్స్‌లో నాకౌట్ డ్రా తీశారు. 2022ఛాంపియన్ భారత్.. గ్రూప్-ఎలో రెండో స్థానంలో నిలిచింది. కెనడాపై 4-1తో, ఆస్ట్రేలియాపై 5-0తో నెగ్గిన భారత్... చివరి లీగ్ మ్యాచ్‌లో చైనా చేతిలో 3-2తో ఓటమి చవిచూసింది. గ్రూప్-ఎలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన చైనా, భారత్.. క్వార్టర్ ఫైనల్ చేరాయి. మరోవైపు చైనీస్ తైపీ చెమటోడ్చి క్వార్టర్‌ఫైనల్ చేరింది. గ్రూప్-సిలో అతిథ్య డెన్మార్క్‌పై నెగ్గింది. కాగా గ్రూప్-ఎలో అజేయంగా నిలిచి అగ్రస్థానంలో నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్ చైనా.. క్వార్టర్ ఫైనల్లో మలేషియాతో తలపడుతుంది. 14సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఇండోనేషియాను అద్భుత రీతిలో ఓడించిన ఫ్రాన్స్‌తో.. గ్రూప్ బి టాపర్ జపాన్ తలపడుతుంది. మరోవైపు, గ్రూప్- సిలో రెండవ స్థానంలో నిలిచిన ఆతిథ్య డెన్మార్క్..థాయిలాండ్‌తో తలపడనుంది. ఇండోనేషియా తర్వాత 11 టైటిళ్లతో చైనా రెండవ అత్యంత విజయవంతమైన జట్టుగా ఉంది. 2022లో బ్యాంకాక్‌లో భారత్ చరిత్ర సృష్టించింది, ఫైనల్‌లో ఇండోనేషియాను 3-0 తేడాతో ఓడించి భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. మరోసారి అప్పటి ఫీట్ సాధించాలని భారత పురుషుల జట్టు ఉవ్విళ్లూరుతోంది.

## మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్

# సెమీస్‌లో సినర్

**మాడ్రిడ్:** ప్రపంచ నెంబర్ వన్ జానిక్ సినర్ జోరు మాడ్రిడ్ ఓపెన్‌లో కొనసాగుతోంది. జానిక్ సినర్ 6-2, 7-6 (7/0) తేడాతో విజయంతో సంచలనాల రఫెల్ జోడార్‌కు ముగింపు పలికి సెమీఫైనల్లో ప్రవేశించాడు. దీంతో సినర్... వరుసగా తొమ్మిదో మాస్టర్స్ 1000 టోర్నీలోనూ సెమీఫైనల్స్‌కు చేరి రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. 19 ఏళ్ల జోడార్ ఈ క్లే సీజన్ టూర్‌లో సంచలనం సృష్టించాడు. మారకేష్‌లో తన తొలి ఏటీపీ టైటిల్‌ను గెలుచుకోవడమే గాక, బార్సిలోనాలో సెమీస్‌కు, మాడ్రిడ్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అయితే ప్రపంచ నంబర్‌వన్ ఆటగాడి చేతిలో ఓటమి పాలయ్యాడు. తొలి సెట్‌ను అలవోకగా నెగ్గిన సినర్‌కు... రెండో సెట్‌లో జోడార్ నుంచి అనూహ్యంగా పోటీ ఎదురైంది. పోటాపోటీగా పాయింట్లు సాధించడంతో సెట్ టైబ్రేకర్ వరకు కొనసాగింది. చివరకు విజయం అనుభవజ్ఞుడైన సినర్‌కు వరించింది. మరో క్వార్టర్ ఫైనల్లో ఆర్థర్ ఫిల్స్ 6-3, 6-4 తేడాతో జిరి లెహెకాను ఓడించాడు. సెమీ ఫైనల్లో సినర్‌తో తలపడేదుకు సిద్ధమయ్యాడు.





## కోస్టియుక్ జైత్రయాత్ర

మహిళల సింగిల్స్‌లో మార్టా కోస్టియుక్ జైత్రయాత్ర కొనసాగిస్తూ సెమీఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో ఆమె 7-6, 6-0తో 13వ సీడ్ లిండా నోస్కోవాపై గెలిచి వరుసగా 10వ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో ఆమె లక్కీ లూజర్ అనస్తాసియా పొటపోవాతో సెమీ ఫైనల్ పోరుకు అర్హత సాధించింది. 26వ సీడ్ అయిన ఈ ఉక్రేనియన్ క్రీడాకారిణి 23 బ్రేక్ పాయింట్లను సృష్టించింది.




## పశ్చిమాసియా ఉద్రిక్తతల ఎఫెక్ట్

# నష్టాల్లోకి సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 30:** అమెరికా,ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భగ్గుమనడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూ శాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడం తో సూచీలు పతనమయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 582.86పాయింట్లు నష్ట పోయి 76,913.50 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 180.10 పాయింట్లు క్షీణించి 23,997.55 వద్ద ముగిసింది.ఇరాన్ శాంతి ప్రతిపాదనను అమెరికా తిరస్కరించడం, కీలకమైన చమురు రవాణా మార్గం హర్మూజ్ జలసంధి వద్ద దిగ్బంధనాన్ని తీవ్రతరం చేయడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుం దనే ఆందోళనలను పెంచింది. ఫలితంగా ద్రవ్యో ల్బణం భయాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి.ఈ ప్రభావంతో ఐటీ, ఫార్మా వంటి డిఫె న్సివ్ రంగాలు మినహా దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టపోయాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్, నిఫ్టీ కన్‌స్ట్రక్షన్ డ్యూరబుల్స్ సూచీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిఫ్టీలో టాటామోటార్స్, హిందా ల్కో ఇండస్ట్రీస్ వంటివి టాప్ లూజర్లుగా నిలి చాయి. మరోవైపు, ముడిచమురు ధరలు 120 డాలర్ల సమీపానికి చేరడంతో రూపాయి విలువ కూడా పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.20 స్థాయికి బలహీనపడింది. ఎల్అండ్‌టి 2.03, ఐసిఐసిఐబ్యాంకు 1.09, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.98శాతం క్షీణించాయి.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచ 1.01శాతం, స్మాల్ క్యాప్ సూచీ 0.50శాతం చొప్పున పతనం అయ్యాయి. బిఎస్ఇలో 1649 షేర్లు పెరిగితే 2532 షేర్లు పతనం అయ్యాయి. 165 షేర్లు మాత్రం స్థిరంగా కొనసాగాయి. శుక్రవారంమేడే కావడంతో స్టాక్ మార్కెట్లు సెలవులో ఉంటాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.78శాతంపెరిగి రూ.1.51,700కి పెరిగింది. అమెరికా పదేళ్ల బాండ్లు 0.41శాతంపెరిగి 4.40శాతానికి చేరా యి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడి చమురు జూన్ సెటిల్‌మెంట్‌ధరలు 1.29డాలర్లు తగ్గి బ్యారెల్‌కు 116.74 డాలర్లుగా ఉన్నాయి. దీనికి తోడు ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లను పెంచేందుకు అంగీకరించలేదు. ఫెడరల్ ఓపెన్ మార్కెట్‌కమి టీలో 8 మందిలో నలుగురు వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగించాలని, 3.5 నుంచి 3.75శాతంవద్దనే ఉంచాలని వెల్లడించారు. దీనితో జెరోమ్‌పావెల్ వడ్డీరేట్లజోలికి వెల్లలేదు.

ఇక స్టాక్ విభాగాలపరంగా యూనిలీవర్ 2.70 శాతం క్షీణించింది. బజాజ్‌ఫైనాన్స్ 0.72 శాతం పెరిగింది. బజాజ్‌ఫిన్‌సెర్వ్ 0.99శాతం,బజాజ్ ఆటో 4.78శాతం, మీషా11.72 శాతం చొప్పున పెరిగాయి.ఎంటార్ టెక్నాలజీస్ 14.09శాతం జంప్‌చేసింది. కెమ్‌ఇండియా ప్రాజెక్ట్స్ ఎగువ సర్క్యూట్‌లో అంటే 20శాతంమేర పెరిగింది. నికర లాభాలుపెరగడమే ఇందుకు కీలకం. టెక్నో ప్లాస్ట్ ఇండియా 4.89శాతం ర్యాలీతీస్తే ఆదాని పవర్ 1.35శాతం ముందుకు కదిలింది. ఆర్పీజీ లైఫ్‌సైన్సెస్ 13.07శాతం ఒక్కసారిగాపెరిగింది. ఎంఫసిస్ కూడా 1.17శాతంపెరిగింది. కంపెనీ లాభాలు పెరగడమే ఇందుకు కీలకం.

# చరిత్రాత్మక కనిష్టానికి రూపాయి!

**ముంబయి, ఏప్రిల్ 30:** దేశీయ కరెన్సీ రూపాయి గురువారం భారీ పతనం చవిచూసింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 95 మార్కును దాటి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా, ఇరాన్ మధ్య తీవ్రమవుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి వంటి అంశాలు రూపాయిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాయి. గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.07 వద్ద ఆల్‌టైమ్ కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత మరింత బలహీనపడి ఇంట్రాడేలో 95.126 స్థాయికి, సెషన్ మధ్యలో 95.20 స్థాయికి కూడా పడిపోయింది.






## చందాదారులకు ఈపీఎఫ్ఓ గుడ్‌న్యూస్




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) చందాదారులకు త్వరలో గుడ్ న్యూస్ అందుతోంది. ఉద్యోగుల కనీస పెన్షన్‌ను భారీగా పెంచడంతో పాటు ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించడంపై ప్రభుత్వం,ఈపీఎఫ్ఓ దృష్టి పెట్టాయి. ఉద్యోగుల పింఛను పథకంకింద ఇస్తున్న కనీస పెన్షన్ రూ.1,000గా ఉంది.దీనిని ఏకంగా రూ.7,500కు పెంచాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ఒత్తిడి, పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే సమయంలో చందాదారుల ఖాతాలకు 8.25 శాతం వడ్డీ రేటును జమ చేసే ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. ఏటీఎం విత్ డ్రాయల్స్ చందాదారులకు మరింత ఊరటనిచ్చేలా, ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యంపై ఈపీఎఫ్ఓ కసరత్తు చేస్తోంది. మరోవైపు క్లెయిమ్స్ పరిష్కారంలో ఈపీఎఫ్ఓ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిమ్స్‌ను పరిష్కరించింది.

## ఆల్ఫాబెట్ రాబడులు 94.7 బిలియన్ డాలర్లు

**కాలిఫోర్నియా, ఏప్రిల్ 30:** అంతర్జాల సెర్చింజన్‌గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఇంక్ తొలి త్రైమాసికంలో అమ్మకాలు 94.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. గూగుల్ క్లౌడ్‌సేవలు 63శాతం రాబడులు పెంచుకోగలిగింది. మార్కెట్ నిపుణుల అంచనాలు 91.6 బిలియన్ డాలర్లను అధిగమించింది. కంపెనీ ప్రతి వాటాకు 5.11డాలర్లు రాబడులుసాధించినట్లు వాల్‌స్ట్రీట్‌లో నిపుణులు అంచనావేసారు. ఆల్ఫాబెట్ షేర్లు 7.6శాతంపెరిగి 376.35 డాలర్లకు పెరిగాయి. బుధవారం నాటి ముగింపుతో స్టాక్ ఈ ఏడాది ఇప్పటివరకూ 12శాతం పెరిగింది. బిల్డ్ ఎఐ మోడళ్లు, ఎఐ టూల్స్ అభివృద్ధిచేయడంతో గూగుల్ రాబడులు కూడా గణనీయంగాపెరిగాయి. మూడేళ్లక్రితం ప్రారంభించిన గూగుల్ క్లౌడ్ బిజినెస్ సేవలు ఇపుడు లాభదాయకంగా మారాయి. ఎఐ సాఫ్ట్‌వేర్; మౌలికవనరులకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెంచాయి. జెమిని చాట్‌బాట్‌యాప్, ఎంటర్‌ప్రైజ్ టూల్స్ వంటివి మంచి ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇక సందేహాల తనిఖీలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. గూగుల్ ఇంటిగ్రేటెడ్ ఎఐ టూల్స్ విశ్వవ్యాప్తంగా విస్తృత ప్రయోజనాలు అందిస్తున్నట్లు సిఇఒ సుందర్ పిచాయ్ వీడియోకాల్‌లో వెల్లడించారు.

## భారత్‌లో 70 కోట్లు దాటిన

# ఫోన్‌పే యూజర్లు

**ముంబయి, ఏప్రిల్ 30:** భారత డిజిటల్ పేమెంట్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న ఫోన్‌పే మరో రికార్డు సాధించింది. ప్లాట్‌ఫామ్‌పైరిజిస్టర్డ్ యూజర్ల సంఖ్య 70కోట్లు దాటినట్లు గురువారం అధికారికంగా ప్రకటించింది. దేశ జనాభాలో ఇంత భారీ స్థాయిలో యూజర్లను కలిగి ఉండటం, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవల పంపిణీలో ఫోన్‌పే ఎంతగా విస్తరించిందో తెలియజేస్తోంది. ప్రతి 6 రోజులకు 10 లక్షల కొత్త యూజర్లు చేరుతున్నట్లు ప్రకటించింది. తొలినాళ్లలో మొదటి 10లక్షల మంది వినియోగదారులను చేరడానికి 136రోజులు తీసుకోగా ప్రస్తుతం కేవలం 6రోజుల్లోనే 10 లక్షల మంది కొత్త యూజర్లు తమ ప్లాట్‌ఫామ్‌లో చేరుతున్నారని కంపెనీ తెలిపింది. 2023నుంచి 2025 ఆర్థికసంవత్సరం వరకు, ఫోన్‌పే 56.25 శాతం స్థిరమైన వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. వినియోగదారుల నమ్మకం, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, సులభమైన, సురక్షితమైన డిజిటల్ చెల్లింపుల అనుభవాన్ని అందించడంపై దృష్టి పెట్టడమే ఈ వృద్ధికి ప్రధాన కారణం.




## నేటినుంచి కొన్ని రూల్స్‌లో

# మార్పులు, చేర్పులు

**ముంబయి, ఏప్రిల్ 30:** మేనెల ప్రారంభం అవుతుండటంతో పలు నిబంధనలు, పలు సవరణలు, మార్పులు చేర్పులుఅమలులోకి వస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కాను న్నాయి. ప్రతి నెలా మొదటి తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలో మే 1న గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ల ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం సాధారణ కుటుంబాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్ల వరకు అందరిపైనా పడుతుంది. ఇకపై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేస్తోంది. డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ విధానాన్ని తప్పనిసరి. వినియోగ దారుడు ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.